ఆంధ్రజ్యోతి
3
ANDHRAJYOTHY
ప్రకాశం
జిల్లా వార్తలు
ఆదివారం 7, డిసెంబరు 2025



ఓబీసీలో తక్కువగా ప్రవహిస్తున్న నీరు

సాగునీటి పంపిణీ అస్తవ్యస్తం

జిల్లాకు తగ్గిన సాగర్ జలాలు

వాటా ప్రకారం సాధించడంలో విఫలమవుతున్న అధికారులు

అధికంగా వాడుకుంటున్న ఉమ్మడి గుంటూరు జిల్లా రైతులు

ఓబీసీ పరిధికి తీవ్ర అన్యాయం

ఎన్నెస్పీ పరిధిలో సాగునీటి పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. జిల్లాకు తక్కువగా నీరు విడుదల చేస్తుండటంతో చివరి ఆయకట్టుకు చేరడం లేదు. వాటా ప్రకారం సాధించడంలో జిల్లా అధికారులు విఫలమవుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా రైతులు యథేచ్ఛగా అధికంగా నీటిని వాడుకుంటున్నప్పటికీ పట్టించుకున్న నాథుడు లేడు. దీంతో రెండో జోన్ పరిధిలోని రైతులకు అన్యాయం జరుగుతోంది. ప్రధానంగా చివరన ఉన్న ఒంగోలు బ్రాంచ్ కాలువ (ఓబీసీ) పరిధిలోని రైతులు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం విడుదలవుతున్న పరిమాణాన్ని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది.

దర్శి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సాగర్ నీటి పంపిణీ ఈసారి గందరగోళంగా మారింది. సాగర్ డ్యామ్ నుంచి కుడి కాలువకు పదివేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా అవి బుగ్గవాగుకు చేరుతున్నాయి. అక్కడి నుంచి 8,845 క్యూసెక్కులు ప్రధాన కాలువకు సరఫరా చేస్తున్నారు. ఆ నీటిలో గుంటూరు బ్రాంచ్ కాలువకు రెండు వేల క్యూసెక్కులు, అద్దంకి బ్రాంచ్ కాలువకు (ఏబీసీ) 1,510 క్యూసెక్కులు, ఏబీసీలోని 18వ మైలు (ప్రకాశం బార్డర్)కు వెయ్యి క్యూసెక్కులు, సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలు (ప్రకాశం సరిహద్దు)కు 2,179 క్యూసెక్కులు పంపిణీ చేస్తున్నారు. వాటా ప్రకారం జిల్లాకు నీటి తరుగుపోను 43 శాతం విడుదల చేయాలి. అధికారుల లెక్కల ప్రకారం సాగర్ కుడి కాలువకు పదివేల క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా జిల్లా సరిహద్దుకు వచ్చేసరికి 85మైళ్ల దూరానికి మైలుకు పది క్యూసెక్కుల చొప్పున 850 క్యూసెక్కుల నీరు వృథా కింద పోతుంది. 9,150 క్యూసెక్కుల నికర జలాల్లో 43శాతం వాటా ప్రకారం 3,850 క్యూసెక్కులు జిల్లాకు అందాలి. ప్రస్తుతం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అద్దంకి బ్రాంచ్ కాలువ 18వ మైలుకు (ప్రకాశం బార్డర్) వెయ్యి క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

ఓబీసీకి తీవ్ర అన్యాయం

ప్రస్తుతం పమిడిపాడు బ్రాంచ్ కాలువకు(పీబీసీ) 655 క్యూసెక్కులు, ఒంగోలు బ్రాంచ్ కాలువకు (ఓబీసీ) 568 క్యూసెక్కుల నీరు మాత్రమే సరఫరా అవుతుంది. సుమారు 1.70 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నా ఓబీసీకి అతి తక్కువగా నీరు సరఫరా అవుతుండటంతో చివరి భూములకు చేరక రైతులు గగ్గోలుపెడుతున్నారు. ఓబీసీలో 800 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తేనే అన్ని మేజర్లు, మైనర్లకు నీరందుతుంది. జిల్లా అధికారులకు ఈ విషయం స్పష్టంగా తెలిసినా సాగునీటి పంపిణీలో సమన్వయంపై దృష్టిపెట్టడం లేదు. చివరి ఆయకట్టు రైతులు గొడవ చేసినప్పుడు కొద్దిరోజులు కొంతమేరకు ఓబీసీకి నీటి పరిమాణం పెంచుతున్నారు. ఆ తర్వాత మళ్లీ యథాతథ పరిస్థితి. అతి తక్కువగా నీరు విడుదల చేస్తూ రైతులను ఇబ్బందిపెడుతున్నారు. ఒకపక్క తొలుత వరినాట్లు వేసిన రైతులు పంట కోస్తుండగా, చివరి ఆయకట్టు భూముల రైతులు ఇప్పుడు వరినాట్లు వేస్తున్నారు. ఇలాంటి దయనీయ పరిస్థితుల్లో కూడా చివరన ఉన్న ఓబీసీకి అతితక్కువగా నీరు విడుదల చేయటం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వాస్తవ పరిస్థితిని గుర్తించి జిల్లాకు వాటా ప్రకారం నీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వాటా ప్రకారం సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలు (ప్రకాశం సరిహద్దు)కు 2,850 క్యూసెక్కుల నీరు సరఫరా చేయాలి. ప్రస్తుతం 2,179 క్యూసెక్కుల నీరు మాత్రమే ఉన్నతాధికారులు అందిస్తున్నారు.

650 క్యూసెక్కులు ఏవీ?

అధికారుల లెక్కల ప్రకారం జిల్లాకు ఇంకా 650 క్యూసెక్కులు విడుదల చేయాలి. ఈ నీటి మొత్తాన్ని గుంటూరు జిల్లా రైతులు అదనంగా వాడుకుంటుండటంతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని రైతులకు తీరని అన్యాయం జరుగుతోంది. జిల్లాకు తక్కువగా నీరు విడుదలవుతుండటంతో ఆ ప్రభావం బ్రాంచ్ కాలువలపై పడుతోంది. ఈ కాలువ పరిధిలో కర్షకులకు అన్యాయం జరుగుతోంది.

మందగమనం

- కొనసాగుతున్న స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ
- జిల్లావ్యాప్తంగా 48వేల వరకు పెండింగ్
- కార్డుదారులు ఎక్కడ ఉన్నారో తెలియని పరిస్థితి
- పట్టణ ప్రాంతాల్లోనే అధికంగా ఆగిన వైనం
- ఒంగోలులోనే 8వేలకుపైగా పెండింగ్

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్మార్ట్ రైస్ కార్డులను లబ్ధిదారులకు అందించేందుకు కష్టపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నెల రోజులకుపైగా పంపిణీ చేస్తున్నప్పటికీ ఇంకా 48వేల కార్డుల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. పట్టణ కేంద్రాల్లో ఎక్కువగా ఆగిపోయాయి.



జిల్లాలోని కొన్ని మండలాల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారదర్శకంగా రేషన్ పంపిణీ చేసేందుకు ప్రస్తుతం ఉన్న తెల్లరేషన్ కార్డు స్థానంలో స్మార్ట్ రైస్‌కార్డులను అందుబాటులోకి తెచ్చింది. వాటి ద్వారా.. రేషన్‌షాపుల నుంచి ఇచ్చే నిత్యావసర సరుకులను పక్కాగా అందించడంతోపాటు కార్డుదారులు అన్ని అవసరాలకు ఆ కార్డును వినియోగించుకునే విధంగా క్యూఆర్ కోడ్‌ను కూడా పొందుపర్చింది. గత నెలలోనే రేషన్ పంపిణీ పూర్తిచేసే లోపు అందరికీ స్మార్ట్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఆ సమయంలో ఇంకా 60వేలకుపైగా పెండింగ్‌లో ఉండటంతో నెలాఖరు వరకు గడువు విధించింది. ఆతర్వాత మరో 20వేల మందిని గుర్తించి వారికి స్మార్ట్ కార్డులను అందించారు.

ఇంకా డీలర్ల వద్దనే కార్డులు

జిల్లాలో ఇంకా 48వేల కార్డులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం మొత్తం 6,51,820 స్మార్ట్‌కార్డులను మంజూరు చేయగా ఇప్పటి వరకు 6,03,995 కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మరో 47,995 స్మార్ట్‌కార్డులు

మిగతా 6లో...



ఎస్సీ, ఎస్టీ కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చేయాలి

- విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో మంత్రి స్వామి 6



అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి స్వామి, కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యేలు జనార్దన్, బీఎన్

దార్శనికుడికి ఘన నివాళి

వాడవాడలా అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలు

ఒంగోలులో పాల్గొన్న మంత్రి డాక్టర్ స్వామి

పలుచోట్ల ప్రజాప్రతినిధులు హాజరు

ఉత్సాహంగా పాల్గొన్న దళిత, ప్రజాసంఘాలు

ఒంగోలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 69వ వర్ధంతి కార్యక్రమాలు శనివారం ఘనంగా జరిగాయి. జిల్లావ్యాప్తంగా వివిధ పట్టణాలు, మండల కేంద్రాలతోపాటు అనేక గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు వివిధ వర్గాల ప్రజలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సభలు, సమావేశాలు నిర్వహించారు. ఒకవైపు అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో, మరోవైపు వివిధ రాజకీయ పార్టీలు, దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు. అక్కడక్కడా సామాజిక సేవా కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. ఒంగోలులోని హెచ్‌సీఎం కళాశాల సెంటర్ వద్ద జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి

మిగతా 6లో...

వామ్మో స్క్రబ్ టైఫస్

- గుంటూరు జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ మహిళ మృతి
- మృతురాలు వైపాలెం హైస్కూల్ కుక్
- దర్శిలో మరో కేసు నమోదు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్క్రబ్ టైఫస్ ప్రబలుతోంది. దానిబారినపడి ఎర్రగొండపాలెంకు చెందిన పి.దానమ్మ (61) గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందారు. దానమ్మ గత నెల 16న అనారోగ్యానికి గురయ్యారు. రెండ్రోజులు స్థానికంగానే వైద్యసేవలు పొందారు. అయినా తగ్గకపోవడంతో గతనెల 18న కుటుంబసభ్యులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్యం కుదుటపడకపోవడంతో 29వతేదీన పరీక్షలు చేశారు. వాటిల్లో ఆమెకు స్క్రబ్ టైఫస్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. అక్కడే చికిత్స పొందుతున్న ఆమె శనివారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆ

మిగతా 6లో...

కాల్ చేసుకుంటానంటూ కాజేశాడు

సెల్‌ఫోన్ నుంచి నగదు బదిలీ చేసుకున్న వ్యక్తి అరెస్ట్

వినూత్న రీతిలో సైబర్ నేరాలు

అప్రమత్తంగా ఉండాలని కోరిన సీఐ ప్రసాద్

చీమకుర్తి, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఆపదలో ఉన్నాడని పాపం తలచి ఫోన్ ఇస్తే అకౌంట్లలోని నగదును కాజేసే వినూత్న సైబర్ నేరాలకు పాల్పడేవారు తారసపడుతున్నారు. ముఖ్యంగా వయస్సు మళ్లిన వారు కీప్యాడ్ ఫోన్లు వాడుతుంటారు. అలాంటి వారిని లక్ష్యంగా చేసుకొని వారి వద్ద నుంచి అర్జంట్‌గా ఒక కాల్ చేసుకుంటానని ఫోన్ తీసుకొని వారి బ్యాంకు అకౌంట్ల నుంచి నగదును

మిగతా 6లో...



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

పోలీసు శాఖలో హోంగార్డులు అంతర్భాగం

- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు
- ఒంగోలులో హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవ ర్యాలీ

6

పూర్వవైభవం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు పూర్వవైభవం తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన గ్రామపంచాయతీలకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఆర్థిక సహకారంతోపాటు స్థానికంగా ఆదాయ వనరులను సమకూర్చుకునే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.



బేస్తవారపేటలో పారిశుధ్య నిర్వహణను పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

పంచాయతీలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

ఆదాయ వనరుల పెంపునకు చర్యలు

అధికారులు వారంలో ఐదు రోజులపాటు గ్రామాల్లో పర్యటించే విధంగా దిశానిర్దేశం

వినియోగంలోకి సంపద కేంద్రాలు

అందులోభాగంగా గ్రామాలను నిరంతరం పర్యవేక్షించడంతోపాటు జవాబుదారీతనం పెంచే విధంగా చూస్తున్నారు. అందుకోసం క్షేత్రస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పనిచేసే ఆ శాఖ అధికారులు నిరంతరం గ్రామాల్లో పర్యటించేలా ప్రణాళికలు రూపొందించి అమలుచేస్తున్నారు. జిల్లాలో 729 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలో పరిపాలన మెరుగుతోపాటు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు కూడా అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. గ్రామాల్లో చెత్త సేకరణ ద్వారా ఆదాయ వనరులు సృష్టించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. అందుకోసం ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు చర్యలు ప్రారంభించారు.

వినియోగంలోకి చెత్త సంపద కేంద్రాలు

జిల్లాలో 729 గ్రామపంచాయతీలు ఉండగా 604 చోట్ల చెత్తసంపద కేంద్రాలను వినియోగంలోకి తెచ్చారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రప్రభుత్వ సహకారంతో గ్రామపంచాయతీలకు ఆదాయ వనరులను సమకూర్చుకునేందుకు చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టిపెట్టి చెత్తసంపద కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో మూలనపడ్డాయి. తిరిగి 2024లో జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూలనపడ్డ చెత్తసంపద కేంద్రాలను వినియోగంలోకి తెచ్చారు. అయితే ప్రస్తుతం 604 చెత్తసంపద కేంద్రాలు వినియోగంలోకి రాగా మిగిలిన కేంద్రాలను పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకున్నారు. ఆ చెత్తసంపద కేంద్రాల ద్వారా ఆయా పంచాయతీలకు ఆదాయవనరులు పెరగనున్నాయి. ఒక్కో గ్రామపంచాయతీలో 250 కుటుంబాలు లేదా వెయ్యి మంది జనాభాకు ఒక క్లాప్‌మిత్రను ఏర్పాటు చేశారు. వారు ఇంటింటికీ తిరిగి ప్రతిరోజూ సేకరించిన తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఒక్కో సంపద కేంద్రం ద్వారా ఒక క్లాప్‌మిత్ర నెలకు రూ.10వేల ఆదాయం పొందే విధంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు.

ఐవీఆర్‌ఎస్ గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో ప్రభుత్వం ఎంపిక చేసిన 250 గ్రామాల్లో ప్రభుత్వం ఐవీఆర్‌ఎస్ ద్వారా పారిశుధ్య నిర్వహణపై ఫోన్ ద్వారా ఏ రోజుకారోజు ప్రజల నుంచి సమాచారం సేకరిస్తోంది. మరోవైపు ప్రభుత్వం క్షేత్రస్థాయితోపాటు జిల్లా అధికారులు ఆయా గ్రామాల్లో ఉదయం 6 గంటల

మిగతా 6లో...



కాలువలను పునరుద్ధరించుకుంటున్న రైతులు

ముప్పవరం గ్రామంలో వేసిన శనగ పంట

వరికి సై..

- మాగాణి సాగుకు అన్నదాతల సమాయత్తం
- 20 ఏళ్ల తరువాత రైతులు సిద్ధం
- ముమ్మరంగా కలువల పునరుద్ధరణ పనులు

మర్రిపూడి, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : మర్రిపూడి పెద్దచెరువు 20 ఏళ్ల తరువాత పూర్తిస్థాయిలో జలకళను సంతరించుకుంది. రెండు దశాబ్దాలుగా చెరువు కింద 450 ఎకరాల ఆయకట్టులో వరిసాగు చేయకపోవడంతో సిరులు పండాల్సిన మాగాణి భూములు చిల్లచెట్లు పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు చెరువు పూర్తిస్థాయిలో నిండింది. దీంతో ఆయకట్టు రైతులు వరిసాగు చేసేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. సాగుకు నోచుకోపోవడంతో కాలువుల, తూములు శిథిలావస్థకు చేరాయి. దీనికితోడు 20 ఏళ్లగా చెరువు తూములను మరమ్మతులు చేయకపోవడంతో చెరువులో చేరిన నీరు వృథాగా వాగుపాలు అవుతోంది. దీంతో ఆగమేఘాల మీద తూములను మట్టితో పూడ్చి తాత్కాలికంగా నీరు నిలుపుదల చేశారు. అయితే చెరువులో నీరు ఉండటంతో వరిసాగు చేపట్టాలని రైతులు నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో శిథిలమైన కాలువలను పునరుద్ధరించేందుకు రైతులు స్వచ్ఛందంగా వచ్చి పనులు చేపట్టారు. ఇప్పటికే వరినార్లు పోసుకొని నాట్లకు సమాయత్తం అవుతున్నారు. మండలంలోకెల్లా అతిపెద్ద చెరువైన మర్రిపూడి చెరువు కింద వరిసాగు జరిగితే రెండు, మూడు సంవత్సరాలపాటు గ్రామస్తులకు ఆహారధాన్యాల కొరత తీరుతుంది. వేలాది పశువులకు పశుగ్రాసం లభిస్తుంది. మట్టితో పూడ్చిన తూములను వెంటను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు. ఆ మేరకు ఇరిగేషన్ అధికారులు నాలుగు రోజుల్లో తూములను పునరుద్ధరించి ఆయకట్టుకు నీరు అందిస్తామని ఏఈ నవీన్ తెలిపారు. రెండు దశాబ్దాల తరువాత వరిసాగు జరుగుతుండటంతో గ్రామస్తుల్లో ఆనందోత్సహాలు వెల్లువెత్తున్నారు.

శనగకు నై..

- తగ్గిన శనగ విస్తీర్ణం
- నామమాత్రంగానే సాగు
- వేలాది ఎకరాల నుంచి వందలకు పరిమితం
- ధరలేక రైతులు విముఖత

కొండపి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): కొండపి నియోజకవర్గంలో శనగ సాగు తగ్గిపోయింది. గతంలో వేలాది ఎకరాల్లో సాగయ్యే పంట ప్రస్తుతం వందల ఎకరాలకు పరిమితమైంది. ధర లేకపోవడమే ఇందుకు కారణమని రైతులు చెబుతున్నారు.

కొండపి, జరుగుమల్లి, టంగుటూరు రింగ్‌రోడ్డులోని దాదాపు 50కిపైగా గ్రామాల్లో శనగ సాగు పదేళ్లక్రితం భారీగా ఉండేది. ఒక్కొక్క మండలంలో దాదాపు 7500 ఎకరాల నుంచి 10 వేల ఎకరాల వరకు శనగసాగును రైతులు చేసేవారు. ఇపుడు ఒక్కొక్క మండలంలో వెయ్యి ఎకరాలు కూడా పట్టుమని రైతులు ఈఏడాది సాగు చేయలేదు. గడచిన ఏడాది మినహా వరుసగా నాలుగేళ్ల పొగాకు పంట సాగుతో రైతులకు ఎంతోకొంత ఆదాయం వచ్చింది. దీంతో క్రమంగా శనగ విస్తీర్ణం తగ్గించి పొగాకు సాగుకు రైతులు మొగ్గారు. క్రమంగా పొగాకు సాగు పెంచుకుంటూ వెళ్లారు. అయితే 2014-25 సీజన్‌లో పొగాకు ధరలు పతనమయ్యాయి. దీంతో రైతులు పొగాకు సాగును తగ్గించుకోవాలనుకున్నారు. అయితే నిరుడు, కిత్రం ఏడాది పండించిన శనగలు కోల్డ్‌స్టోరేజీల్లో వేల క్వింటాళ్లు మగ్గుతున్నాయి. శనగలు క్వింటాల్ ఐదు వేల రూపాయలు కూడా లేకపోవడంతో రైతులు ఈ ఏడాది శనగ పంట సాగుకు ఉత్సాహం చూపలేదు. పొగాకు పంటకు ధరలు లేకపోయినా సరే శనగ సాగుకు ఉపక్రమించలేదు. దీనికి కారణం శనగల ధరలు లేకపోవడమేనని రైతులు అంటున్నారు. ఐదేళ్ల క్రితం జరగుమల్లి మండలంలో శనగ 7000 ఎకరాలు ఉండగా, క్రమంగా సాగు విస్తీర్ణం తగ్గుతూ వచ్చింది. ఈ ఏడాది ఇప్పటి వరకు వెయ్యి ఎకరాల్లో మాత్రమే శనగ సాగు చేశారు. కొండపి మండలంలో కూడా ప్రస్తుతం దాదాపు 1200 ఎకరాలు మాత్రమే శనగ సాగు చేశారు. టంగుటూరు మండలంలో కూడా శనగ సాగు తగ్గిపోయింది. ఈ ఏడాది అధిక వర్షాలు కూడా శనగ సాగు తగ్గిపోవడానికి కారణమని రైతులు అంటున్నారు. అధిక వర్షాలను తట్టుకుని శనగ దిగుబడి రాదని భావించి రైతులు తిరిగి పొగాకు సాగువైపు మొగ్గు చూపారని రైతులు అంటున్నారు. కాగా ఈ ఏడాది జామాయిల్ సాగు ఈ మూడు మండలాల్లో కొద్దికొద్దిగా పెరిగిందని, వచ్చే ఏడాదికి సామాజిక వనాలైన సుబాబుల్, జామాయిల్, చౌక చెట్ల సాగు పెరుగుతుందని రైతులు అంటున్నారు.

రైతులకు హాని కలిగించే బిల్లులను ఉపసంహరించుకోవాలి

- 8నుంచి మూడు రోజుల పాటు నిరసనలు
- సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు హాని కలిగించే ముసాయిదా విత్తన, విద్యుత్ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆ బిల్లులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి మూడు రోజుల పాటు గ్రామాల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విత్తన, విద్యుత్ బిల్లుల ముసాయిదాను ప్రకటించి ఈనెల 11లోపు తమ అభిప్రాయాలు తెలపాలని కోరిందన్నారు. అమెరికాతో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌కు సిద్ధమవుతున్న సమయంలో కేంద్రం ఈ బిల్లును ప్రకటించడం రైతులను మోసం చేసే కుట్ర దాగి ఉందని ఆరోపించారు. అమెరికా, ఐరోపా విత్తన కార్పొరేట్ సంస్థల జన్యుమార్పిడి విత్తనాలను ఎలాంటి అంక్షలు లేకుండా ఉచితంగా దిగుమతి చేసుకునే వెసులుబాటు కలిగిస్తూ మన దేశ రైతులను తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేస్తుందన్నారు. అందువల్ల ఈ కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డే హనుమారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాల పరిధిలో ఉన్న వ్యవసాయ రంగాన్ని కేంద్రప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకుని ఫెడరల్ విధానానికి విఘాతం కలిగిస్తుందన్నారు. అందుకు సీఎం చంద్రబాబునాయుడు వంతపలకడం సిగ్గుచేటన్నారు. ఆచార్యరంగ కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ బ్రాండెడ్ కంపెనీ విత్తనాలను వాడాలని నిబంధన ప్రమాదకరమైందన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ విత్తనాలు భద్రపరిచి వాడుకునే సంప్రదాయ ప్రక్రియ ఉందన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలు 80శాతం అనుమతి లేని విత్తనాలను గతంలో పెనాల్టీ వేసే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత బిల్లు ప్రకారం మొదటి రెండు తప్పులకు పెనాల్టీ లేదని, తప్పులు నిర్ణయించడానికి ఒక ఆఫీసర్‌ను నియమించిందని పేర్కొన్నారు. ఆఫీసర్లను మేనేజ్ చేయడం కార్పొరేట్ కంపెనీలకు వెన్నతో పెట్టిన విద్య అని అందువల్లఈ విధానాలను ఉపసంహరించుకోవాలన్నారు.

రేపు క్విస్‌లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

- పర్చువల్‌గా పాల్గొననున్న ప్రధానమంత్రి మోదీ



మాట్లాడుతున్న నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్, అఖిల భారత సాంకేతిక విద్యామండలి జాతీయ స్థాయిలో ఈనెల 8, 9 తేదీల్లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-25 నిర్వహించనుంది. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ సాఫ్ట్‌వేర్ ఎడిషన్ ఫైనల్ పోటీలకు ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఆతిథ్యం ఇవ్వనుందని విద్యా సంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శనివారం కళాశాలలో అవిష్కరించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌కు క్విస్ కళాశాల మూడోసారి ఆతిథ్యం ఇస్తోందని తెలిపారు. గతంలో హార్డ్‌వేర్ ఎడిషన్, సాఫ్ట్‌వేర్ ఎడిషన్ నిర్వహించామని, ఈ ఏడాది సాఫ్ట్‌వేర్ ఎడిషన్‌కు అతిథ్యం ఇస్తున్నట్లు తెలిపారు. క్విస్ కళాశాలకు మూడోసారి అవకాశం ఇచ్చినందుకు ఐఏసీటీఈ, విద్యామంత్రిత్వశాఖ ఇన్నోవేషన్ సెల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీలో కేవలం మూడు కాలేజీలను మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందని, అందులో తమ కళాశాల ఒకటి అని చెప్పారు. వివిధ రాష్ట్రాల నుంచి 20 టీములు ఈ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో పాల్గొని నాలుగు ప్రాబ్లమ్ స్టేట్‌మెంట్లకు పరిష్కారాలను గుర్తిస్తారన్నారు. క్విస్‌తోపాటు దేశంలోని పలు రాష్ట్రాల్లోని 60 విద్యాలయాలు, ఐఐటీల్లో జరిగే ఈ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో ప్రధానమంత్రి మోదీ ఈనెల 8వ తేదీన పర్చువల్‌గా విద్యార్థులతో మాట్లాడతారన్నారు. వికసిత భారత్, ఆత్మ నిర్భర భారత్, మేక్ ఇన్ ఇండియా లక్ష్యంగా ఇన్నోవేషన్ తదితర అంశాలపై ప్రధాని మాట్లాడతారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు, ఎస్ఐహెచ్-25 క్విస్ నోడల్ సెంటర్ కన్వీనర్ డాక్టర్ డి. బుజ్జిబాబు, కో కన్వీనర్ డాక్టర్‌భార్గవ్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు ఉన్నారు.

8160 మంది పోటీదారులు

స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కోసం దేశ వ్యాప్తంగా 1,42,715 టీమ్‌లు తమ ఐడియాలతో ముందుకు రాగా వారిలో 1360 టీమ్‌లను ఫైనల్స్‌కు ఎంపిక చేశారు. మొత్తం 60 నోడల్ సెంటర్లలో సుమారు 8160 మంది పోటీ పడనున్నట్లు ఏఐసీటీఈ ప్రకటించింది. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ లక్ష్యంగా వివిధ రాష్ట్రాల విద్యార్థులను వేర్వేరు రాష్ట్రాల్లో నోడల్ సెంటర్లకు పంపేలా చర్యలు తీసుకుంటున్నారు. ఒక జట్టుగా ప్రాబ్లమ్ స్టేమ్‌మెంట్లపై పరిష్కారం చూపనున్నారు.

ఐసీడీఎస్‌లో వన్ ఉమెన్ ఆర్మీ

- కొండపి ప్రాజెక్ట్‌లో ఒక్కరే సూపర్‌వైజర్
- అంగన్‌వాడీ కార్యకర్తలతోనే లెక్కలు

కొండపి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): కొండపి ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ, నిఘా కొరవడింది. ప్రాజెక్ట్ పరిధిలో మూడు మండలాలు ఉన్నాయి. అన్నిటికీ కలిపి ఒక్కరే సూపర్‌వైజర్ పనిచేస్తున్నారు. దీంతో రికార్డులు నమోదు, పరిశీలన, కేంద్రాల పరిశీలనలు అంతంతమాత్రంగా సాగుతున్నాయి. కొండపిలోని సెక్టార్-1లో ఉన్న ఒక్క సూపర్‌వైజరే కొండపి-2, మర్రిపూడి, పొన్నలూరు మండలం అన్నిటి బాధ్యతలు చూస్తున్నారు. కొండపి మండలానికి మరొకరు, మర్రిపూడి మండలానికి ఇద్దరు, పొన్నలూరు మండలానికి ఇద్దరు సూపర్‌వైజర్‌లు ఉండాలి. ఒక్కరితోనే గడచిన ఏడాదిగా కార్యక్రమాలను నడిపిస్తున్నారు. ప్రాజెక్ట్ సీడీపీవో, సూపర్‌వైజర్ మాత్రమే ప్రాజెక్ట్ కార్యక్రమాలను నడిపిస్తున్నారు. దీంతో కేంద్రాల పర్యవేక్షణ నామమాత్రంగా మారింది. గడచిన ప్రభుత్వంలో సూపర్‌వైజర్ పోస్టులకు పరీక్షలు నిర్వహించారు. అయితే ప్రమోషన్ల విషయంలో కోర్టుకు అర్జులు వెళ్లడంతో సూపర్‌వైజర్‌ల నియామయ ప్రక్రియ నిలిచిపోయిందని అంగన్‌వాడీ కార్యకర్తలు అంటున్నారు. ఈప్రభుత్వం వచ్చాక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో కొండపితోపాటు పలు ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ల్లో సూపర్‌వైజర్లు కొరతగా ఉందని తెలిసింది. ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించి ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ల్లో సూపర్ వైజర్‌లను నియమించాలని కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	143, 152, 163
చికెన్ విత్ స్కిన్(కిలో)	274.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	284.00



అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న బీఎన్

చీమకుర్తి మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే విజయ్‌కుమార్
- పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

చీమకుర్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలను శనివారం సాయంత్రం నిర్వహించారు. దాదాపు కోటి రూపాయలకు పైగా నిధులతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ప్రారంభించారు. తదుపరి మరో కోటి రూపాయలకు పైగా నిధులతో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చీమకుర్తి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ మన్నం రాజేశ్వరి, మన్నం ప్రసాద్, కమిషనర్ రామకృష్ణయ్య, కౌన్సిలర్లు గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజలి, సొసైటీ చైర్మన్ పూనాటి వెంకట్రావు, పట్టణ అధ్యక్షుడు ముప్పూరి చలమయ్య, నాయకులు కాట్రగడ్డ రమణయ్య, యడ్లపల్లి రామబ్రహ్మం, కందిమళ్ల గంగాధరరావు, రావిపాటి రాంబాబు, సూరంపల్లి హనుమంతరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, గంగుల శివపార్వతి, తోపూరి సుజాత, కట్టా రమణయ్య, పాపిరెడ్డి, రఫీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కన్నులపండువగా కనకదుర్గమ్మ నగరోత్సవం



చీమకుర్తి పట్టణంలో సాక్షిరామలింగేశ్వరస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ భవానీ అమ్మవారి నగరోత్సవం కార్యక్రమాన్ని శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 516 కలశాలు చేబూని పట్టణంలో ఊరేగింపుగా మహిళలు తరలివచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సోమరాజుపల్లి వెంకటేశ్వరశర్మ, రాఘవేంద్రశర్మ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- చీమకుర్తి, ఆంధ్రజ్యోతి

అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో సంక్షేమ పాలన

- ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్
- ఘనంగా రాజ్యాంగ నిర్మాత వర్ధంతి కార్యక్రమాలు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఒంగోలులోని ఎన్జీవో హోమ్‌లో మాదిగ సంక్షేమ పోరాట సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ 69వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఎస్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్ మాదిగ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్, లీడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్ హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. నగరంలో తాను ఎమ్మెల్యేగా రూ.3కోట్లతో అంబేడ్కర్ భవనాన్ని ఆధునికీకరణ చేసినట్లు తెలిపారు. దీంతోపాటుగా మరో రూ. 75లక్షలతో అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేసి, అంబేడ్కర్ జయంతి నాటికి సిద్ధం చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం ద్వారానే తాము ఎమ్మెల్యేలుగా ఎదిగామన్నారు. లీడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, డీఆర్వో చిన ఓబులేసు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, దళిత కవులు, కళాకారులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..

అంబేడ్కర్ వర్ధంతి వేడుకలను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక హెచ్‌సీఎం కాలేజి ఎదురు ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు గుంటూరు ప్రభుదాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి తిరువీధి బాబు, మండల అధ్యక్షులు కనుమూరి సుబ్బారావు, రవి, రాజబాబు, ఆనంద్, సురేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంలో..

ఒంగోలు కలెక్టరేట్: ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో శనివారం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదేన్న, డాక్టర్ మాదిసి వెంకయ్య, వైఎం. ప్రసాద్‌రెడ్డిలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బొట్లా రామారావు, వై.వెంకటేశ్వరరావు, కటారి శంకర్, గాలిమూటి దేవప్రసాద్, బొట్లా సుబ్బారావు, పసుమర్తి గోపీచంద్, డీఎస్.క్రాంతికుమార్, ఉన్నం జనార్దన్, వేమా శ్రీనివాసరావు, రొండా అంజిరెడ్డి, దేవరపల్లి అంజిరెడ్డి, యరజర్ల రమేష్, తాతా నరసింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక గాంధీనగర్‌లోని భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. కేవీపీఎస్ నాయకుడు చీకటి శ్రీనివాసరావు నివాళులర్పించారు. సురేష్, జబ్బార్, ఎస్‌డీ.హుస్సేన్ పాల్గొన్నారు.

- ఆల్‌ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు షేక్ అజీజ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి ధరణికోట లక్ష్మీనారాయణ, డాక్టర్ తాతాపూడి ప్రభుదాస్, చావలి సుధాకర్, ప్రసాద్, అయ్యప్ప, ఏల్చూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

- ఏపీ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక సరస్వతి జూనియర్ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు రాయపాటి జగదీష్, ఈస్టర్ పాల్, సూర్య, రాము తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్, పలువురు అధికారులు, నాయకులు

జిల్లా గ్రంథాలయంలో..

ఒంగోలు కల్చరల్: అంబేడ్కర్ వర్ధంతిని ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో డిప్యూటీ లైబ్రేరియన్ కాళహసి సంపూర్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ, ఎస్‌కే.బాబు, నల్లమల్లి పాండురంగనాథం, పాఠకులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా పోర్ట్ ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఏపీ చైర్మన్ షేక్ ఖలీఫాతుల్లా బాషా, ఉపాధ్యక్షురాలు షేక్ సిద్దాంబి ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రావినూతల కోటి మాదిగ, పఠాన్ సాజిద్ ఖాన్, కరిముల్లా, చేవూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పలు సంస్థల ఆధ్వర్యంలో..

ఒంగోలు నగరం : కేవీపీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి రఘురామ్ ఆధ్వర్యంలో స్థానిక హెచ్‌సీఎం కళాశాల వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళుర్పించారు. వేశపోగు మోజెస్, దిడ్ల నారాయణరావు, గూడవల్లి వెంకటేశ్వర్లు, గద్దల లాజర్ పాల్గొన్నారు.

- స్థానిక వాణిజ్య పన్నుల అధికారి కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. సర్కిల్-1 అసిస్టెంట్ కమిషనర్ ఎన్.వెంకటసుబ్బారావు, అసిస్టెంట్ కమిషనర్ చెరుకూరి కోటేశ్వరరావు, ఒంగోలు-2 సర్కిల్ డీసీటీవోలు కె.సుధాకర్, సుగుణ, ఏడుకొండలు, కొప్పోలు సుధాకర్, సరోజిని, రఘుబాల, నీరజ, చౌదరి సుధాకర్, ప్రసన్న, సుబ్బారావు, అహమ్మద్ బాష పాల్గొన్నారు.

- ఆంధ్రకేసరి యూనివర్శిటీలో అంబేడ్కర్ చిత్రపటానికి వీసీ మూర్తి ఘనంగా నివాళులర్పించారు. రిజిస్ట్రార్ బి.హరిబాబు, ప్రిన్సిపాల్ ఎం.నిర్మలమణి, ప్రత్యేక అధికారి జి.రాజామోహన్, దేవకుమార్ పాల్గొన్నారు.

- దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం, వస్త్రదానం చేశారు. డీఆర్వో చినఓబులేసు, నీలం నాగేంద్రరావు, వెంగళరావు, బంగారం, తుల్లిబిల్లి అశోక్, కాకి కృపారావు, దాసరి కనకయ్య పాల్గొన్నారు.

కొత్తపట్నం మండలంలో..

కొత్తపట్నంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో రామలింగం, శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

- కొత్తపట్నంలోని బీచ్‌రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ మండల అధ్యక్షుడు ద్వారబాకుల శ్రీనివాసరెడ్డి, ఇతర నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శింగిరి శ్రీను, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. అల్లూరులో జరిగిన వేడుకల్లో టీడీపీ నేత దాసరి పోలయ్య, జయరావు పాల్గొన్నారు. ఈతముక్కలలో అంబేడ్కర్ యువజన సంఘం కోశాధికారి అమృతపాణి, కుసుకుర్తి శ్రీను, అంజి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సంకువానికుంటలో ఒంగోలు ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు రాజేంద్రబాబు, నవీన్ గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో విజయకుమార్, సురేంద్రనాథ్, రాజ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..



సంతనూతలపాడులో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

సంతనూతలపాడు: మండలంలోని పలు గ్రామాల్లో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, సచివాలయం-1లో జడ్పీటీసీ డి.రమణమ్మ, ఎంపీపీ బి.విజయ, సర్పంచ్ డి.నాగమణి, స్థానిక టీడీపీ కార్యాలయంలోను దళితసంఘాల నాయకులు, మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డి.సురేష్‌బాబు అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు ఎంఈవో వెంకారెడ్డి, ఏపీఎం వాసంతి, నాయకులు బొడ్డపాటి చంద్రశేఖర్, ముప్పరాజు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పొన్నలూరులో..

పొన్నలూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తహసీల్దార్ వి.పుల్లారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే బీఎన్

నాగులుప్పలపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో తేళ్ల రవికుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి సభ, అనంతరం ఒంగోలు జీజీహెచ్, రెడ్‌క్రాస్ సహకారంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 43 మంది రక్తదానం చేశారు. వారిని ఎమ్మెల్యే అభినందించి సర్టిఫికెట్లు, పండ్లు, జ్యూట్ బ్యాగ్‌లను అందించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, ఎంపీపీ నలమలపు అంజమ్మ, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, ఈవీ.రమణయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, నలమలపు కృష్ణారెడ్డి, తిరుమలశెట్టి శ్రీను, మారెళ్ల వెంకటశేషయ్య, గూడూరి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..



అంబేడ్కర్ విగ్రహానికి నాయకుల నివాళి

మద్దిపాడు: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ వర్ధంతిని శనివారం మద్దిపాడులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మండవ రంగారావు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, జజ్జర శరత్‌బాబు, రెబ్బవరపు ప్రభాకర్, ముత్తనపల్లి రామలింగయ్య, దుద్దుకూరి డేవిడ్, శుద్దపల్లి అనిల్, యు.వెంకటేశ్వర్లు, రావి నరసింహారావు, కొచ్చర్ల పోలురాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా అడుగులు

- మంత్రి స్వామి

ఒంగోలు నగరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశయ సాధనకు, అట్టడుగు వర్గాల హక్కుల పరిరక్షణకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. శనివారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఒంగోలులోని హెచ్‌సీఎం కళాశాల సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి మంత్రి స్వామి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్టడుగు వర్గాల హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన మహోన్నతమైన వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం అంబేడ్కర్ అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ ప్రస్తుతం అంబేడ్కర్ పాతది అయినందున దాని స్థానంలో కొత్తగా కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ట్రంకురోడ్డు విస్తరణ అనంతరం ఈ ప్రాంతంతోపాటు అంబేడ్కర్ భవనం వద్ద కూడా కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేస్తామన్నారు. వీరితోపాటు నగర మేయర్ గంగాడ సుజాత, డీఆర్వో చిన ఓబులేసు, సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ వెంకటరావు, దళిత సంఘాల నాయకులు నీలం నాగేంద్రరావు, బిళ్లా వసంతరావు, చప్పిడి వెంగళరావు తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఐఏఎస్‌లపై అనుచిత వ్యాఖ్యలు తగదు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కించపరుస్తూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని ద్రావిడదేశం కృష్ణారావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఐఏఎస్, ఐపీఎస్‌లను అవమానకరంగా సంబోధించడం బీసీ సామాజిక వర్గాన్ని బాధించిందన్నారు. బీసీ కుటుంబంలో జన్మించి ఐఏఎస్ అధికారిగా ఉత్తీర్ణులై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక రంగాల్లో సేవలు అందించిన పి.కృష్ణయ్య బీసీ వర్గాలకు గర్వకారణమన్నారు. వారి సర్వీసులో చిన్న మచ్చ కూడా లేని అధికారిగా తన సేవలను అందించారని, అటువంటి వ్యక్తిని జగన్మోహన్‌రెడ్డి కించపరిచే విధంగా మాట్లాడటం తగదన్నారు. మరో ఐఏఎస్ అధికారి గోపీనాథ్ జెట్టిని కూడా అదే రీతిలో అవమానించే మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వారిపై చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకొని దిద్దుబాటు చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించక తప్పదని ఆయన హెచ్చరించారు.

గోకులం షెడ్లు 15 లోపు పూర్తి చేయాలి

పొన్నలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో డాక్టర్ వి.సుజాత అధ్యక్షతన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అమలు జరుగుతున్న పనుల మీద సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం సుజాత మాట్లాడుతూ గోకులం షెడ్లు ఈ నెల 15వ తేదీ లోపు పూర్తి కావాలని వారికి సూచించారు. సోమవారం నుంచి ప్రతి గ్రామంలో పనులు మొదలుపెట్టాలని తెలిపారు.

ఇరిగేషన్ భూముల ఆక్రమణ పరిశీలన



భూములను పరిశీలిస్తున్న అధికారులు

సంతనూతలపాడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేర్నమిట్టలో ప్రభుత్వానికి సంబంధించిన ఇరిగేషన్ భూముల ఆక్రమణలను ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు శనివారం పరిశీలించి హద్దులు నిర్ణయించారు. పేర్నమిట్టలో సర్వేనెంబరు 25/2లో ఇరిగేషన్ భూముల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు తహసీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, సర్వేయరు రాజేష్ ఆధ్వర్యంలో కొలతలు నిర్వహించారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వస్థలాల వివరాలను త్వరలో ఉన్నతాధికారులకు వివరించిన అనంతరం స్వాధీనం చేసుకుంటామని అధికారులు తెలిపారు. కాగా ఇటీవల పేర్నమిట్టలో 4.62 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించి కట్టిన నిర్మాణాలకు సైతం ఏమేరకు ఆక్రమణలు ఉన్నాయో గుర్తించి స్వాధీనం చేసుకునేందుకు సమాయత్తం అవుతున్నట్లు తెలిసింది.

స్టడీ మెటీరియల్ అందజేత

సంతనూతలపాడు, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని సంతనూతలపాడులోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో శనివారం ఏకేఎస్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనంతయ్య, ఎంపీడీవో సురేష్‌బాబు, ఎంఈవో వెంకారెడ్డి, ట్రస్టు అధినేత అట్లూరి రామారావు, ఎంపీపీ బి.విజయ, సర్పంచ్ డి.నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ చాటిన హోంగార్డ్



శ్యాంబాబును అభినందిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

నాగులుప్పలపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో హోంగార్డులకు శనివారం నిర్వహించిన క్రీడా పోటీల్లో భాగంగా లాంగ్‌జంప్, వాలీబాల్ పోటీల్లో ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన హోంగార్డ్ కొలకలూరి శ్యాంబాబు ప్రతిభ చూపారు. ఆయా పోటీల్లో శ్యాంబాబు ప్రథమ బహుమతి సాధించడంతో ఎస్పీ హర్షవర్ధనరాజు అభినందించారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

మద్దిపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మేరా యువభారత్ హెల్పింగ్ పీపుల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు మాల్యాద్రి మాట్లాడుతూ క్రీడలు స్నేహభావాన్ని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల పీడీ ఆదినారాయణ, పీఈటీ కె.వనజ, సౌజన్య, శ్రీనివాసరావు, ఉపాధి ఏఈ కిషోర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విశాఖలో సీఐటీయూ మహాసభలు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి 4వతేదీ వరకు జరగనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కోరారు. ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో మహాసభలకు సంబంధించి పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సభలో భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని, జిల్లాలోని కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరా రు. కార్యక్రమంలో నాయకులు టి.మహేష్, కె.శ్రీనివాసరావు, టి.విజయమ్మ, వై.రవి, సంతోషమ్మ, శ్రీలక్ష్మీ, అనిత, సింహాద్రి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సురక్షిత నీటిని అందించడం అభినందనీయం

- ఎమ్మెల్యే దామచర్ల
- సర్వేరెడ్డిపాలెంలో కలెక్టర్‌తో కలిసి వాటర్‌ప్లాంట్ ప్రారంభం

ఒంగోలు(రూరల్), డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): భగీరథ కెమికల్ ఫ్యాక్టరీ వారు ప్రజలకు సురక్షిత నీటిని అందించేందుకు వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఒంగోలు మండలం సర్వేరెడ్డిపాలెం గ్రామంలో భగీరథ కెమికట్ ఫ్యాక్టరీ వారిచే రూ.18లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను శనివారం ఎమ్మెల్యే దామచర్ల, కలెక్టర్ రాజాబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీ4లో భాగంలో సర్వేరెడ్డిపాలెం గ్రామంలోని ప్రజలకు మంచినీటిని సరాఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం భగీరథ కెమికల్ ఫ్యాక్టరీ వారు వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయడం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. తాగేనీరు పరిశుభ్రంగా ఉంటే ప్రజల ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. సర్వేరెడ్డిపాలెం గ్రామాన్ని భగీరథ ఫ్యాక్టరీ దత్తత తీసుకోవడం, ఎస్ఆర్‌కే చారిటబుల్ ట్రస్టు వారితో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయటం శుభ పరిణామమన్నారు. కాగా డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ఎస్సీకాలనీలో గల ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే దామచర్ల, కలెక్టర్ రాజాబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, మేయర్ గంగాడ సుజాత, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ నాయబ్‌రసూల్, ఎంపీడీవో కె.రాజశేఖరరావు, భగీరథ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ లింగమనేని వెకంటరామయ్య, ఏఎంసీ చైర్మన్ ఆర్.వెంకటరావు, టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ, నాయకులు మక్కెన శ్రీనివాసరావు, ఫ్యాక్టరీ ప్రతినిధి చెన్నారెడ్డి వాసు తదితరులు పాల్గొన్నారు.



వాటర్‌ప్లాంట్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, కలెక్టర్ రాజాబాబు

పశువుల దాణా పంపిణీ

సర్వేరెడ్డిపాలెంలోని పశు పశుకులకు 50 శాతం సబ్సిడీపై దాణాను ఎమ్మెల్యే దామచర్ల, కలెక్టర్ పి.రాజాబాబు పంపిణీ చేశారు. 80మంది పశుపోషకులకు నాలుగు మెట్రిక్ టన్నుల దాణాను అందజేశారు. కార్యక్రమంలో త్రోవగుంట ఏడీఏ డాక్టర్ ఎ.బసవశంకరరావు, పశువైద్యాధికారి వై.భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

ఒంగోలు క్రైం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత, భారతరత్న అంబేడ్కర్ ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ వి.హర్షవర్ధనరాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రమణకుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అలరించిన వీణానాదం



వీణానాదం కార్యక్రమంలో ఒంగోలు కళాకారిణులు

ఒంగోలు కల్చరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన పలువురు సంగీత కళాకారిణులు తమ వీణానాదంతో ప్రేక్షకులను విశేషంగా అలరించారు. శనివారం శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలోని ధర్మపథం వేదికపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంగీత గురువు తూములూరు నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఒంగోలుకు చెందిన కె.నాగలక్ష్మి, ఎం.మానసి, ఎన్.గీతాప్రవల్లిక, వి.చాందినిదేవసేన తదితరులు వీణపై పలు శాస్త్రీయ గీతాలను తాళ, లయభరితంగా పలికించి దేవస్థాన అధికారుల ప్రశంసలందుకున్నారు. టీవీ, రేడియో కళాకారిణి జగన్మోహిని మృదంగ సహకారం అందజేశారు. అనంతరం వారిని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి, ఇతర అధికారులు ఘనంగా సత్కరించి, స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

గుండ్లాపల్లిలో ఫాగింగ్

మద్దిపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లిలో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ బాలకోటయ్య దోమల నిర్మూలన కోసం మురుగు కాలువల్లో ఎబెట్ మందు పిచికారి చేయించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సురేష్‌కుమార్, ఏఎన్ఎం సుధారాణి, ఎంఎల్‌హెచ్ పి.కీర్తిలక్ష్మి, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నటి సావిత్రి జయంతి

ఒంగోలు కల్చరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మహానటి సావిత్రి జయంతిని శనివారం ఆల్ ఇండియా కళారంగం, పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి, ప్రకాశం జిల్లా కళాకారులు సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో స్వరాంజలి అధ్యక్షురాలు డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ అధ్యక్షతన నటి సావిత్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ, ఎస్‌కే.బాబు, పాండురంగారావు, టి.శ్రీదేవి, టి.గోవిందమ్మ, మధురశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: మద్దిపాడులో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సినీనటి సావిత్రి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మండవ రంగారావు, జజ్జర శరత్‌బాబు, దేవరశెట్టి ఎలమంద, నేలటూరి సత్యనారాయణ, గంట కోటేశ్వరరావు, గంగిశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం బయల్దేరిన యోగా శిక్షకులు

ఒంగోలు(రూరల్), డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం అంజయ్యరోడ్డులో గల ఆరామక్షేత్రంలో 41రోజుల పాటు యోగా శిక్షణ పూర్తి చేసుకున్న వారు శనివారం శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. ఈ బస్సులను నగర కమిషనర్ వెంకటేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. యోగాతో పాటు ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడం వల్ల ఆరోగ్యవంతంగా ఉండవచ్చని చెప్పారు. కార్యక్రమంలో బెజవాడ వెంకట్రావు, మాస్టర్ బత్తినేని సుబ్బారావు, 80 మంది యోగా శిక్షణ పొందిన వారు పాల్గొన్నారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు.


భూరి విరాళం ఇచ్చిన దాతను సన్మానిస్తున్న ఆలయ సభ్యులు

లక్ష్మీనారాయణ స్వామి ఆలయానికి కోటిన్నర భూరి విరాళం

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం జవహర్‌నగర్ కాలనీలో వెలిసిన శ్రీఆమలక లక్ష్మీనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి రూ.1.50 కోట్ల విరాళాన్ని అమెరికాకు చెందిన దుగ్గెంపూడి సత్యనారాయణ రెడ్డి, సుధారాణి దంపతులు అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో శనివారం వారిని సన్మానించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ దుగ్గెంపూడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆలయంలోని ఏసీ కల్యాణ మండపం, ఇతర నిర్మాణాలకు అమెరికాలో స్థిరపడిన తమ కుమారుడు దుగ్గెంపూడి సత్యనారాయణ రెడ్డి కోటి యాభై లక్షలు సమర్పించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు రఘునాథాచార్యులు, చరణ్‌లు దాతలకు శేషవస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు వరలక్ష్మి, వెంకట రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, వేణుగోపాల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందగమనం

(3వపేజీ తరువాయి)

డీలర్ల వద్దనే పెండింగ్‌లో ఉన్నాయి. అంటే జిల్లావ్యాప్తంగా సుమారు 92.46శాతం మందికి స్మార్ట్ కార్డులు అందించారు. ప్రతినెల రేషన్ పంపిణీ కూడా జిల్లాలో 92 నుంచి 93శాతం వరకు పంపిణీ జరుగుతుంది. ప్రస్తుతం స్మార్ట్‌కార్డులు కూడా అంతే మంది తీసుకున్నారు. మిగతా కార్డుదారులు అందుబాటు ఉంటే వెంటనే ఆ కార్డులను తీసుకునేవారు. ఆ కార్డుదారుల కనీస సమాచారం కూడా గ్రామాల్లో కానీ, పట్టణాల్లో కూడా అందుబాటులో లేని పరిస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల్లో కొంత మేర సమాచారాన్ని సేకరిస్తున్నా పట్టణ ప్రాంతాల్లో మాత్రం అది కష్టతరంగా మారింది. ఒకచోట అడ్రసు ఇచ్చి రేషన్ కార్డు పొందగా ఇప్పుడు అడ్రసు ఇచ్చిన ప్రాంతంలో వారు నివాసం ఉండటం లేదు మరికొంత మంది పట్టణ ప్రాంతాలకు పనుల కోసం వచ్చి ఇతర ప్రాంతాలకు వలసలు పోయిన వారు కూడా ఉన్నారు. అటువంటి వారిని గుర్తించడంలో కష్టతరంగా మారడంతో డీలర్లు కూడా ఏమి చేయలేని పరిస్థితి ఏర్పడింది.

ఎంతకీ కొలిక్కిరాని సమాచారం

ప్రస్తుతం రేషన్ పంపిణీ జరుగుతున్న తరుణంలో రేషన్‌షాపుల డీలర్లు ఆ కార్డుల్లో ఉన్న ఫొటోలను చూపించి వివరాలు సేకరించే పనిలో పడ్డారు. అయితే వారు ఇచ్చిన అడ్రసు ప్రకారం తమ ప్రాంతంలో అటువంటి వారు లేరనే సమాచారం వస్తున్నది. దీంతో డీలర్లు కూడా ఆ మిగిలిపోయిన కార్డులను ఏ విధంగా లబ్ధిదారులకు అందించాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. మరోవైపు పౌరసరఫరాల శాఖ అధికారులు కూడా మిగిలిపోయిన స్మార్ట్ కార్డులను పంపిణీ చేసేందుకు అష్టకష్టాలు పడుతున్నా కొలిక్కిరావడం లేదు. ప్రస్తుతం జిల్లాలో భారీగా పెండింగ్ ఉన్న మండలకేంద్రాలు ఇలా ఉన్నాయి. ఒంగోలు 8,417, దర్శి 2,523, వైపాలెం 2,452, మార్కాపురం 2,051, కనిగిరి 1,904, త్రిపురాంతకం 1,843, ఎన్‌జీపాడు 1,784, పుల్లలచెరువు 1,505, ఎస్‌ఎన్‌పాడు 1,435, సింగరాయకొండ 1,410, టంగుటూరు 1,377, కొత్తపట్నం 1,261, గిద్దలూరు 1,202, పామూరు 1,192, పెద్దారవీడు 1,135 స్మార్ట్‌కార్డులు పెండింగ్‌లో ఉన్నాయి. మిగిలిన మండలాల్లో 300ల నుంచి వెయ్యిలోపు పెండింగ్‌లో ఉండటంతో వాటిని పంపిణీ చేసేందుకు అధికారులు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దొంగ అరెస్ట్ - సొత్తు స్వాధీనం

కంభం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలంలో పలు దొంగతనాలకు పాల్పడిన దొంగను, చోరీ చేసిన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు కంభం ఎస్సై నరసింహారావు శనివారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కంభం పట్టణంలో ఖాన్ వీధికి చెందిన వలి అనే వ్యక్తి నవంబరు 19వ తేదీ రాత్రి కంభం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎలక్ట్రికల్ షాపులో క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.510లు, ఫిబ్రవరి 22వ తేదీ రాత్రి మండలంలోని నర్సిరెడ్డిపల్లి, ఎర్రబాలెం గ్రామాల మధ్య ఉన్న పంట పొలాల్లో అనంత పోలేరమ్మ గుడిలో అమ్మవారికి చెందిన 50గ్రాముల బరువుగల వెండి కిరీటాన్ని దొంగతనం చేయగా వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడు వలిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. ఈ దొంగతనాల కేసును ఛేదించినందుకు సహకరించిన సిబ్బంది షేక్ బషీర్, సీహెచ్ పీరయ్య, హోంగార్డు లాజర్‌లను ఎస్పీ అభినందించినట్లు తెలిపారు.

పోలీసుశాఖలో హోంగార్డులు అంతర్భాగం

● ఎస్పీ హర్షవర్ధనరాజు
● హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవ ర్యాలీ

ఒంగోలు క్రైం,డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో హోంగార్డు అంతర్భాగమని ఎస్పీ హర్షవర్ధనరాజు అన్నారు. శనివారం స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కవాతు నిర్వహించారు. అనంతరం ఎస్పీ ప్రత్యేక వాహనంపై హోంగార్డులు గౌరవ వందనం స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డులు పోలీసు శాఖలో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. జిల్లాలో 696 మంది హోంగార్డులు ఉండగా వీరిలో 83 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. జిల్లాలో హోంగార్డుల సంక్షేమం కోసం కో ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసి లక్ష రూపాయలు రుణం ఇస్తున్నామని అన్నారు.


హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ హర్షవర్ధన రాజు

పోలీసు స్టోర్‌లో సరుకులు తెచ్చుకునేందుకు అవకాశం కల్పించామని అన్నారు. ఇటీవల పోలీసు కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో 9 మంది కానిస్టేబుళ్ళుగా ఎంపికయ్యారని అన్నారు.

● విధి నిర్వహణలో మృతిచెందిన మారుతీ కుమార్ రెడ్డి భార్య తేజస్వినికి హోంగార్డుల ఒక రోజు వేతనం రూ.4,78,540 చెక్కును ఎస్పీ చేతులమీదగా అందజేశారు. ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు జానకిరామయ్యకు రూ.4,80,670 చెక్కును అందజేశారు. హోంగార్డు స్పోర్ట్స్ మీట్‌లో విజేతలైయిన వారికి ఎస్పీ బహుమతులు అందించారు. అనతరం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు హోంగార్డులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ చిరంజీవి, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, మహిళ పోలీసుస్టేషన్ డీఎస్పీ రమణ ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు సుధాకర్‌రావు, నాగరాజు శ్రీకాంత్ బాబు, పాండురంగారావు పాల్గొన్నారు.

నా కృషి అంతా టీడీపీ గెలుపు కోసమే..

అభివృద్ధి సాధనతో ఓటమికి చెక్
వచ్చే ఎన్నికల నాటికి
మరో 20వేల ఓట్లు రాబడతా
వైపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో టీడీపీని గెలిపించమే లక్ష్యంగా ప్రజాసేవలో ముందుకు పోతున్నానని ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. గత ఎన్నికలలో స్వల్ప తేడాతో ఓటమికి కారణాలు విశ్లేషించుకున్నామని ఈ నియోజకవర్గం వైసీపీకి కంచుకోట అనే నానుడికి వచ్చే ఎన్నికల్లో తిలోదకాలు ఇస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తనపై వస్తున్న ఆరోపణలు రాజకీయ దురుద్దేశంతో చేస్తున్నవే అని తోసిపుచ్చారు. ఒక ప్రశ్నకు బదులుగా గత ఎన్నికలలో తన ఓటమికి నాటి వైసీపీ ప్రభుత్వం చేసిన అధికార దుర్వినియోగం, భారీగా డబ్బుల పంపిణీ ప్రధాన కారణం అన్నారు. మద్యం కుంభకోణంలో భారీగా డబ్బులు సంపాదించిన చెవిరెడ్డి భాస్కర రెడ్డి ఎన్నికల సమయంలో అధికార దుర్వినియోగానికి పాల్పడటమే కాక భారీ మొత్తంలో ఇక్కడ డబ్బులు కుమ్మరించాడని ఆయన బదులిచ్చారు. ఇంకో ప్రశ్నకు బదులుగా టీడీపీలో ఉన్న ఒక సీనియర్ నాయకుడు కూడా సక్రమంగా సహకరించలేదని విమర్శించారు. పార్టీ ఆయనకు ఎంతో విలువను, గౌరవాన్ని ఇచ్చిందని తాను పాదాభివందనం చేసి పార్టీ గెలుపునకు సహకరించమని కోరానని, అయినా కనపడకుండా దెబ్బతీశారని ఆ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లానన్నారు. నియోజకవర్గం ఏర్పడిన తరువాత గత ఎన్నికలలో టీడీపీకి వచ్చిన ఓట్ల కన్నా 2024 ఎన్నికలలో 30వేల ఓట్లు అదనంగా వచ్చాయని తెలిపారు. మరో 20 వేల ఓట్లను టీడీపీ పక్షాన చేర్చుకోగలిగితే వచ్చే ఎన్నికలలో పార్టీదే విజయం అన్నారు. నిరంతర ప్రజాసేవ, నియోజవర్గ అభివృద్ధి, పార్టీశ్రేణులకు అండగా ఉండటం వలన అది సాధ్యం అవుతుందని, ఆ దిశగా తన పయనం సాగుతుందని ఎరిక్షన్ బాబు చెప్పారు. గత ఏడాదిన్నర కాలంలో జరిగిన అభివృద్ధే అందుకు నిదర్శనం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్‌లు ఇచ్చిన హామీకి అనుగుణంగా వెలిగొండ పనులు శరవేగంగా సాగుతున్నాయని, మార్కాపురం జిల్లా ఏర్పాటుకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ఎట్టి పరిస్థితితుల్లో వచ్చే ఏడాది చివరికి లేక 2027 జనవరిలో వెలిగొండ ప్రాజక్టు ప్రారంభం అవుతుందన్నారు. తన నియోజకవర్గానికి సంబంధించి అనుబంధంగా తీగలేరు కాలువను కూడా సాధిస్తానని తెలిపారు. అంతేకాక గత వైసీపీ ప్రభుత్వంలో ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్నప్పటికి జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వం, అప్పటి ఎమ్మెల్యేలు చేసిన మోసాన్ని ప్రజలు గమనించారన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి ఇటీవల రూ.467 కోట్లు మంజూరైన విషయాన్ని గుర్తుచేశారు. అంతే కాకుండా నియోజకవర్గంలో అభివృద్ధికి రూ.300 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. గిరిజన, బడుగు బలహీనవర్గ ప్రాంతాల్లో అభివృద్ధికి ఇప్పుడే నాంది పడిందని ఈ విషయాన్ని గుర్తించిన ప్రజలు టీడీపీకి జేజేలు పలుకుతున్నారని చెప్పారు. ప్రస్తుతం టీడీపీ నిర్మాణపరంగా బలోపేతమైందని గతేడాది 64 వేల మంది సభ్యత్వం తీసుకున్నారని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఈ నియోజకవర్గంలో వచ్చే ఎన్నికలలో గెలుపునకు తాను వేసిన పునాది బలపడిందని టీడీపీని గెలిపించి చంద్రబాబు, లోకేష్‌కు కానుకగా ఇస్తానని స్పష్టం చేశారు. అయితే తనకు పదవి కన్నా పార్టీ ముఖ్యమని అందుకే మూడు దశాబ్దాలుగా ఎన్ని ఇబ్బందులు వచ్చినా టీడీపీలోనే కొనసాగానని చివరికంటా ఇలానే కొనసాగుతానని చెప్పారు.

ఎస్సీ,ఎస్టీ కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చేయాలి

● విజిలెన్స్ మానిటరింగ్
కమిటీ సమావేశంలో మంత్రి స్వామి

ఒంగోలు క్రైం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆదేశించారు. శనివారం స్థానిక ప్రకాశంభవన్‌లో గ్రీవెన్స్ హాల్‌లో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులలో క్యాస్ట్ సర్టిఫికెట్లు లేని కారణంగా విచారణ జాప్యం అవుతుందన్నారు. అందుకోసం రెవెన్యూ అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ కాలనీలకు శ్మశానాల కోసం ప్రభుత్వ భూములు ఉంటే పరిశీలించాలని, లేకుంటే ప్రైవేటు భూములు సేకరణ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సివిల్ రైట్స్‌డేని తప్పనిసరిగా నిర్వహించాలని చెప్పారు. శ్మశానాలకు రోడ్ల నిర్మాణాల కోసం ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసి నిర్మించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కేసులలో బాధితులకు పరిహారం మంజూరు చేయాలని ఆదేశించారు. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న అంబేడ్కర్ భవనాలను నిర్మిస్తామన్నారు. ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్ ఆధునీకరణకు రూ.75లక్షలు మంజురుకు చర్యలు తీసుకుంటానని మంత్రి వెల్లడించారు.

● ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ నగరంలో ట్రంకురోడ్ విస్తరణలో భాగంగా హెచ్‌సీఎం స్కూలు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం తొలంగించాల్సిన అవసరం ఉందన్నారు. ఆప్రాతంలో అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు మంత్రి చర్యలు తీసుకోవాలని కోరారు.

● గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ కాలనీలకు శ్మశానాలకు స్థలాలు ముంజురు చేయాలని కోరారు.

● సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎస్.విజయకుమార్ మాట్లాడుతూ అనేక చోట్ల శ్మశాన భూములు ఆక్రమణకు గురయ్యాయని మంత్రి స్వామి దృష్టికి తీసుకొచ్చారు.

● కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహా రెడ్డి మాట్లాడుతూ శ్మశాన స్థలాలు లేక ఎస్సీ, ఎస్టీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

● ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, సొంత భవనాలు మంజురు చేయించాలని కోరారు.

కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి : కలెక్టర్

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కేసులు వేగవంతంగా దర్యాప్తు జరిగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీకాలనీలకు శ్మశాన స్థలాలు ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా ఆయా కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైన్లు మంజూరు చేయడానికి చర్యలు చేపడతామన్నారు. అనంతరం ఎస్పీ వి.హర్షవర్ధనరాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులు త్వరితగతిన దర్యాప్తు చేయిస్తామన్నారు. సమావేశంలో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వై.వెంకటేశ్వర్లు, పి.మనీదర్‌దేవ్, ఎం.గురవయ్య, పి.సునీత, కె.అన్నోజిరావు, షేక్ మొహమ్మద్ ఖాసీం, డీఆర్వో చిన ఓబులేసు, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, డీపీవో ఎం.వెంకటేశరరావు, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రంగనాయక క్షేత్రంలో భక్తుల ప్రత్యేక పూజలు

రాచర్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపీచెరువు అటవీ ప్రాంతంలో వెలసిన్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి క్షేత్రంలో స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ప్రత్యేక పూజల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలోని సత్రాల్లో భక్తులకు ఉచిత అన్నదానం చేశారు.

నెమలిగుండ్ల రంగస్వామి ఆలయానికి బస్సు ఏర్పాటు

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం ఆర్టీసీ డిపో నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాచర్ల మండలంలోని జేపీ చెరువు సమీపంలో ఉన్న నెమలిగుండ్ల రంగస్వామి దేవస్థానానికి ఆర్టీసీ బస్సు సర్వీసు శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా డిపో మేనేజర్ నరసింహంలు మాట్లాడుతూ ప్రతి శనివారం బక్తులసౌకర్యం కోసం మార్కాపురం నుంచి నెమలిగుండ్లం ఆలయానికి ఈ బస్సు ఏర్పాటు చేశామని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.


స్వామివారి దర్శనానికి క్యూలో నిలుచున్న భక్తులు (ఇన్‌సెట్లో) రంగనాయకస్వామి

మున్సిపల్ ఉద్యోగి మానవత్వం

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం మున్సిపాలిటీ లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న షేక్ సాగర్ వలీ శనివారం మానవత్వం చాటుకున్నారు. పట్టణంలోని కందుల ఓబుల రెడ్డి వైద్యశాలలో ఒక గర్భిణికి అత్యవసరంగా ఎ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో బంధువుల దాతల కోసం సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేశారు. స్పందించిన సాగర్ వలీ వైద్యశాలకు వెళ్లి అవసరమైన రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు వీడి అందరూ ముందుకు రావాలన్నారు. తాను అత్యవసర సమయాల్లో ఇప్పటికే 8 సార్లు రక్త దానం చేశానన్నారు.


రక్తదానం చేస్తున్న సాగర్ వలీ

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈవో

రాచర్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల విద్యాశాఖ అధికారి వి గిరిధర శర్మ శనివారం ప్రాథమికోన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసి సర్వే మీద వివరాలు అడిగి తెలుసుకొన్నారు. పాఠశాలలో నిర్వహిస్తున్న అన్ని రకాల రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. పాఠశాలలో కిచెన్ గార్డెన్‌లో మొక్కల గురించి, వాటిని పెంచాల్సినటువంటి విధానం గురించి వారికి వివరించారు. అనంతరం ఆకవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అకడమిక్ ఫోరం సభ్యులతో కలిసి సందర్శించారు. 10వ తరగతి విద్యార్థులకు అమలవుతున్న 100రోజుల యాక్షన్ ప్లాన్ వివరాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు.

వార్డుల్లో కమిషనర్ పర్యటన

గిద్దలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ రమణబాబు, ఇతర సిబ్బంది పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్లలోని చెత్తను రోడ్ల మీద గాని, మురుగుకాలువల్లో గాని వేయవద్దని, రోజూఇళ్ల వద్దకు వచ్చే చెత్త రిక్షాలలో మాత్రమే వేయాలని ప్రజలకు సూచించారు. పబ్లిక్ కొళాయిల వద్ద నీరు ఎన్నిగంటలపాటు వస్తుంది, నీరు సరిపోతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆయా వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. నాణ్యత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అన్నా క్యాంటీన్‌ను తనిఖీ చేశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

కొమరోలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లీనగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌ను యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బొర్రా వెంకటరత్నం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుకున్న 10వ తరగతి విద్యార్థులకు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తయారు చేసిన స్టడీ మెటీరియల్స్‌ను యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ మొర్రి పిచ్చయ్య తన సొంత నిధుల నుంచి ఖర్చు చేసి పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయం అని అన్నారు. హిందీ టీచర్ పిచ్చయ్య, ఉపాధ్యాయురాలు జనార్దన రాజు, చంద్రమోహన్, కృష్ణమూర్తి, శివరామ్ పాల్గొన్నారు.


స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న ఉభయదాతలు భక్తులు

అంగరంగ వైభవంగా రాములోరి కల్యాణం

పొదిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విశ్వనాథపురం జూనియర్ కాలేజి రోడ్డులో కొలువై ఉన్న శ్రీకోదండ రామస్వామి ద్వితీయ వార్షిక వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. దేవాలయం నిర్మించి రెండు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సహస్రనామార్చన, హోమం, అమ్మవారికి కుంకుమపూజలు చేశారు అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలు కల్యాణ పీఠంపై కూర్చొని శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్చరణల మధ్య కల్యాణ తంతు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కాల్ చేసుకుంటానంటూ కాజేశాడు

(3వ పేజీ తరువాయి)

కాజేసిన సైబర్ నేరగాడిని చీమకుర్తి పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను శనివారం చీమకుర్తి పోలిస్‌స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఐ దాసరి ప్రసాద్ తెలియజేశారు. మండలంలోని బక్కిరెడ్డిపాలెంకు చెందిన వీరపల్లి వెంకయ్య(63) పనిమీద మర్రిచెట్లపాలెం వెళ్లగా అక్కడ ఆయనకు ఎటువంటి పరిచయం లేని నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం కుడితిపాలెంకు చెందిన ఆదిపూడి వెంకటశేషయ్య అర్జంట్‌గా మాట్లాడాలి అని చెప్పి ఆయన ఫోన్ తీసుకున్నాడు. మాట్లాడుతున్నట్లుగా నటించి ఫోన్‌లోని కాల్ డైవర్ట్ ఆప్షన్ ఎనేబుల్ చేసి తన నంబర్‌ను నమోదు చేశాడు. తర్వాత దానిని ఆపరేట్ చేస్తూ ఓటీపీలను సేకరించి అకౌంట్‌లోని నగదును నొక్కేసి బెట్టింగ్‌ల యాప్‌లలో పెట్టి సొమ్ము చేసుకున్నాడు. దాదాపు రూ.5లక్షలకుపైగా సొమ్మును అకౌంట్ నుంచి బదిలీ చేసుకోగా, ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన వెంకయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీస్ ఐటీ టీం సహకారంతో కేసును ఛేదించిన చీమకుర్తి పోలీసులు నిందితుడు వెంకటశేషయ్యను అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపరిచారు. ఇలాంటి సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ ప్రసాద్ ప్రజలను కోరారు.

నకిలీ బంగారాన్ని తాకట్టుపెట్టి సొమ్ము చేసుకుంటున్న వ్యక్తి అరెస్ట్

బంగారం దుకాణాల్లో నకిలీ బంగారాన్ని తాకట్టుపెట్టి మోసం చేసిన వ్యక్తిని చీమకుర్తి పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచారు. ఈ ఘటనా వివరాలను సీఐ ప్రసాద్ తెలిపారు. చీమకుర్తి పట్టణంలోని పిడతలపూడి రోడ్డులో ఉన్న ధనలక్ష్మి గోల్డ్‌హౌస్‌లో నెల్లూరు జిల్లాకు చెందిన కె.వెంకటేశ్వరరావు నకిలీ బంగారాన్ని తీసుకొచ్చి తనకు అర్జంట్‌గా డబ్బులు కావాలని చెప్పి తాకట్టు పెట్టి సొమ్ము తీసుకున్నాడు. తదుపరి విషయం తెలుసుకున్న యజమాని లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించగా సీసీ ఫుటేజి ఆధారంగా నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పూర్వవైభవం

(3వపేజీ తరువాయి)

నుంచి 8 గంటల వరకు పర్యటించి పారిశుధ్య నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. డీపీవో వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవిలు మంగళవారం నుంచి శుక్రవారం వరకు ఆయా గ్రామ పంచాయతీల్లో వేర్వేరుగా పర్యటించారు. ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు మంగళవారం నుంచి శనివారం వరకు ఐవీఆర్ఎస్ గ్రామాల్లో పర్యటించే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడంతో తదనుగుణంగా చర్యలు ప్రారంభించారు. ఆయా పంచాయతీల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించడంతోపాటు ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని ప్రభుత్వం అమలుచేస్తున్న ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి. మరోవైపు అధికారులు కనీసం 25 కుటుంబాలను సందర్శించి పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలి. సీఎం ఆదేశాలతో జిల్లాలో గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దే విధంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు ప్రారంభించారు.

దార్శనికుడికి ఘన నివాళి

(3వ పేజీ తరువాయి)

నివాళులర్పించారు. ఆయన స్ఫూర్తితో రాష్ట్రప్రభుత్వం దళితులు, అట్టడుగు వర్గాల వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్నదని ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ స్వామి చెప్పారు. ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎస్.విజయకుమార్, కలెక్టర్ రాజాబాబు, మేయర్ గంగాడ సుజాతతోపాటు వివిధ దళిత, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జనార్దన్ కూడా పాల్గొన్నారు. నాగులుప్పలపాడు మండల కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎస్.విజయకుమార్ పాల్గొని అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. కనిగిరిలోని అంబేడ్కర్ విగ్రహానికి అక్కడి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించగా గిద్దలూరులోని టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి అక్కడి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ నేతలతో కలిసి నివాళులర్పించారు. తాళ్ళూరులోని అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పూలమాలలు వేశారు. అలాగే వివిధ పట్టణాలు, గ్రామాల్లోని వందలాది విగ్రహాలు, చిత్రపటాలకు వివిధ వర్గాల వారు నివాళులర్పించారు.

వామ్మో స్క్రబ్ టైఫస్

(3వ పేజీ తరువాయి)

మేరకు గుంటూరు వైద్యశాల నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి సమాచారాన్ని అందించారు. దానమ్మ వైపాలెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కుక్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. జిల్లాలో ఈ ఏడాది స్క్రబ్ టైఫస్ వ్యాధితో తొలి మరణం నమోదైంది. దర్శిలో మరొక కేసు నమోదైనట్లు సమాచారం. అనారోగ్యంతో ఓ వ్యక్తి దర్శిలోని ప్రభుత్వ వైద్యశాలకు రాగా పరీక్షల్లో ఆ వ్యాధి బారిన పడినట్లు గుర్తించారు. అయితే నిర్ధారణ కోసం వెంటనే అతని రక్తనమూనాలను ఒంగోలు రిమ్స్‌కు పంపించినట్లు తెలుస్తోంది.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

● కాపాడిన పోలీసులు

మార్కాపురం రూరల్, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం ఫ్లైవోవర్ బ్రిడ్జి నుంచి దూకి ఆత్మహత్య చేసుకోబోతున్న వ్యక్తిని సీఐ సుబ్బారావు, రూరల్ ఎస్ఐ అంకమ్మరావులు సంఘటనా స్థలానికి చేరుకొని రక్షించారు. ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వ్యక్తులు పోలీసులకు 112 నెంబర్ ద్వారా సమాచారాన్ని తెలియజేయగా వెంటనే స్పందించిన పోలీసులు ఆత్మహత్య చేసుకోకుండా కాపాడారు. ఆ వ్యక్తిది కనిగిరి ప్రాంతమని తెలిపారు. ఆ వ్యక్తికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించామని పోలీసులు తెలిపారు.



ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడుతున్న సీఐ సుబ్బారావు, రూరల్ ఎస్ఐలు

అంబేడ్కర్‌కు ఘన నివాళులు

కంభం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కంభం, అర్ధవీడు మండలాలలో బీఆర్ అంబేడ్కర్ 69వ వర్ధంతిని శనివారం ఘనంగా జరుపుకున్నారు. కంభంలో రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు కాటమల చెన్నకేశవరావు ఆధ్వర్యంలో కందులాపురం సెంటర్, ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

మార్కాపురంలో..

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహానికి కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, టీడీపీ నాయకులు పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డిలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



మార్కాపురం జిల్లా ప్రకటన ఆనందదాయకం

వద్దిమడుగు, కంభాలపాడు గ్రామాల్లో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం


వద్దిమడుగులో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

కొనకనమిట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం జిల్లా ప్రకటన చేసిన చంద్రబాబునాయుడి చిత్రపటానికి వద్దిమడుగు గ్రామంలో టీడీపీ నాయకులు పాలాభిషేకం చేశారు. అనంతరం మండల అధ్యక్షుడు మోరబోయిన బాబురావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మార్కాపురం జిల్లా చేస్తానని ప్రకటించిన ముఖ్యమంత్రి అన్నమాట ప్రకారం జిల్లా ఏర్పాటు ప్రకటన చేశారని తెలిపారు.చంద్రబాబునాయుడు మాటచెబితే చేయడం ఆయన నైజమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు కాశిరెడ్డి, యోదుబాటి వెంకటనారాయణ, కాటంరాజు, రోశయ్య, గురవయ్య, వెంకన్న, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు .

జిల్లాగా ప్రకటించినందుకు రుణపడి ఉంటాం

పొదిలి : జిల్లా ప్రకటన చేసిన ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామని కంభాలపాడు గ్రామస్థులు ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. శనివారం మండలంలోని కంభాలపాడు గ్రామంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ ఆవులూరి యలమంద ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తూచా తప్పకుండా అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, రాష్ట్రకార్యదర్శి గునుపూడి భాస్కర్, టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్రకార్యదర్శి వరికుంట్ల అనిల్, ఏఎంసీ చైర్మన్ డాక్టర్ ఇమాంసాహెబ్, మాదిరెడ్డిపాలెం సొసైటీ చైర్మన్ యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సోమయ్య, తానికొండ వెంకట్రావు, గౌస్, గ్రామ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


కంభాలపాడు గ్రామంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

కమనీయం చెన్నకేశవుని శాంతి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం స్వామికి శాంతి కల్యాణం కమనీయంగా కన్నులపండువగా నిర్వహించారు. ప్రధానార్చకులు అప్పనాచార్యుల ఆధ్వర్యంలో నంద్యాల రంగాచార్యులు, సాయి కుమారాచార్యులు చెన్నకేశవ స్వామి భాగ్యలక్ష్మీ అమ్మవార్ల మూలవిరాట్‌లకు సుప్రభాత సేవ, అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ మధ్యరంగ మండపంలో నిత్యపూజలందుకునే శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఉత్సవరులను శోభాయమానంగా అలంకరించారు. అనంతరం వైభవంగా కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈవో గొలమాని శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.


నిరుపయోగంగా మారిన మార్కెట్ యార్డు భవనాలు

నిరుపయోగంగా వ్యవసాయ మార్కెట్ యార్డు

- లావాదేవీలు నిర్వహించకుండానే శిథిలావస్థకు
- కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులు వృథా

పెద్దదోర్నాల,డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):రెండు మండలాల రైతుల ప్రయోజనార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవసాయ మార్కెట్ యార్డు నిర్మాణం మూడు దశాబ్దాలు దాటినా వినియోగంలోకి రాలేదు.నిర్మాణం జరిగిందన్న మాటేగానీ ఏనాడు లావాదేవీలకు నోచుకోలేదు. సుమారు 11ఎకరాల విస్తీర్ణంలో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పెద్ద దోర్నాల, పెద్దారవీడు మండలాలకు చెందిన రైతులు అధికంగా మిర్చి, పత్తి, మినుము, కందులు, శనగలు, అలసందలు సాగు చేస్తారు. పండించిన పంటలను సమయానికి విక్రయించుకునేందుకు, ఒకవేళ గిట్టుబాటు ధరలు లేనప్పుడు శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకుని తద్వారా రుణాలు పొందే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ యార్డు నిర్మించింది. అయితే ఏ కారణంతోనో అసలు వ్యాపారం జరగనేలేదు. రైతుల ఇబ్బందులు తొలగలేదు. మిర్చి అమ్మకాలకు గుంటూరు, పూణె, చెన్నై తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. పత్తి విక్రయించేందుకు కర్నూలు, ఆదోని, గుంటూరు వంటి పట్టణాలకు వెళ్తున్నారు. దీంతో ఖర్చులు మరింత అధిక మవుతున్నాయి. ఇక్కడేమో నిర్మించిన భవనాలు అసాంఘిక చర్యలకు నిలయంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి మార్కెట్‌యార్డును వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కొమరోలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో సత్యం అన్నారు. మండలంలోని కసినేపల్లి మండల ప్రాథమిక పాఠశాలను ఎంపీడీవో సత్యం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం రుచికరమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని మాత్రమే ఇవ్వాలన్నారు. భోజనం చేసే సమయంలో కచ్చితంగా పరిశుభ్రత పాటించాలని, ఆహార పాత్రలపై మూతలు వేసి ఉంచాలని, మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలని అన్నారు. పాఠశాలలోని వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయించారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలను పారిశుధ్య కార్మికులతో తొలగించారు. అనంతరం మధ్యాహ్నం విద్యార్థులతో కలిసి అధికారులు భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చెన్నారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి జె.లక్ష్మీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు చంద్రమౌళి, గురు ప్రసాద్ పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీవో సత్యం



అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

రాచర్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్‌బీఆర్ అంబేడ్కర్ అని ఎంపీడీవో ఎస్. వెంకటరామిరెడ్డి అన్నారు. రాచర్లలో దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.


విద్యార్థిని కుటుంబానికి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

విద్యార్థిని కుటుంబానికి సహాయం

- రూ. 3 లక్షల చెక్కును అందించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బాలిక అనారోగ్యంతో మృతిచెందడంతో ఆ కుటుంబానికి ప్రభుత్వం 3లక్షల రూపాయల చెక్కును మంజూరు చేయగా శనివారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆ కుటుంబానికి చెక్కును అందించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే చెక్కు అందించారు.

గేటుతో భక్తులకు ఇక్కట్లు

గిద్దలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురుజుపల్లి సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న పలుపులవీడు దేవస్థానానికి వెళ్లే రోడ్డుకు అడ్డంగా అటవీశాఖ అధికారులు తాజాగా గేటును ఏర్పాటు చేసి తాళాలు వేశారు. దీంతో ఆలయానికి వెళ్లేందుకు భక్తులు ఇక్కట్లకు గురవుతున్నారు.









శాఖాహార జంతువుల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలోని గంజివారిపల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలో శాఖాహార జంతువుల లెక్కింపు ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభమైనట్లు ఫారెస్టు రేంజర్ ఏ ప్రసన్న జ్యోతి తెలిపారు. శని, ఆది, సోమవారాలో ఈ లెక్కింపు ప్రక్రియ ఉంటుందని తెలిపారు. చుక్కల దుప్పులు, కణుతులు, కొండ గొర్రెలు, మనుబోతులు అటవీ ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ మూడు రోజులు సిబ్బంది అదే పనిలో ఉంటారని తెలిపారు. టి.ఆర్ చెరువు ఎఫ్ఆర్‌వో షేక్ ఖాజామొహిద్దీన్, బేస్ క్యాంప్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు.



గంజివారిపల్లి ఫారెస్టు పరిధిలో లెక్కింపు చేపడుతున్న అధికారులు, సిబ్బంది

www.andhrajyothy.com
4 పేజీలు
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI ఆదివారం 7-12-2025 ఒంగోలు





ప్రజాసేవ, ప్రగతి సాధనకు పదవులు ప్రామాణికం కానేకాదు. అందుకు టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబును నిదర్శనంగా చెప్పుకోవచ్చు. తెలుగుదేశం అంటే ప్రాణంగా, ప్రజాసేవ పట్ల మక్కువతో మూడు దశాబ్దాల నుంచి రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయన అనుభవాన్ని రంగరించి నియోజకవర్గంలో అభివృద్ధి ఫలాలను పండిస్తున్నారు. ఏనాడు పార్టీ జెండాను వీడని ఆయనలోని నిబద్ధతను గుర్తించిన టీడీపీ అధిష్ఠానం క్లిష్ట దశలో నియోజకవర్గ బాధ్యతను అప్పగించింది. పార్టీని గాడిలో పెట్టడంలో తొలి విజయాన్ని అందుకున్నారు. ఎమ్మెల్యేగా తొలి విజయానికి ప్రయత్నించగా అప్పటి వైసీపీ అధికార దుర్వినియోగం, ధనబలం ముందు చివరిలో చేజారింది. పాలనాపరమైన పదవి లభించకపోయినా పార్టీ ప్రతినిధిగా తనలోని సేవాగుణానికి ఎరిక్షన్‌బాబు పదును పెట్టి ప్రగతి సాధనలో దూసుకుపోతున్నారు. ఆయన నియోజకవర్గంలో లేడు అంటే.. జిల్లా కేంద్రమైన ఒంగోలు, లేక రాష్ట్ర రాజధాని అమరావతిలో సమస్యల ఫైళ్లను చేతపట్టుకొని ప్రత్యక్షమవుతున్నారు. ఫలితంగా ఏడాదిన్నరలోనే రూ.368 కోట్లను నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు రాబట్టగలిగారు. మరోవైపు వెలిగొండ ప్రాజెక్టు సాధన, మార్కాపురం జిల్లా ఏర్పాటులో తనవంతు పాత్ర పోషిస్తూనే సాధారణ ప్రజల ఈతిబాధలు, పార్టీ శ్రేణుల శ్రేయస్సుకు పెద్దపీట వేశారు. విద్య, రవాణా రంగాల అభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇచ్చారు. అనాదిగా నిరాదరణకు గురవుతున్న గిరిజనులకు తలలో నాలుకలా మారారు. చెంచుగూడేలు, తండాల్లో ఆయన తిరగని ప్రాంతం లేదు. వాటిలో విద్యుత్ వెలుగులు నింపారు. రవాణా, విద్యా రంగ అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. దళిత వాడల్లో రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలతోపాటు అక్కడి ప్రజల ఆర్థికాభివృద్ధికి తోడ్పడే చేయూత కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేశారు. సాగు, తాగునీటి రంగాలకు సంబంధించి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకొని వాటి సాధన కోసం ముందుకు సాగుతున్నారు. గ్రామాల్లో పర్యటించే సమయంలో సాధారణ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో దిట్టగా పేరొందారు. మరోవైపు పార్టీ శ్రేణుల శ్రేయస్సుకు, వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ప్రాధాన్యం ఇచ్చి కొండంత అండగా నిలుస్తున్నారు. పార్టీ శ్రేణుల్లో ఎవరికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా 'నేనున్నాను' అనే ధైర్యాన్ని కల్పిస్తున్నారు. అందుకే నియోజకవర్గంలో ఎన్నడూ జరగని అభివృద్ధికి తోడు నిర్మాణపరంగా తెలుగుదేశం పార్టీ రాటుదేలింది. తద్వారా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా దూసుకుపోతోంది. ఇటు పార్టీ, అటు పాలనా రంగాలపై పట్టు సాధించిన ఎరిక్షన్‌బాబు ప్రతిపక్ష పార్టీకి కంట్లో నలుసుగా మారారంటే అతిశయోక్తి కాదు. అందుకే బడుగు, బలహీన వర్గాల ప్రజలతోపాటు రాజకీయ పెత్తనం సాగించే వర్గాల నాయకులు కూడా 'ఔరా.. ఎరిక్షన్ రాజకీయ చతురత' అంటూ మెచ్చుకుంటున్నారు.



ఐటీవరంలో మంత్రి రవికుమార్, ఎరిక్షన్‌బాబుకు స్వాగతం పలుకుతున్న మహిళలు (ఫైల్)

మంత్రుల సహకారంతో నిధుల వరద

సంక్షేమ ఫలాల అమలులో నియోజకవర్గం ఏమాత్రం వెనుకబడకుండా తగిన జాగ్రత్తలను ఎరిక్షన్‌బాబు తీసుకున్నారు. ఆర్థిక చేయూతనిచ్చే కార్యక్రమాలన్నింటిలో అర్హత ఉన్న వారందరినీ భాగస్వాములను చేసే ప్రయత్నంలో ముందున్నారు. అలాగే మంత్రుల నుంచి సహకారం పొందడంలో అగ్రగామిగా నిలిచారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, రోడ్లు,భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తదితరుల ద్వారా ఆయా శాఖల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు మరిన్ని నిధులను రాబట్టారు. గతంలో పార్టీ పరంగా నెల్లూరు జిల్లా ఆత్మకూరు ఇన్‌చార్జిగా పనిచేసిన సమయంలో ఉన్న పరిచయాలతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ద్వారా ఆయా పనులకు జిల్లాకు కేటాయించబడే నిధుల నుంచి ఎర్రగొండపాలెం నియోజకవర్గానికి అధికశాతం వచ్చే విధంగా చేసుకోగలుగుతున్నారు. ఇలా ఆయా రంగాల్లో అభివృద్ధికి బాటలు వేయగలిగారు.

ఎరిక్షన్.. సూపర్

ఓట్ల సాధనలో తగ్గినా... అభివృద్ధిలో నెగ్గారు!



దోర్నాలలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు హాజరైన అశేష ప్రజానీకం (ఫైల్)

- ఏడాదిన్నరలోనే రూ.368 కోట్ల నిధులు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలపై ప్రత్యేక దృష్టి
- గూడేలు, కాటంరాజు ప్రాంతానికి నిధులు
- రోడ్లకు మోక్షం.. తీగలేరుపై దృష్టి
- ఇచ్చిన హామీల అమలుకు ప్రాధాన్యం
- దూసుకుపోతున్న టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

గత సాధారణ ఎన్నికల్లో ఓట్ల సాధనలో కాస్తంత తగ్గినప్పటికీ అభివృద్ధి విషయంలో మాత్రం టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు నెగ్గారు. ఏడాదిన్నరలోనే అభివృద్ధి సాధనలో ఘనాపాటిగా కీర్తించబడుతున్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో తొలుత తాను దైవంగా భావించే తెలుగుదేశం పార్టీకి జీవం పోశారు. తొలిసారి నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవేసే ప్రయత్నంలో చివర్లో వెనుకబడ్డారు. స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చవిచూసినప్పటికీ టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో నిధుల సాధన వేటలో విజయం సాధిస్తున్నారు. మూడు దశాబ్దాలకు పైగా టీడీపీలో వివిధ హోదాల్లో కొనసాగిన ఆయన పార్టీ నాయకులతో ఉన్న విస్తృత పరిచయాలను నియోజకవర్గ అభివృద్ధి సాధనకు వినియోగించుకోవడంలో సఫలీకృతులవుతున్నారు. సాధారణ సంక్షేమ ఫలాల అమలుకు, వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి వచ్చే నిధులతో సంబంధం లేకుండా వివిధ అభివృద్ధి పనులకు రూ.368.13 కోట్లను సాధించి నియోజకవర్గ ప్రజలతో ఔరా..! ఎరిక్షన్‌బాబు అంటూ ప్రశంసలందుకుంటున్నారు. శాసనసభ్యుడిగా హోదా లేకపోవడంతో ఎదురయ్యే ఇబ్బందులను తనకున్న చొరవ, విస్తృత పరిచయాలతో అధిగమించి దూసుకుపోతున్నారు.

రూ. 23.90కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధి

రోడ్లు, భవనాల శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డి సహకారంతో ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణం, అభివృద్ధికి రూ.23.90 కోట్లను ఎరిక్షన్‌బాబు సాధించారు. అందులో రూ.15 కోట్లతో అత్యవసరమైన, తాను గతంలో హామీ ఇచ్చిన కొత్త రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయించారు. రోడ్ల ప్యాచ్ వర్క్ పనులకు రూ.1.46 కోట్లు రాబట్టగా పనులు పూర్తయ్యాయి. జిల్లా మైనింగ్ ఫండ్ నుంచి కలెక్టర్, ఇతర అధికారుల సహకారంతో రూ.1.70 కోట్లు సాధించారు. ఆయా గ్రామాలకు వెళ్లినప్పుడు గుర్తించిన ప్రజావసరాలకు అనుగుణంగా ఇచ్చిన హామీల మేరకు నాలుగు పనులకు ఆ నిధులను కేటాయించారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.5కోట్ల వ్యయంతో సిమెంట్ రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయించారు. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలోని రోడ్ల అభివృద్ధి, నిర్మాణానికి రూ.27.45 కోట్లను రాబట్టారు. పీఆర్‌లో భవనాల నిర్మాణాలు, ఇతర పనులకు మరో రూ.25.31 కోట్లను మంజూరు చేయించారు.

త్రిపురాంతకం వద్ద సాగర్‌కాలువపై బ్రిడ్జి నిర్మాణ అవశ్యకతను మంత్రి జనార్దన్‌రెడ్డికి వివరిస్తున్న ఎరిక్షన్‌బాబు (ఫైల్)




ఊరూరా తిరిగి.. సమస్యలు గుర్తించి..

నల్లమల అటవీ ప్రాంతానికి చేరువలో ఉన్న ఎర్రగొండపాలెం పూర్తిగా వెనుకబడిన నియోజకవర్గం. జిల్లా ఏర్పాటు అనంతరం 2009లో తిరిగి నియోజకవర్గం ఏర్పడినా ఆశించిన అభివృద్ధికి నోచుకోలేదు. రాజకీయ పెత్తనం అగ్రవర్ణాల చేతుల్లో ఉన్నా నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న గిరిజనులు, బడుగు, బలహీనవర్గాలు నివసించే ప్రాంతాల్లో అభివృద్ధి అతంతమాత్రమే. నియోజకవర్గం రిజర్వు అయి దళితుల పాలన ప్రారంభమైనప్పటికీ ఆ వర్గాల ప్రజలకు ప్రభుత్వపరంగా అందే చేయూత నామమాత్రమే. గత ఎన్నికలకు ముందు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వచ్చిన ఎరిక్షన్ బాబు గిరిజన నివాసిత ప్రాంతాలతోపాటు ఊరూవాడా తిరిగారు. అన్నివర్గాల ప్రజల సమస్యలను, అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలను పసిబట్టారు. ప్రజాప్రభుత్వం ఏర్పడగానే వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. ఇటు వెలిగొండ ప్రాజెక్టు సాధన, అటు మార్కాపురం జిల్లా ఏర్పాటులో తనవంతు పాత్ర పోషిస్తూనే ఇతర అభివృద్ధి పనులకు నిధులు రాబట్టడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్‌తోపాటు రాష్ట్ర మంత్రివర్గంలో తనకు పరిచయస్థులైన వారిని పదేపదే కలిసి నిధులు సాధిస్తున్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.427 కోట్లు వచ్చిన విషయం విదితమే.

తీగలేరుపై ప్రత్యేక దృష్టి

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు ఊపందుకోవడంతో 2026 సంవత్సరంలో సాగునీరందడం ఖాయమని తేలిపోయింది. అయితే ఈ ప్రాజెక్టు ద్వారా పుల్లలచెరువు మండలానికి పెద్దగా సాగునీరందే పరిస్థితి లేదు. దీంతో దశాబ్దాలకాలం నుంచి హామీకే పరిమితమైన తీగలేరు కాలువ నిర్మాణంపై ఎరిక్షన్‌బాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనుల సమీక్షకు వచ్చిన జలవనరుల శాఖ మంత్రి రామానాయుడుకు పరిస్థితిని వివరించారు. తాజా అంచనాలకు అనుగుణంగా తీగలేరు నిర్మాణానికి సంబంధించిన సర్వేకు అనుమతి సాధించారు. పుల్లలచెరువు మండలంలో వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో లేని కొన్ని గ్రామాలకు తాగునీటి సరఫరా కోసం ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేయించే ప్రయత్నాలను ప్రారంభించారు. ముటుకుల, శతకోడు మర్రివేముల పంచాయతీల పరిధిలోని 11 గ్రామాలకు వరికపూడిశల నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా జలాలను రప్పించే ప్రయత్నం చేస్తున్నారు. పల్నాడు జిల్లా పరిధిలోని వెల్దుర్తి నుంచి కృష్ణా జలాలను మళ్లించే ఆ ఎత్తిపోతల పథకం విషయంపై టీడీపీ పార్లమెంట్ పార్టీ నాయకుడు కృష్ణదేవరాయలుతోపాటు ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేస్తూ తన ప్రయత్నాన్ని ముమ్మరం చేశారు.



దోర్నాల ప్రజాదర్బార్‌లో వృద్ధురాలి సమస్యను వింటున్న ఎరిక్షన్‌బాబు (ఫైల్)

విద్యుత్ శాఖ నుంచి రూ.94కోట్లు

విద్యుత్‌రంగానికి సంబంధించి తొలి ఏడాదిన్నరలోనే ఎరిక్షన్‌బాబు రూ.94 కోట్లు రాబట్టడం విశేషం. రంగన్నపాలెం వద్ద 220 కేవీ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయించుకోగలిగారు. రూ.64 కోట్లతో నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఐటీవరం వద్ద రూ.4కోట్లతో 33/11కేవీ సబ్ స్టేషన్ మంజూరు చేయించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కొత్త విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్ల ఏర్పాటుకు శ్రీకారం పలికారు. ఇప్పటికే నియోజకవర్గంలో రూ.19 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. గిరిజన ప్రాంతాల్లో విద్యుత్ అభివృద్ధికి రూ.2.40 కోట్లతో పనులు జరుగుతున్నాయి. సోలార్ విద్యుత్‌కు సంబంధించి రూ.3.60 కోట్ల విలువైన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇంకోవైపు మంత్రి రవికుమార్ సహకారంతో అటవీశాఖ అనుమతులను ప్రత్యేకంగా సాధించి ఆ ప్రాంతాల్లో ఉన్న గిరిజన గృహాలకు కరెంటు సౌకర్యం కల్పిస్తున్నారు. ఇలా విద్యుత్ రంగ అభివృద్ధి పనుల్లో ఘనాపాటిగా నిలిచారు.



రంగన్నపాలెంలో సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తున్న గూడూరి

రైతులు, పశుపోషకులకు తోడ్పాటు

రైతుల సంక్షేమం, ఇరిగేషన్ అభివృద్ధి పనులకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకొని ఎరిక్షన్‌బాబు ముందుకు సాగుతున్నారు. అందులో భాగంగా పశువుల షెడ్ల నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. ఇప్పటి వరకూ 315 క్యాటిల్ షెడ్ల నిర్మాణానికి రూ.6.68 కోట్ల నిధులను వెచ్చించి సన్న, చిన్నకారు రైతులకు తోడ్పాటుగా నిలిచారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గం పూర్తిగా వర్షాధారిత ప్రాంతం కావడంతో వ్యవసాయ భూముల్లో నీటి కుంటల నిర్మాణానికి ప్రత్యేక చొరవతీసుకున్నారు. 1,425 సేద్యపు నీటి కుంటల నిర్మాణానికి రూ.8.55 కోట్లను మంజూరు చేయించారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, గ్రామాల మధ్య లింక్ రోడ్లు, దళితవాడలు, గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. సన్న, చిన్నకారు రైతులు, కూలీల ఆర్థికాభ్యున్నతి కోసం ప్రభుత్వం నుంచి చేయూతను రాబట్టడంలో ముందున్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఆ సంస్థ ద్వారా ఇప్పటికే రూ.18.26 కోట్లు సాధించారు. రోడ్ల నిర్మాణానికి రూ.10 కోట్లతోపాటు గిరిజన విద్యార్థుల కాలేజీ నిర్మాణానికి రూ.4.20 కోట్లు, గిరిజన నివాసిత ప్రాంతాల్లో ఆయా ప్రభుత్వ రంగ భవనాల నిర్మాణానికి రూ.4.06 కోట్లను రాబట్టారు.



విద్యా సంస్థలు, హాస్టళ్ల అభివృద్ధి

విద్యాశాఖ మంత్రి లోకేష్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి స్వామి తదితరుల సహకారంతో విద్యా సంస్థలు, హాస్టళ్ల అభివృద్ధికి ఎరిక్షన్‌బాబు భారీగా నిధులు రాబట్టారు. ఈ విభాగంలో ఇప్పటికే రూ.16.32 కోట్లు మంజూరయ్యాయి. ఎర్రగొండపాలెంలో డిగ్రీ కాలేజీ నిర్మాణానికి రూ.2.62 కోట్లు వచ్చాయి. ఎర్రగొండపాలెంలో రూ.6 కోట్లతో నూతన బాలికల వసతి గృహం మంజూరు చేయించి పనులను ప్రారంభించారు. నియోజకవర్గంలోని అన్ని వసతి గృహాల మరమ్మతులకు రూ.1.11 కోట్లు రాబట్టి పనులు పూర్తి చేయించారు. దోర్నాలలో బాలికల డిగ్రీ కాలేజీకి సంబంధించి అపరిష్కృతంగా ఉన్న నాలుగు ఎకరాల భూమి కేటాయింపు పూర్తి చేయించారు. విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్ సహకారంతో ఆశాఖ నుంచి ప్రత్యేక నిధులు తెచ్చి అన్ని హాస్టళ్లలో కొత్తగా ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయించారు. కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలల అభివృద్ధికి రూ.3.3 కోట్లు మంజూరు చేయించారు. వీటికి తోడు సమగ్రశిక్ష ద్వారా రూ.6.50 కోట్లతో పాఠశాలల అభివృద్ధి పనులు చేయించారు.

టీచర్ ఉద్యోగాన్ని వదులుకొని..

వెలిగండ్ల మండలం మొగల్లూరు గ్రామంలో ఒక ఉపాధ్యాయుడి కుటుంబంలో గూడూరి ఎరిక్షన్‌బాబు జన్మించారు. బీఈడీ చదువుకున్నారు. తండ్రి మనోభావాలకు అనుగుణంగా వామపక్ష భావాజాలంతో పెరిగారు. తద్వారా తొలి నుంచి వారి కుటుంబం కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉండేది. ఎరిక్షన్‌బాబు విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత రాజకీయ అరంగేట్రం చేయాలన్న ఉద్దేశంతో ఎన్టీఆర్ పట్ల ఉన్న అభిమానాన్ని, కాంగ్రెస్ వ్యతిరేక భావాజాలాన్ని దృష్టిలో ఉంచుకొని టీడీపీలో చేరారు. 1995లో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసి వెలిగండ్ల మండల పరిషత్ అధ్యక్ష పదవిని అలంకరించారు. ఆ పదవిలో ఉన్న రెండేళ్లకే ఉపాధ్యాయుడి పోస్టుకు ఎంపికయ్యారు. టీడీపీపై ఉన్న నిబద్ధత, ఆదరించిన ప్రజల పట్ల ఉన్న సేవాభావంతో ఉద్యోగాన్ని కాదని రాజకీయాల్లోనే కొనసాగారు. అనంతరం ఆ మండలానికి జడ్పీటీసీ సభ్యుడిగా, స్వగ్రామానికి సర్పంచ్‌గా కూడా పనిచేశారు. ఇలా వరుసగా పదవుల్లో రాణించడానికి ప్రజలకు చేరువగా ఉండి నిరంతరం వారి సేవకు అహరహం కృషి చేయడమే ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు.



టీడీపీ పట్ల నిబద్ధత

తెలుగుదేశం పార్టీ పట్ల పూర్తి నిబద్ధతతో ఎరిక్షన్‌బాబు రాజకీయాల్లో కొనసాగారు. ఆయన రాజకీయాల్లోకి వచ్చి ఎంపీపీ అయిన రోజుల్లో ప్రోత్సహించిన మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి తెలుగుదేశంను వీడినా ఎరిక్షన్‌బాబు పక్కచూపులు చూడలేదు. ఆతర్వాత అక్కడే ఎమ్మెల్యేగా గెలిచిన కదిరి బాబూరావు టీడీపీకి గుడ్‌బై చెప్పినా ఎరిక్షన్‌బాబు టీడీపీలోనే కొనసాగారు. అలాంటి సందర్భాల్లో పార్టీని వీడాలని వచ్చిన ఒత్తిళ్లు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికార పక్షం చూపిన ఆశలకు లొంగలేదు. అలా టీడీపీలోనే ముందుకు సాగిన ఎరిక్షన్‌బాబు నిబద్ధతను గుర్తించిన పార్టీ అధిష్ఠానం గతంలోనే ఆయనకు లిడ్ క్యాప్ చైర్మన్ పదవిని ఇచ్చింది. గత ఎన్నికలకు ముందు అటు చంద్రబాబునాయుడు, ఇటు లోకేష్ పార్టీలో తనను అభిమానించే అగ్రనాయకులు మరికొందరు ఇచ్చిన సూచనతో పార్టీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ బాధ్యతలు చేపట్టారు. దశాబ్దాల నుంచి సరైన నాయకత్వం లేక నియోజకవర్గంలో కునారిల్లుతున్న తెలుగుదేశం పార్టీకి జీవం పోశారు. ఆయన నిలదొక్కుకునే సమయంలో దెబ్బతీసి తరిమికొట్టాలని చూసిన వారి ప్రయత్నాలను పటాపంచలు చేశారు. అటు నాయకత్వ ప్రోత్సాహం, ఇటు కార్యకర్తల మద్దతుతో నియోజకవర్గంలో స్థిరపడ్డారు.

ఓటమిని అధిగమించి ముందుకు..

రమారమి రెండేళ్లపాటు నియోజకవర్గంలో ఇంటింటికీ తిరిగి అప్పటి అధికారపార్టీ అయిన వైసీపీ అకృత్యాలను ఎరిక్షన్‌బాబు అడ్డుకున్నారు. టీడీపీ కేడర్‌కు అండగా ముందుకు సాగి నాయకత్వం మెప్పును మరింత పొందారు. అనుకున్నట్లే గత ఎన్నికల్లో ఎర్రగొండపాలెం నుంచి పార్టీ టికెట్ పొందిన ఆయన కేవలం 2,500 ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. వైసీపీకి కంచుకోట లాంటి నియోజకవర్గంలో టీడీపీని గెలుపు వాకిటి వరకూ తెచ్చిన ఘనత ఎరిక్షన్‌కే దక్కింది. అయితే ఓటమిని అధిగమించి పార్టీ కొత్తగా ప్రభుత్వ పదవులు ఇవ్వకపోయినా నియోజకవర్గ ప్రజల సేవలో దూకుడుగా ముందుకు సాగుతున్నారు. పార్టీ, పాలనపై పూర్తి పట్టు సాధించారు. నియోజకవర్గంలో టీడీపీకి గ్రామస్థాయి నుంచి నియోజకవర్గస్థాయి వరకు విధివిధానాలు రూపొందించారు. 64 వేల మందిని పార్టీలో సభ్యులుగా చేర్చడమే కాక గ్రామ, మండల కమిటీల ఏర్పాటులోనూ ముందున్నారు.

రోడ్ల అభివృద్ధిలో ఎరిక్షన్ మార్క్

» భారీగా నిధుల సాధన » ఏడాదిన్నరలోనే ఎంతో అభివృద్ధి » ప్రజలకు తీరిన ప్రయాణ కష్టాలు

త్రిపురాంతకం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండ పాలెం నియోజకవర్గ అభివృద్ధిపై టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తనదైన ముద్ర వేసుకున్నారు. ఆయన కృషితో నియోజకవర్గంలో రోడ్లకు మహర్దశ పట్టింది. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా రోడ్ల బాగోగులను గాలికొదిలేసింది. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే ఎరిక్షన్ కృషితో రోడ్ల నిర్మాణం ఒక్కొక్కటిగా పూర్తవుతోంది. అవసరమైన చోట్ల మరమ్మతులు జరుగుతున్నాయి. దీంతో ప్రజల ప్రయాణ యాతనకు


రూ.2.85కోట్లతో నిర్మించిన ఎర్రగొండపాలెం-పుల్లలచెరువు రోడ్డు

చెక్‌పడింది. ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి రూ.23కోట్లు, పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.27 కోట్లు వెరసి రూ.50 కోట్లు కేవలం రోడ్ల నిర్మాణాలకే ఎరిక్షన్‌బాబు సాధించారు. ఎంతోకాలం ఇబ్బందులుపడ్డ పుల్లలచెరువు-ఎర్రగొండపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డును రూ.2.85 కోట్లతో నిర్మిచడంతో ఇబ్బందులు తొలగిపోయాయి. ఏళ్ల తరబడి నరకం అనుభవిస్తున్న త్రిపురాంతకం-ఎర్రగొండపాలెం ప్రయాణికుల బాధలు చూసి ఆ రోడ్డుకు రూ.7కోట్లు మంజూరు చేయించారు. ఇవికాకుండా ఎర్రగొండపాలెం-గంజివారిపల్లి రోడ్డుకు 2 కోట్లు, చాపలమడుగు-దొనకొండ రోడ్డును కోటి 80లక్షల రూపాయలు, త్రిపురాంతకం మండలంలోని టి.చెర్లోపల్లి రోడ్డును కోటి 40లక్షలతో తారురోడ్డు, మిరియంపల్లి గ్రామానికి కోటి 40లక్షలు, నడిగడ్డకు కోటి 20లక్షలు, వెల్లంపల్లి బ్రిడ్జి అప్రోచ్ రోడ్డుకోసం 2 కోట్ల 6లక్షలు, పుల్లలచెరువు మండలం మల్లాపాలెంలో 60లక్షలతో తారురోడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. పెద్దారవీడు మండలం మద్దలకట్ట-చాట్లమడ గ్రామాల మధ్య 50లక్షలతో


త్రిపురాంతకం మండలం టి.చెర్లోపల్లికి 1.20కోట్లతో నిర్మించిన తారురోడ్డు

తారురోడ్డు, కెజీ రోడ్డు నుంచి కర్రోలకు రూ.68 లక్షలు, బి.చెర్లోపల్లి-చట్లమిట్ట రోడ్డుకు 54లక్షలు మంజూరై దాదాపు 20కోట్లకు పైగా నిధులు తారురోడ్ల నిర్మాణాలకు ఖర్చు చేశారు. ఇవికాక ప్రతి గ్రామ పంచాయతీలో 20లక్షల చొప్పున పల్లెపండుగ పేరుతో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చేపట్టి పూర్తి చేశారు. ప్రదానంగా మాచర్ల-శ్రీశైలం రోడ్డు హైవే విస్తరణలో భాగంగా ఘాట్‌రోడ్డు ఇబ్బందులు తీరేలా పనులు జరుగుతున్నాయి. కుంటవైపు నుంచి దోర్నాల వరకూ హైవే పనులు పూర్తయ్యాయి. ఇవన్నీ చూస్తున్న ప్రజలు కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులకిచ్చే ప్రాధాన్యతలో స్థానిక నాయకుని చొరవ, ప్రజల ఇబ్బందులు తొలగించాలనే తపన కూడా అవసరమంటున్నారు. ఆ లక్షణాలు ఉన్న నాయకుడు టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అని, ఆయన వల్లే ఇదంతా సాధ్యమైందని ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదల వైద్యానికి భరోసా


» సమాచారం సేకరించి ప్రతిఒక్కరికీ సహకారం అందిస్తున్న ఎరిక్షన్‌బాబు

» నియోజకవర్గంలో ఇప్పటికే రూ.4కోట్లకుపైగా ఆర్థిక సాయం



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పేదల ఆరోగ్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు భరోసా కల్పిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యంకోసం అప్పులు చేసి సీఎంఆర్ఎఫ్ గురించి అవగాహన లేక సాయం పొందలేకపోతున్న వారిని గ్రామస్థాయి నాయకుల ద్వారా గుర్తిస్తున్నారు. వారి నుంచి బిల్లులు తెప్పించుకొని నేరుగా ఆయనే రాష్ట్ర సచివాలయానికి వెళ్లి మంజూరు చేయిస్తున్నారు. కేవలం ఏడాదిన్నరలోనే దాదాపు 4కోట్ల 40లక్షల రూపాయల నిధులు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి తెచ్చి నియోజకవర్గంలోని సుమారు 500 మందికిపైగా సాయం అందించారు. ఇందులో 2కోట్ల 20లక్షల రూపాయలు నేరుగా చెక్కుల రూపంలో లబ్ధిదారులకు అందాయి. మిగిలినవి ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) ద్వారా వైద్యశాలలకు చెల్లింపులు జరిగాయి. దీంతో లబ్ధిదారుల కళ్లలో ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తాము వైద్యం కోసం చేసిన అప్పుల నుంచి ఎరిక్షన్‌బాబు కృషితో బయటపడి ఆర్థిక ఇబ్బందులు లేకుండా జీవిస్తున్నామని పలువురు అంటున్నారు. ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.


గిరిజనుల గుడిసెల్లో వెలుగుతున్న బల్బులు

గిరిజన గూడేల్లో వెలుగులు

» ఎరిక్షన్‌బాబు చొరవతో సోలార్ విద్యుత్

» ప్రశంసలు కురిపిస్తున్న గిరిజనులు

త్రిపురాంతకం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అంధకారంలో మగ్గుతున్న చెంచు గిరిజన గూడేల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు చొరవతో వెలుగులు విరజిమ్ముతున్నాయి. ప్రతి గుడిసె సోలార్ కాంతులు సంతరించుకుంటోంది. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారం కూడా ఎరిక్షన్‌బాబుకు బాగా కలిసొచ్చింది. మొదట నల్లమల గూడేలపైనే తన దృష్టి సారించి ఎవ్వరూ ఆదరించని గిరిజనులను అక్కున చేర్చుకుని వారికి వెలుగులు నింపే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గిరిజన గూడేల్లో ఇప్పటికే ఉన్నచోట్ల పాడైపోయిన విద్యుత్ స్తంభాలను మార్పించారు. కొత్తగా 623 స్తంభాలను ఏర్పాటు చేయించారు. తెగిపడేందుకు సిద్ధంగా ఉన్న తీగ (కండక్టర్ వైర్) కూడా మార్పించారు. కొన్నిచోట్ల కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయించారు. ఇలా నల్లమలలోని 84 చెంచుగూడేలలో విద్యుత్ పునరుద్ధరణ కోసం రూ.2కోట్ల 22లక్షలు మంజూరు చేయించి పనులు పూర్తి చేయించారు. విద్యుత్ సమస్య తొలగించేందుకు ఎరిక్షన్‌బాబు చేసిన కృషిని గిరిజనులు ప్రశంసిస్తున్నారు.

నల్లమలలో ప్రతి ఇంటికీ సోలార్ ప్యానెల్‌తో దీపాలు

విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు వీలుకాని పలుగూడేలకు ప్రత్యేక కార్యక్రమం ద్వారా ఎరిక్షన్‌బాబు ప్రతి ఇంటికీ ఒక సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేయించి దాని ద్వారా దీపాలు వెలిగేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం ప్రభుత్వం నల్లమల గూడేలకు దాదాపు 4కోట్ల 5లక్షల రూపాయలు


గిరిజనుల ఇళ్లముందు అమర్చిన సోలార్ ప్లేట్లు

మంజూరు చేసింది. ఇందులో భాగంగా 611 గృహాలకు సౌరవిద్యుత్ అందించేందుకు ప్రతి ఇంటికీ 0.3 కిలో వాట్ ఉత్పత్తి (ఒక ఫ్యాను, రెండు బల్బులు) చేసే సోలార్ ఆఫ్ గ్రిడ్ సిస్టంను ఏర్పాటు చేస్తున్నారు. సోలార్ పరికరాలను కూడా చాలా కష్టపడి వాహనాల ద్వారా నల్లమల గిరిజన గూడేలకు తరలించారు. ఇప్పటికే 90శాతం వరకూ పనులు పూర్తయ్యాయి. మిగిలినవి కూడా వేగంగా జరిగేలా ఐటీడీఏ అధికారులతో ప్రతిరోజూ ఎరిక్షన్‌బాబు సమీక్షిస్తున్నారు. ఇప్పటి వరకూ కేవలం ఎన్నికల సమయంలోనే కలిసి తమ నుంచి ఓట్లు రాబట్టుకోవడం తప్ప తరువాత తమ కనీస అవసరాల గురించి ఎవ్వరూ పట్టించుకోలేదని, ఇప్పుడు ఎరిక్షన్‌బాబు చొరవతో తమ గూడేల్లో వెలుగులు నిండాయని గిరిజనులు చెప్తున్నారు.


జన్మదిన శుభాకాంక్షలు
మా అన్నగారు, మా శ్రేయోభిలాషి,
అభివృద్ధిప్రధాత, ఎర్రగొండపాలెం
నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి
శ్రీ గూడూరి ఎరిక్షన్‌బాబు గారికి
హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు
మీ...
శ్రీ గూడూరి ఎరిక్షన్‌బాబు గారు
ఎర్రగొండపాలెం
నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి
పయ్యావుల ప్రసాదరావు, M.Sc
టీడీపీ మండల మాజీ అధ్యక్షులు,
పుల్లలచెరువు మండలం


జన్మదిన శుభాకాంక్షలు
ప్రజా సంక్షేమమే తన ధ్యేయంగా
అహర్నిశలు అభివృద్ధి కోసం పరితపించే
జనం మెచ్చిన నాయకుడు
ఎర్రగొండపాలెం టీడీపీ ఆశాకిరణం
శ్రీ గూడూరి ఎరిక్షన్‌బాబు గారికి
జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ గూడూరి ఎరిక్షన్‌బాబు గారు
ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి
త్రిపురాంతకం మండల టీడీపీ నాయకులు
మోటకట్ల శ్రీనివాసరెడ్డి
మండల పార్టీ మాజీ అధ్యక్షులు
దేవినేని చలమయ్య
వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్
బొమ్మినేని లక్ష్మణ్‌చౌదరి
మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి
వంకాయలపాటి అంకారావు
మండల తెలుగు యువత మాజీ అధ్యక్షులు
ఊట్ల వెంకటేశ్వర్లు
మాజీ సర్పంచ్, మిట్టపాలెం
గుత్తా శ్రీనివాసచౌదరి(చంటి)
మండల తెలుగు యువత అధ్యక్షులు
వెన్నం వెంకటేశ్వరరావు
సర్పంచ్, పాత అన్నసముద్రం
చిలకల రవీంద్రారెడ్డి
టీడీపీ నాయకులు, రామసముద్రం
వెన్నం వెంకటేశ్వరరావు
క్లస్టర్ ఇన్‌చార్జి, పాత అన్నసముద్రం
సాదు లక్ష్మీనరసింహారెడ్డి
టీడీపీ నాయకులు, దువ్వలి
బాజీ నాయుడు
టీడీపీ యువనాయకులు, జి.ఉమ్మడివరం
బద్దిగం వెంగళరెడ్డి
టీడీపీ నాయకులు, వెల్లంపల్లి


పుట్టినరోజు
శుభాకాంక్షలు
Happy Birthday
మాకు అత్యంత ఆప్తులు, మా అన్నగారు, మా శ్రేయోభిలాషి,
అభివృద్ధి ప్రధాత, ఎర్రగొండపాలెం నియోజకవర్గ
టీడీపీ ఇన్‌చార్జి శ్రీ గూడూరి ఎరిక్షన్‌బాబు గారికి
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు...
శ్రీ గూడూరి ఎరిక్షన్‌బాబు గారు
ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి
కాకర్ల కోటయ్య
టీడీపీ తెలుగు రైతు కార్యదర్శి
పుల్లలచెరువు(మం)
గజ్వేల్లి భాస్కర్‌రావు
మండల టీడీపీ నాయకులు
పుల్లలచెరువు
మేడికొండ
అనిల్‌కుమార్
టీడీపీ పట్టణ అధ్యక్షులు
పుల్లలచెరువు


జన్మదిన శుభాకాంక్షలు
మాకు అత్యంత ఆప్తులు, సేవా తత్పరులు,
నాయకుడంటే ఇలా ఉండాలని జనం మెప్పు పొందిన
మా మనసున్న మారాజు. ఎర్రగొండపాలెం టీడీపీ ఆశాకిరణం
శ్రీ గూడూరి ఎరిక్షన్‌బాబు గారికి
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
చిట్యాల వెంగళరెడ్డి
మండల టీడీపీ అధ్యక్షులు, ఎర్రగొండపాలెం
మేకల వలరాజుయాదవ్
మండల టీడీపీ అధ్యక్షులు, త్రిపురాంతకం
పోట్ల గోవిందు
మండల టీడీపీ అధ్యక్షులు, పుల్లలచెరువు
మెట్టు శ్రీనివాసరెడ్డి
మండల టీడీపీ అధ్యక్షులు, పెద్దారవీడు
షేక్ మాబు బాషా
మండల టీడీపీ అధ్యక్షులు, దోర్నాల
పేరం వీరనాగిరెడ్డి
టీడీపీ నాయకులు,
వై.కొత్తపల్లి
కందుల నారాయణరెడ్డి
కాంట్రాక్టర్
గురిజేపల్లి
పేరం రమణారెడ్డి
ఎర్రగొండపాలెం మండల
రైతు సంఘం అధ్యక్షులు
మూర నారాయణరెడ్డి
మెకానిక్
ఎర్రగొండపాలెం
మేడగం సుబ్బారెడ్డి
టీడీపీ నాయకులు
మురారిపల్లి
భాష్యం లక్ష్మిరెడ్డి
నీటి సంఘం అధ్యక్షులు
మురారిపల్లి
వెన్నా వెంకిరెడ్డి
మాజీ సర్పంచ్
గురిజేపల్లి
కందుల వెంకటేశ్వరరెడ్డి
గ్రామ టీడీపీ అధ్యక్షులు
గురిజేపల్లి
గంజి రమణారెడ్డి
టీడీపీ నాయకులు
గంజివారిపాలెం
సురవరపు శ్రీరాములరెడ్డి
టీడీపీ నాయకులు
గంజివారిపాలెం
కైపు బ్రహ్మారెడ్డి
టీడీపీ గ్రామ అధ్యక్షులు
మిల్లంపల్లి
శ్రీ గూడూరి ఎరిక్షన్‌బాబు గారు
ఎర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి

నేడు కరెంట్ సరఫరా నిలిపివేత

దర్శి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని పొదిలి రోడ్డు, ఎల్‌పీ రోడ్డు, కురిచేడు రోడ్డు, తూర్పుచౌటపాలెం రోడ్డు, అద్దంకి రోడ్డు, పుచ్చలమిట్ట, శివరాజ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఆదివారం కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు శాఖ ఏఈ సచన్‌కుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 6 నుంచి 9 గంటల వరకు కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు ఈవిషయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

గోకులం షెడ్ల నిర్మాణ పనులు చేపట్టాలి

పామూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పామూరు మండలానికి మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన చేపట్టాలని టీడీపీ క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జ్ గుంటుపల్లి శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని నర్రమారెళ్ల గ్రామంలో గోకులం షెడ్డు నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో జి.సుబ్బరాయుడు, అమ్ములూరి ఏసు, చిట్టేటి రమణయ్య, దగ్గుల రమణారెడ్డి, గంధం లోకయ్య, ధనికుల వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని డీజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సుబ్బా రావు కలర్ ప్రింటర్‌ను శనివారం బహూకరించారు. ఈసందర్భంగా హెచ్ ఎం రసూల్ దాతను అభినందించారు.

మహిళలపై హింసను అరికట్టాలి

కనిగిరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మహిళలపై హింసను అరికట్టాలని మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. అంతర్జాతీయ మహిళాహింసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింసను ప్రతిఒక్కరూ అడ్డుకోవాలన్నారు. మహిళలు సమాజంలో భాగస్వాములే అనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. మహిళలు, బాలికల పట్ల జరుగుతున్న లైంగిక వేధింపులపై వ్యతిరేకంగా పోరాడాలన్నారు. మహిళలను గౌరవించి వారికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఎస్‌హెచ్‌జీ మహిళలు, వీవోఏ రమణమ్మ, ఏపీఎం అశోక్, సీసీలు బాషా, రమణయ్య, సుబ్రమణ్యం, వజ్రమ్మ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నాగలక్ష్మి, గుడ్‌హెల్ప్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పెదఉల్లగల్లు ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శిగా షమీలా బేగం

ముండ్లమూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఉల్లగల్లు గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా పులిపాడు కార్యదర్శిగా పనిచేస్తున్న షమీలా బేగంను నియమించినట్లు ఎంపీడీవో ఎం.శ్రీదేవి తెలిపారు. ఇప్పటివరకు పెద ఉల్లగల్లు కార్యదర్శిగా పనిచేసిన జె.రాజరాజేశ్వరి ఉద్యోగోన్నతిపై కురిచేడు మండల డిప్యూటీ ఎంపీడీవోగా వెళ్లారు.

బాధితురాలికి చెక్కు అందజేత

ముండ్లమూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ళ గ్రామానికి చెందిన చింతలపూడి శ్రావణి అనారోగ్యకారణంగా బైపాస్ సర్జరీ అవసరమని డాక్టర్లు నిర్ధారణ చేశారు. ఈవిషయాన్ని ఆమె కుటుంబసభ్యులు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.5 లక్షల చెక్కును మంజూరు చేయించారు. శనివారం నరసరావుపేటలోని తన స్వగృహంలో బాధితురాలి కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కుమ్మరి శాలివాహన డైరెక్టర్ పిడతల నెమిలయ్య పాల్గొన్నారు.

వైద్యం చేయించరూ..

తాళ్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న తమ కుమారులకు వైద్యం చేయించాలని మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన కొనికి వెంకట్రావు దంపతులు వేడుకున్నారు. శనివారం తాళ్లూరులో జరిగిన ప్రజాదర్బార్ నడవలేని స్థితిలో వున్న ఇద్దరు కుమారులను తీసుకువచ్చి తమ బాధలను వివరించారు. తమశక్తిమేర ఆస్తిపాస్తులు అమ్మి చికిత్స చేయించినా వ్యాధి నయం కాలేదన్నారు. డాక్టర్ లక్ష్మి స్పందిస్తూ త్వరలో సీఎం చంద్రబాబు వద్దకు తీసుకువెళ్లి వైద్యం అందించే చర్యలు చేపడతామన్నారు.

పర్యాటకాభివృద్ధిపై మాగుంట ప్రశ్న

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధితో పాటు గ్రామాల్లో గృహ వసతుల పెంపుదలపై కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుందని ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి శనివారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్‌షెకావత్ సమాధానం ఇస్తూ గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటకం పెంపుదల కోసం ప్రతి రాష్ట్రానికి రూ.5కోట్ల వరకు నిధులు ఇస్తున్నట్లు చెప్పారు.దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటకుల కోసం 4880 ఇళ్ళు నమోదు కాగా అందులో ఆంధ్రప్రదేశ్‌లో 26 నమోదయ్యాయని తెలిపారు. ఆందుకోసం ఆంధ్రప్రదేశ్‌కు రూ.23 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని యడవల్లి గ్రామంలో రూ.13 లక్షలతో చేపట్టిన 20వేల లీటర్ల సామర్థ్యం గల్గిన ఓహెచ్‌ఎస్‌ఆర్ తాగునీటి సరఫరా ట్యాంకుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మంచినీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక



కనిగిరిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

దృష్టి సారించిందన్నారు. అందులోభాగంగా రూ.1290 కోట్ల అంచనాతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విశ్వనాథరెడ్డి, టీడీపీ నాయకుడు నారపరెడ్డి (యడవల్లి) శ్రీనివాసులరెడ్డి, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి

రాజ్యాంగ నిర్మాణంలో అంబేడ్కర్ పాత్ర అజరామరంగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. అంబేడ్కర్ 69వ వర్ధంతి సందర్భంగా శనివారం కనిగిరిలోని ఒంగోలు బస్టాండు సెంటర్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ప్రతిఒక్కరికి స్వేచ్ఛ, సమానత్వం ఉండాలనే సంకల్పంతో రాజ్యాంగ హక్కులను కల్పించడంలో అంబేడ్కర్ ప్రముఖ పాత్ర వహించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రకాశం, బుల్లా బాలబాబు, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, చిరంజీవి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, తమ్మినేని వెంకటరెడ్డి, రోషన్ సంధాని, జంషీర్, కేవీఎస్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ షేక్ వాజిదాబేగం, నజిబుద్దీన్, పీర్లమస్తాన్‌వలి, తిరుపాలు, సిద్ధాంతి బారాయిమాం, కరణం అరుణ, ధనలక్ష్మి, దొరసాని, తులసి తదితరులు పాల్గొన్నారు.

యువత ఉద్యోగాలు సాధించాలి

నిరుద్యోగ యువతీ, యువకులు నైపుణ్యంతో ఉద్యోగాలు సాధించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక ఆల్ఫా డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కనిగిరి ప్రాంతంలోని నిరుద్యోగ యువత వ్యాపారరంగంలో రాణించి పారిశ్రామికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కనిగిరి ప్రాంతంలోని పీసీపల్లి మండలంలో ఎంఎస్‌ఎంఈ పార్కులను ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, యువతీ, యువకులు పాల్గొన్నారు. అనంతరం పట్టణ సమీపంలోని కనక పట్టణంలో సీసీ రోడ్డు, మురుగు కాల్వల నిర్మాణ పనులను పరిశీలించారు.



యడవల్లి గ్రామంలో తాగునీటి ట్యాంకుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలి

చాకిరాల సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పట్టణ సమీపంలోని కేటీఆర్ టెక్నో స్కూల్ ఆవరణలోని శ్రీలక్ష్మీ నరసింహాస్వామి సన్నిధిలో నూతనంగా నియమితులైన చాకిరాల సొసైటీ అధ్యక్షుడు అర్జున్‌రావుకు ఎమ్మెల్యే నియామక పత్రం అందజేశారు. తొలుత ఎమ్మెల్యే శ్రీలక్ష్మీనరసింహాస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కేటీఆర్‌స్కూల్ చైర్మన్ కుందురు తిరుపతిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, తిప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

తాళ్లూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తున్నట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగిన ప్రజాదర్బార్‌లో ఆమె పాల్గొన్నారు. మండలంలోని వివిధగ్రామాల ప్రజలనుంచి 226 వినతిపత్రాలు స్వీకరించారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించామన్నారు. మరికొన్నింటిని అధికారులు పరిశీలించి పరిష్కరిస్తారన్నారు. పరిష్కారంకాని సమస్యలు ఏకారణమన్న విషయాన్ని వినతులు ఇచ్చినవారికి తెలియజేయడం జరుగుతుందన్నారు. రెవెన్యూ సమస్యలపైనే ఎక్కువ అర్జీలు వచ్చాయన్నారు. తాళ్లూరుప్రాంత ప్రజల చిరకాలవాంఛ అయిన మొగిలిగుండాల రిజర్వాయర్ నిర్మాణపనులు అసంపూర్తిగాఉండగా, ప్రజాప్రభుత్వ రాగానే పూర్తి చేయించామన్నారు. లోవోల్టేజీ సమస్య పరిష్కారం కోసం 133కేవీ సబ్‌స్టేషన్‌ను నిర్మించగా, ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు.



ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తూ సమస్యలను తెలుసుకుంటున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

తాళ్లూరు ప్రాంత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా దర్శి నియోజవర్గాన్ని ప్రకాశం జిల్లాలోనే ఉండేలా సీఎం చంద్రబాబు సహకరించటం ఎంతోసంతోషకర విషయమన్నారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, వైస్‌ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, నాయకులు మానం రమేష్‌బాబు, ఓబుల్‌రెడ్డి, వేణుబాబు, రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, శివనాగిరెడ్డి, అనపర్తి సుబ్బారావు, కాశింసైదా, సత్యం, నాగేంద్రం హనుమారెడ్డి, పిన్నిక రమేష్, రాచకొండ వెంకట్రావు, రామకోటిరెడ్డి, వి.సుబ్బయ్య, ఎంపీడీవో అజిత, తహసీల్దార్ రమణారావు, డీఈ మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో సమస్యల వెల్లువ

తాళ్లూరులో జరిగిన ప్రజాదర్బార్‌లో ప్రజలు అనేక సమస్యలను వినతుల రూపంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి అందజేశారు. తాళ్లూరు ఎస్సీలకు గత టీడీపీ ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరుచేసిన స్థలంలో విద్యుల్ లైన్లు అడ్డుగా ఉన్నాయని టీడీపీ ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు అనపర్తి సుబ్బారావు వినతిపత్రం అందజేశారు. మండలంలోని పలుగ్రామాల్లో పట్టా భూములను 2016లో దేవుని భూములుగా నమోదు చేయటంతో రిజిస్ట్రేషన్లు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని పలుగ్రామాల ప్రజలు విన్నవించారు. గత ప్రభుత్వం రీసర్వే పూర్తిచేసిన గ్రామాల్లో భూముల హద్దులు, రికార్డులు తప్పులుగా నమోదయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావటం లేదన్నారు. ఈసందర్భంగా గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ ప్రజల సమస్యలను త్వరితగతిని పరిష్కరించాలని తహసీల్దార్ రమణారావుకు సూచించారు.

భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగుచేయాలి



శంకరాపురంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ముండ్లమూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల ద్వారా పంటలు సాగుచేయాలని మండల వ్యవసాయాధికారి ఏ.తిరుమలరావు అన్నారు. ఎరువులు, పురుగు మందులు వాడకం తగ్గించాలన్నారు. శనివారం మండలంలో శంకరాపురం గ్రామంలో ఆత్మ వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సౌజన్యంతో మండల వ్యవసాయ శాఖ సహకారంతో భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు అందించే విధానంపై ప్రదర్శన క్షేత్రం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో తిరుమలరావు మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో అవసర మేరకు మాత్రమే ఎరువులు వాడాలన్నారు. అనవసరంగా ఎరువులు వాడితే దిగుబడి తగ్గి పురుగు ఉధృతి ఎక్కువకావడంతోపాటు మందుల ఖర్చులు పెరుగుతాయన్నారు. చౌడు భూముల్లో జిప్సం వేయాలని సూచించారు. అద్దంకి ఆత్మ అధికారి కోట రామిరెడ్డి మాట్లాడుతూ నేలలో భాస్వరం నిల్వలు పరిమితికి మించి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆత్మ అధికారి పి.శేషారావు, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ కూరపాటి మహేశ్వరి నారాయణ స్వామి, వీఏఏ ఆంజనేయులు, కె.వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

దర్శి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి వేడుకలను శనివారం దర్శిలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ జి.సుధారాణి, సబ్‌జైలు సూపరింటెండెంట్ కోటేశ్వరరావు, వ్యవసాయాధికారి కె.రాధ, ఎంఈవో రమాదేవి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జాకీర్‌బాషా, ఏఐటీయూసీ నాయకుడు జె.కోటేశ్వరరావు, దళిత ప్రజాసంఘాల నాయకులు జి.గోవిందప్రసాద్, ఎం.బ్రహ్మయ్య, జి.యాకోబు, ఏ.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు నిర్వహించారు. కన్వీనర్ నాగమణి ఆధ్వర్యంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా క్విజ్ పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు.

పీసీపల్లి: స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ అంబేడ్కర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, కోమటిగుంట వీరయ్య, పరిశపోగు చలపతి, నాగేంద్రబాబు, కంచర్ల వెంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



దర్శిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, నేతలు

పామూరు: అంబేడ్కర్ వర్ధంతిని శనివారం పామూరులో ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక ప్రభుత్వ కళాశాల వద్ద ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్‌సీ సెల్ నాయకుడు బడ్డిపూడి మార్కు , బీజేపీ నాయకుడు కేవీ రమణయ్య, ఇర్రి కోటిరెడ్డి, ఉడుముల ప్రభాకర్‌రెడ్డి, సయ్యద్ మౌలాలి, వజ్రాల సుబ్బారావు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, సీఎస్‌పురం మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొబ్బూరి రమేష్, ఎన్‌సీ మాలకొండయ్య, మన్నేపల్లి శ్రీనివాసులు, షేక్ మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

దొనకొండ: అంబేడ్కర్ వర్ధంతి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, కుందుర్తి చిన్ననర్సింహులు, బచ్చలకూరి కాశయ్య తదితరులు నాలుగురోడ్ల కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పంచాయితీ వార్డు సభ్యుడు బొందల రాజు ఆధ్వర్యంలో ఒబ్బాపురం కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పోలేపల్లి ఎస్సీ కాలనీలో హెచ్‌ఎం ఆదిమూలపు ప్రభుదాస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌతమీ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ ఎఫ్రాయిమ్(నాని) నేతృత్వంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

కురిచేడు: కురిచేడులో అంబేడ్కర్ 69వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పడమర మాలపల్లెలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దర్శిరోడ్డులో ఎమ్మార్పీఎస్ నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాలలో కొండారెడ్డి, రమేష్, జక్రయ్య, బెన్హర్ బాబు, త్రిపురయ్య, కోటేశు, ఏసుపాదం, జోసెఫ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు: డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాళ్లూరు దళిత కాలనీలో అంబేడ్కర్, మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రాం విగ్రహాలకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా జీవించే హక్కుల కల్పిస్తూ లిఖించిన రాజ్యాంగం ఫలితమే ప్రజలు సుఖశాంతులతో జీవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో దళిత నేతలు అనపర్తి సుబ్బారావు, దారా అంజయ్య, అనపర్తి ఆదామ్, టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, మానం రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు. స్థానిక అంబేడ్కర్ కాలనీలో జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు దారా అంజయ్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్.మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు. కే జీబీవీ బాలికలకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు దార్ల కోటేశ్వరరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.సుజిత పాల్గొన్నారు.



తాళ్లూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ముండ్లమూరు: ముండ్లమూరులోని పీహెచ్‌సీలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా దళిత నాయకుడు పాలెపోగు డగ్లస్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మారెళ్లలో జరిగిన కార్యక్రమంలో సీపీఎం నాయకుడు ఆంజనేయులు, ఎంపీటీసీ పాలపర్తి సుబ్బారావు, జి.ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



నిధుల మంజూరు పత్రాన్ని అందుకుంటున్న దేవస్థాన చైర్మన్ చినఆదినారాయణ, ఈవో నరసింహబాబు

దేవస్థాన అభివృద్ధికి రూ.కోటి 25 లక్షలు మంజూరు

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థాన అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి 25 లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. కనిగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దేవస్థాన చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు శనివారం డాక్టర్ ఉగ్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నిధుల మంజూరు సంబంధించిన పత్రాన్ని ఎమ్మెల్యే వారికి అందజేశారు. దేవస్థానంలో ధ్యాన మందిరం(అన్నదానశాల) నిర్మాణానికి సీజీఎఫ్ నిధులు రూ.83 లక్షల 33 వేలు మంజూరయినట్లు ఈవో తెలిపారు. మొత్తం అంచనా వ్యయం రూ. కోటి 25 లక్షలు కాగా, దేవస్థాన మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ రూ.41 లక్షల 67 వేలు చెల్లిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కుందూరు తిరుపతిరెడ్డి, మాకినేని సాయిరాం, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లు పంపిణీ

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లమడుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ తయారుచేసిన మోడల్ టెస్ట్ పేపర్లను దాతలు దుగ్గిరెడ్డి వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాసరాజు సహకారంతో శనివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా హెచ్‌ఎం వైవీ సుబ్బారావు మాట్లాడుతూ మోడల్ టెస్ట్ పేపర్లు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో నాగులారం హెచ్‌ఎం బి.డేవిడ్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.సాంబశివరావు, ప్రధానకార్యదర్శి షేక్ పాదుషా, నాయకులు ఎస్.తిరుపతయ్య, టి.మదన్, ఎ.లక్ష్మణరావు, జి.శ్రీనివాసరాజు, రసూల్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ హోంగార్డుగా రమణయ్య

పామూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వృత్తిపట్ల అంకితభావం, క్రమశిక్షణతో ఉత్తమ ప్రతిభా పాటవాలు చాటుకుంటున్న పామూరుకు చెందిన హోంగార్డు దారబోయిన రమణయ్య ఉత్తమ హోంగార్డుగా ఎంపికయ్యారు. 63వ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను శనివారం ఒంగోలులోని జిల్లా పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా హోంగార్డ్ రమణయ్య ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పామూరు సీఐ ఎం.శ్రీనివాసరావు, ఏఎస్ఐ షేక్ జిలానిబాషా, సిబ్బంది రమణయ్యకు అభినందనలు తెలిపారు.



ఎస్పీ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న హోంగార్డ్ రమణయ్య

దొనకొండను మార్కాపురం జిల్లాలో కలపాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త వెంకటకృష్ణారెడ్డి

దొనకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): దొనకొండ మండలాన్ని 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న మార్కాపురం జిల్లాలో కాకుండా వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒంగోలులోనే కొనసాగించటం బాధాకరమని కాంగ్రెస్‌పార్టీ దర్శి నియోజకవర్గ సమన్వయకర్త కైపు వెంకటకృష్ణారెడ్డి అన్నారు. దొనకొండలోని రైల్వే పెన్షనర్స్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ దొనకొండ, కురిచేడు మండలాలను నూతనంగా ఏర్పడే మార్కాపురం జిల్లాలో కలపాలని డిమాండ్ చేశారు.

దొనకొండలో పరిశ్రమల కారిడార్ ఏర్పాటుచేసి ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాల న్నారు. కార్యక్రమంలో ఎన్.కోటిలింగం, వీర్రాజు, ధర్మారావు, ఇండ్లా శ్రీను, బత్తుల వెంకటసుబ్బ య్య, షేక్ గఫూర్, ముజాహిద్, షేక్ ఉమ్మర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

టెట్ నుంచి ఇన్‌సర్వీస్ టీచర్లకు మినహాయింపు ఇవ్వాలి



ఎస్టీయూ నూతన కార్యవర్గంతో రాష్ట్ర నాయకుడు బైరెడ్డి వెంగళరెడ్డి

పామూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ నాయకుడు బైరెడ్డి వెంగళరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఒమేగా బీఈడీ కళాశాలలో మన్నే హరనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన ఆసంఘం మండల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 12వ పీఆర్సీని నియమించి ఐఆర్ 30శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలను వెంటనే ఇవ్వాలన్నారు. జీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని డిమాండ్ చేశారు.

అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గద్దె సుధాకర్ రావు, ప్రధానకార్యదర్శిగా వై.రామచంద్రారెడ్డి, జిల్లా కౌన్సిలర్‌గా హరనాథరెడ్డి, జి.మల్లికార్జునరావు, టి.మాల్యాద్రిరెడ్డి, వి.రవీంద్ర, ఎన్.జనార్దన రావు, ఆర్థిక కార్యదర్శిగా ఎస్.లక్ష్మీరెడ్డి, మహిళా కార్యదర్శిగా ఎన్.వనజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా సానికొమ్ము శ్రీనివాసులురెడ్డి, ఎన్నికల అధికారిగా డి.వెంకటేశ్వరరెడ్డి వ్యవహరించారు. అలాగే, సీఎస్‌పురం మండల ఎస్టీయూ సమావేశం బి.వెంగల్‌రెడ్డి అధ్యతన జరిగింది.

ఈసందర్భంగా ఆసంఘం మండల అధ్యక్షకార్యదర్శులుగా షేక్ ఖాదర్ బాషా, దాసరి నాగయ్య, జిల్లా కౌన్సిలర్‌గా బి.వెంగల్‌రెడ్డి, మహిళా కార్యదర్శిగా ఎస్.సుజాత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నేడు చర్లపల్లి, చెన్నై ఎగ్మోర్‌కు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆదివారం గుంటూరు మీదుగా చర్లపల్లికి ప్రత్యేక రైలును నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 06019 చెన్నై ఎగ్మోర్-చర్లపల్లి ఎక్స్‌ప్రెస్ ఆదివారం ఉదయం 7.05కి గుంటూరుకు వచ్చి 7.15కి బయలుదేరి మధ్యాహ్నం 2 గంటలకు చర్లపల్లి చేరుకొంటుందని చెప్పారు. రైలు నంబరు. 06020 చర్లపల్లి-చెన్నై ఎగ్మోర్ ఎక్స్‌ప్రెస్ స్పెషల్ ఆదివారం రాత్రి 11 గంటలకు గుంటూరుకు వచ్చి 11.10కి బయలుదేరి సోమవారం ఉదయం 8.30కి చెన్నై ఎగ్మోర్‌కు చేరుకొంటుందని సీపీఆర్‌వో తెలిపారు.



పోయిన చోటే పొందాలని

గతంలో సీసీఐ విత్తనాల టెండర్ల వ్యవహారంలో కొందరు బయ్యర్లు చేతులు కాల్చుకున్నారు. ఇప్పుడే అదే వ్యక్తులు సీసీఐ కేంద్రాల్లో రైతుల జేబుకు భారీగా చిల్లు పెడుతున్నారు. ఆయా కేంద్రాల్లో అసలు నిబంధనలు ఏమాత్రం అమలు కావడం లేదన్న ఆరోపణలున్నాయి.

ఇంత జరుగుతున్నా రైతులు నోరు విప్పని పరిస్థితి నెలకొంది. ప్రశ్నిస్తే.. అసలు పత్తి కొనుగోలు చేయరన్న భయం వారిలో ఉంది. అయితే గుంటూరు నగరంలో ఒక బయ్యర్ విధిస్తున్న కోతను ఓ వ్యక్తి వీడియో రికార్డ్ చేసి మీడియాకు వెల్లడించాడు.

నిలువు దోపిడీ

సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతు జేబుకు చిల్లు

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతు నిలువు దోపిడీ జరుగుతోంది. సీసీఐ కేంద్రానికి చేరినప్పుడు మొదలైన మామూళ్ల ప్రక్రియ అమ్మే వరకు కొనసాగుతూనే ఉంది. చివరికి పత్తిలో తేమ శాతం చూడటానికి కూడా డబ్బులు ముట్టజెప్పాల్సి వస్తోందంటే.. పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు. ఒక పక్క హైకోర్టు కేసులు, మరో పక్క సీఐడీ విచారణ జరుగుతున్నా.. వాటితో సంబంధం లేదన్నట్లుగా కొందరు బయ్యర్లు చేతివాటం చూపిస్తున్నా రు. రోజుకు రూ.లక్షల్లో టార్గెట్‌లు పెట్టుకుని మరీ ముందుకు వెళ్తున్నారు.



పత్తి తేమ శాతం చూస్తే రూ.5 వేలు

- 12శాతం తేమ ఉంటే.. 20 కేజీల కోత
- అడ్డు అదుపు లేకుండా బయ్యర్ల చేతివాటం
- రోజుకు రూ.లక్షల్లో ఆదాయమే ధ్యేయం

తేమ ఎక్కువ ఉంటే.. తూకంలో కోతే

సీసీఐ నిబంధనల ప్రకారం రైతులు తీసుకువచ్చే పత్తిలో తేమ 8 నుంచి 12 శాతం మాత్రమే ఉండాలి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా పత్తిలో 15 శాతం పైనే ఉంటోంది. ఈ నేపథ్యంలో తేమ 12 శాతం మించిన పత్తిని కూడా కొంటామని కొన్ని కేంద్రాల్లో బయ్యర్లు చెబుతున్నారు. అయితే క్వింటాల్‌కు 10 నుంచి 20 కేజీల వరకు నిర్మొహమాటంగా కోత పెడుతున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సాధారణంగా సీసీఐ కేంద్రానికి తీసుకువచ్చిన పత్తికి తేమ శాతం ఎంత ఉందో పరిశీలిస్తారు. అది ముగిసిన తర్వాత కొనుగోలు ప్రక్రియ జరుగుతుంది. పల్నాడు జిల్లా లోని కొన్ని కేంద్రాల్లో తేమ శాతం చూడాలంటే రూ.5 వేలు ఇవ్వాలని ముందే చెబుతున్నారు. ఈ మేరకు రైతు ముందే ఒప్పుకుంటేనే తేమ చూస్తున్నారు. కొందరు ఒప్పుకోకపోవడంతో వారిని ముప్పుతిప్పలు పెడుతున్నారు. గుంటూరులోని కేంద్రాల్లో కూడా ఇదే రీతిలో వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

పక్క జిల్లాల నుంచి వస్తే పండగే..

రైతులు గుంటూరుతోపాటు, పల్నాడు జిల్లాలోని సీసీఐ కేంద్రాలకు పత్తిని తీసుకొస్తారు. తీరా ఇక్కడికి వచ్చాక.. పత్తికి బయ్యర్లు అనేక శీల పరీక్షలు చేస్తున్నారు. సుదూరం నుంచి తీసుకొచ్చిన పత్తిని రైతు సాధ్యమైనంత వరకు వెనక్కి తీసుకెళ్లలేడు కనుక.. చెప్పినంత కోతకు ఒప్పుకుంటే సరేసరి.. లేకుంటే వెనక్కి తీసుకెళ్లాల్సిందే అని తెగేసి చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం, ఏలూరు, కృష్ణా జిల్లా గంపలగూడెం, జగ్గయ్యపేట తదితర ప్రాంతాల నుంచి గుంటూరులోని సీసీఐ కేంద్రాలకే పత్తిని (మిగతా 6వ పేజీలో)



చిత్తశుద్ధితో విభిన్న ప్రతిభావంతుల

సమస్యలు పరిష్కారం

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తామని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో శనివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణ స్వామి, ఆర్డీవో పి.గ్లోరియా, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోటేశ్వర రావు తదితర ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభలో కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి, విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ముందుకెళ్లాలని కోరారు. జిల్లాలో 32 వేల మంది దివ్యాంగులు ఉన్నారని, వీరంతా ప్రభుత్వం అందించే పింఛన్లు పొందుతున్నారని చెప్పారు. దివ్యాంగుల హక్కుల చట్టం జిల్లాలో పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన దుకాణాల కేటాయింపులో 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నామన్నారు. 2015లో ఐఏఎస్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా విభిన్న ప్రతిభావంతులతో డెహ్రాడూన్‌లో ట్రైనింగ్ ఇచ్చారని కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. జిల్లాలో 25 భవిత సెంటర్లు ఉన్నాయని, ఆర్టిజం సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దివ్యాంగ విద్యార్థులకు, ఉద్యోగులకు మేలు కలిగే కార్యక్రమాలు చేస్తుందన్నారు. విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు 7 వరాల ఇంద్ర ధనుస్సును ప్రకటించారన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోటేశ్వరరావు మాట్లాడుతూ దివ్యాంగులకు సమాన హక్కుల కోసం.. ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. అనంతరం దివ్యాంగులకు క్రీడాపోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ సలోమి, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, నాయకులు గోగన ఆదిశేషు, చల్లా రామయ్య, పిట్ల శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట

- 43 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన మంత్రి రవికుమార్

అద్దంకి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్న 43 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నగదు చెక్కులను శనివారం మంత్రి గొట్టిపాటి చిలకలూరిపేటలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మిగిలిన వ్యవస్థల్లానే.. వైద్య వ్యవస్థను కూడా భ్రష్టు పట్టించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తుండటంతో సామాన్య కుటుంబాలు కూడా కార్పొరేట్ వైద్యం చేయించుకుంటున్నట్లు చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు మారుమూల చిన్న గ్రామాల్లోనూ సబ్‌సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్య క్రమంలో ఆయా గ్రామాల టీడీపీ నేతలు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

మహానటి సావిత్రి గొప్ప మానవతా వాది

- కళా స్రవంతి అధ్యక్షుడు ప్రభాకర్

రేపల్లె, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మహానటి సావిత్రి గొప్ప మానవతావాది అని, తోటివారికి సాయం అందించడంలో ముందుండేవారని సావిత్రి కళా స్రవంతి అధ్యక్షుడు బడే ప్రభాకర్ అన్నారు. శనివారం వడ్డివారిపాలెంలోని శ్రీమతి సావిత్రి గణేష్ జడ్పీ ఉన్నత పాఠశాలలో సినీ నటి సావిత్రి 89వ జయంతి నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు ప్రముఖులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ మహానటి సావిత్రి కష్టాల్లో ఉన్న వారికి నేనున్నానంటూ ఆపన్నహస్తం అందించడంలో ముందుండేవారని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు బద్రినాథ్ మాట్లాడుతూ సావిత్రి పేరుతో ఈ పాఠశాల నిర్మించడం, వేలాది మంది విద్యార్థులు విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించడం గర్వంగా ఉందన్నారు. సర్పంచ్ వడ్డి లక్ష్మీజీ మహా నటిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అబ్బురామనాథం, కొట్టి అనిల్‌బెనర్జీలు రూ.1.25 లక్షలతో పిల్లల బల్లలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు హనుమంతరావు, ఈశ్వరరావు, శివకుమార్, ఉదయభాస్కర్, రమణ, అంకమ్మ, బాబూరావు, ప్రేమ్‌కుమార్, ఎస్.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అభిమానులు



బల్లికురవ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

బల్లికురవ పోలీసు స్టేషన్ తనిఖీలో ఎస్పీ ఉమామహేశ్వర్

బల్లికురవ, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ ఉమామహేశ్వర్ హెచ్చరించారు. శనివారం బల్లికురవ పోలీసు స్టేషన్‌ను ఆయన వార్షిక తనిఖీ చేశారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి, పలు అంశాలపై సిబ్బంది నుంచి వివరణ తీసుకున్నారు. పోలీసు సిబ్బంది బాధ్యతతో, ప్రజలతో మమేకమై పనిచేయాలని సూచించారు. స్టేషన్ ఆవరణలోని సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. అనంతరం విలేకర్లతో ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలోని 1013 మంది రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టామని చెప్పారు. చట్టాన్ని ఉల్లంఘించి నేరాలకు పాల్పడితే జిల్లా బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే పలు కేసుల్లో ఉన్న 32 మందిపై పీడీ యాక్టు నమోదు చేశామన్నారు. బల్లికురవ ప్రాంతంలోని గ్రానైట్ క్వారీల్లో ప్రమాదాలు జరగకుండా భద్రత చర్యలకు ప్రత్యేక అవగాహన సమావేశాలు ఏర్పాటు చేయించేలా చర్యలు చేడపతామన్నారు. అక్రమ మద్యం, గంజాయి అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.డీఎస్పీ రామాంజనేయులు, స్పెషల్ బ్రాంచ్ సీఐ నారాయణ, సంతమాగులూరు సీఐ కాకుమాను వెంకట్రావు, ఎస్ఐ .నాగరాజు ఉన్నారు.

పాలకుల్లేని.. పురాలకు

మొండిచేయి

- ఆర్థిక సంఘం నిధులు నిలిపివేత
- ఎన్నికలు నిర్వహించని ఫలితం



నరసరావుపేట పురపాలక సంఘ కార్యాలయం

(రేపల్లె, ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వం పలు మునిసిపాలిటీలకు మొండిచేయి చూపింది. ఎన్నికలు నిర్వహిం చని ఫలితం.. 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిపివేసింది. నరసరావుపేట, బాపట్ల, పొన్నూరు, మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పెద్ద ఎత్తున నిధులు కోల్పోయాయి. దీంతో ఆయా పురపాలక సంఘాల్లో ప్రగతి ప్రశ్నార్థకంగా మారింది. అయితే గుంటూరు కార్పొ రేషన్, పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని ఇతర మునిసిపాలిటీలకు 2025-26 సంవత్సరానికి గాను కేంద్రం నుంచి విడుదలైన రెండో విడత నిధులు రూ.52.15 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మునిసిపాలిటీల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది.

విలీన సమస్య..

జనాభా ప్రాతిపదికన ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం పురపాలక సంఘాలకు విడుదల చేస్తుంది. ఈ నిధుల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇస్తారు. ఎన్నికలు నిర్వహించని ఫలితంగా నరసరావుపేట, బాపట్ల, పొన్నూరు మున్సిపాలిటీలతో పాటు మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థకు మొండి చేయి తప్పలేదు.

ఈ పురాలకు పొరుగున ఉన్న పంచాయతీలను విలీనం చేసి వార్డుల సంఖ్యను పెంచారు. గత ప్రభుత్వంలో అధికారులపై ఒత్తిడి తెచ్చిన వైసీపీ నేతలు వారికి అనుకూలంగా వార్డుల పునర్విభజన చేయించారు. అభ్యంతరాలు వచ్చినా.. అధికారులూ లక్ష్య పెట్టలేదు. దీంతో వార్డుల పునర్విభజన సక్రమంగా జరగలేదని బాధితులు కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో నరసరావుపేట, పొన్నూరు, బాపట్ల మునిసిపాల్టీల ఎన్నికలు నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం (మిగతా 6వ పేజీలో)

నిధులు విడుదల ఇలా..

మునిసిపాల్టీ	విడుదలైన నిధులు
గుంటూరు	25,70,27,485
తెనాలి	5,57,23,074
చిలకలూరిపేట	5,01,92,840
రేపల్లె	1,77,02,759
మాచర్ల	2,17,82,665
సత్తెనపల్లి	2,06,02,250
పిడుగురాళ్ల	2,35,71,377
అద్దంకి	1,58,56,212
చీరాల	2,98,80,252
దాచేపల్లి	1,71,48,906
గురజాల	1,25,05,961

ప్రభుత్వ సేవలు సులభతరం చేయాలి



కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సేవలన్ని ప్రజలకు సులభతరంగా అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందుతున్న ప్రభుత్వ సేవలపై కలెక్టర్ శనివారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ ప్రజలకు చేరువయ్యేలా కృషి చేయాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి నుంచి మండల, గ్రామ వార్డు సచివాలయాల అధికారిగా పదోన్నతి పొందిన వారంతా ప్రజల కోసం పనిచేయాలన్నారు. ఈకేవైసీ 18వేలు పెండింగ్ ఉండటంపై ఆరా తీశారు. ప్రతి రోజు 300 తగ్గకుండా ఈకేవైసీ నవీకరించాలన్నారు. ఆటో డ్రైవర్ సేవలో పథకం కింద 8 మందికి నగదు పడకపోవడంపై.. వివరాలు అడిగి తెలుసుకున్నారు. తక్షణమే వారికి అందేలా చూడాలన్నారు. తల్లికి వందనం పథకం లబ్ధి బాపట్లలో 77మందికి, చీరాలలో 63మందికి పెండింగ్‌లో ఉందన్నారు. అసంపూర్తిగా ఉన్న సచివాలయాల భవనాల నిర్మాణ పనుల వివరాలపై నివేదిక ఇవ్వాలన్నాను. 10వ తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా మండల విద్యాశాఖాధికారి పర్యవేక్షించాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల బయోమెట్రిక్ నవీకరణ వేగంగా చేయాలన్నారు. అపార్ ఐడీ పక్కాగా నమోదు జరగాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి గంగాధరరావు, ఏఎస్‌వో సంజయ్‌కుమార్, డీడీఓ విజయలక్ష్మి, జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్, ఎంపీడీఓలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

కూలీలకు కలసి వస్తున్న స్త్రీశక్తి

- ఉపాధి మార్గంలో..ప్రయాణ ఖర్చులు ఆదా
- ఉచితంగా బస్సుల్లో నిత్యం కూలి పనులకు..

పర్చూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళా కూలీలకు.. స్త్రీ శక్తి పథకం వరంగా మారింది. స్థానికంగా పనులు లేక.. పర్చూరు నుంచి వ్యవసాయ పనుల నిమిత్తం మహిళలు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. అక్కడ రైతులు ఇచ్చే కూలి సైతం అంతంత మాత్రంగానే ఉన్నా.. గత్యంతరం లేక పొట్ట కూటికోసం కష్టపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాకపోకలకు స్త్రీశక్తి పథకం ద్వారా వారికి కొంత ఊరట లభిస్తోంది. ఉచిత బస్సు ప్రయాణంతో రోజుకు రూ.50/100 ప్రయాణ ఖర్చులు ఆదా అవుతున్నాయి. ఇది తమకు ఎంతో ఉపయోకరంగా ఉందని మహిళా కూలీలు చెబుతున్నారు. గతేడాది నల్లబర్లీ పొగాకు పంటకు సరైన గిట్టుబాటు ధర లేక, శీతల గిడ్డంగుల్లో శనగ, మిర్చి అమ్మకాలు జరగక.. ఈ ఏడాది ఖరీఫ్‌లో దాదాపు 70 శాతం సాగు చేయలేకపోయారు. రబీలో శనగ, మిర్చి, మొక్కజొన్న తదితర పంటలు వేసినా ప్రస్తుతం కూలీలతో చేయించుకునే పనులు లేవు. నల్లబర్లీ పొగాకు సాగును ప్రభుత్వం ఈ ఏడాది నిషేధించిన నేపథ్యంలో కూలీలకు పని దొరకని పరిస్థితి ఏర్పడింది. పర్చూరు నియోజకవర్గం వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావటంతో అధిక శాతం ప్రజలు కూలి పనులపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. ప్రస్తుత పరిస్థితుల్లో సుదూర ప్రాంతానికి వెళ్లి.. పనులు చేసేందుకు కూడా సిద్ధపడుతున్నారు. నిత్యం పర్చూరు, పరిసర ప్రాంతాల నుంచి వందలమంది కూలీలు పల్నాడు, గుంటూరు జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు వ్యవసాయ పనుల కోసం పరుగులు తీస్తున్నారు. గతంలో ఆటోలో వెళితే ప్రయాణ ఖర్చులు కూలీలే భరించాల్సి వచ్చేది. ప్రస్తుతం కూలీ రేటు తక్కువ కావడం, వ్యవసాయ పనులు అంతంత మాత్రంగా ఉండటంతో ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్సు సర్వీసు తమకు ఎంతో దోహద పడుతుందని కూలీలు చెబుతున్నారు. సుదూర ప్రాంతానికి ఉచితంగా బస్సుల్లో ప్రయాణం చేసి కూలి పనులు చేసుకోగలుగుతున్నామన్నారు.



పర్చూరు బొమ్మల సెంటర్‌లో బస్సు కోసం ఎదరు చూస్తున్న కూలీలు



విద్యార్థినులతో మాట్లాడుతున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ శైలజ

ఫిర్యాదులకు ఆన్‌లైన్ పోర్టల్

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ

బాపట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు నాలుగు అంకెల ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్‌తో పాటు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను త్వరలో అందుబాటులోకి తెస్తామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ తెలిపారు. బాపట్లలోని బాలికా సదన్, శిశుగృహ, సఖీ వన్ స్టాప్ సెంటర్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను శనివారం ఆమె సందర్శించారు. బాపట్ల సందర్శనకు వచ్చిన డాక్టర్ రాయపాటి శైలజను కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ క్రమంలో పోష్ చట్టంపై ఐసీసీ కమిటీలకు అవగాహన కల్పించాలని శైలజ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పని ప్రదేశాలలో మహిళలు ఎదుర్కొనే వేధింపులపై ఐసీసీ కమిటీలకు సరైన అవగాహన ఉండటంలేదన్నారు. త్వరలోనే పోష్ చట్టంపై అవగాహన సెమినార్‌లు నిర్వహించాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లకు మహిళా కమిషన్ తరుపున లేఖలు పంపుతామని శైలజ తెలిపారు. అనంతరం శిశు గృహ, బాలసదన్‌లో ఉన్న చిన్నారులతో ఆమె ముచ్చటించారు.



భూరి విరాళం ఇచ్చిన దాతను సన్మానిస్తున్న ఆలయ సభ్యులు

లక్ష్మీనారాయణ స్వామి ఆలయానికి కోటిన్నర భూరి విరాళం

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం జవహర్‌నగర్ కాలనీలో వెలిసిన శ్రీఆమలక లక్ష్మీనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి రూ.1.50 కోట్ల విరాళాన్ని అమెరికాకు చెందిన దుగ్గెంపూడి సత్యనారాయణ రెడ్డి, సుధారాణి దంపతులు అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో శనివారం వారిని సన్మానించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ దుగ్గెంపూడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆలయంలోని ఏసీ కల్యాణ మండపం, ఇతర నిర్మాణాలకు అమెరికాలో స్థిరపడిన తమ కుమారుడు దుగ్గెంపూడి సత్యనారాయణ రెడ్డి కోటి యాభై లక్షలు సమర్పించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు రఘునాథాచార్యులు, చరణ్‌లు దాతలకు శేషవస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు వరలక్ష్మి, వెంకట రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, వేణుగోపాల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి



వివరాలను వెల్లడిస్తున్న న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

అద్దంకి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌లను వినియోగించుకొని కక్షిదారులు కేసులు రాజీ చేసుకోవాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి అన్నారు. స్థానిక కోర్టు భవనాల సముదాయంలో 13న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో అద్దంకి కోర్టు పరిధిలోని అద్దంకి, బల్లికురవ, కొరిశపాడు, జే.పంగులూరు, మార్టూరు, సంతమాగులూరు మండలాల పరిధిలోని కక్షిదారులు అన్ని సివిల్ కేసులు, రాజీపడదగిన క్రిమినల్ కేసులు రాజీ చేసుకోవాలని కోరారు. లోక్‌అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవటం ద్వారా ఇరు పక్షాలకు డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు.

భూసార పరీక్షలకు అనుగుణంగా సాగుతో మేలు



అవగాహన కల్పిస్తున్న ఏవో వెంకట్రావు

అద్దంకి,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి):భూసార పరీక్షలు చేయించిన తరువాత అందుకు అనుగుణంగా పంటలు సాగు చేయడం ద్వారా ఎంతో మేలు కలుగుతుందని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మండలంలోని తిమ్మాయపాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. దీని ద్వారా ఎరువుల వినియోగం కూడా తగ్గుతుందన్నారు. తల్లిదండ్రులకు విద్యార్థులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పెంట్యాల గంగాధర్, ప్రాంతీయభూసార పరీక్షా కేంద్రం వ్యవసాయాధికారి అంజిరెడ్డి, పాలడుగు శేషారావు, మధుబాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో ప్రాంగణ ఎంపికలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రతినిధులు

చీరాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం ఒయాసిస్ ఆటోమేషన్ టెక్నాలజీ వారి ప్రాంగణ ఎంపికలు జరిగాయి. కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన ఎంపికల్లో ఈఈఈ బిటెక్ విభాగం నుండి 120 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా వారిలో 40 మందికి స్థానం దక్కింది. అలాగే ఈసీఈ విభాగం నుండి 90 మంది, ఈఈఈ విభాగం నుండి 28 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జగదీష్‌బాబు, ఎంపికల అధికారి ఎస్ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

పాలకుల్లేని.. పురాలకు మొండిచేయి

(5వ పేజీ తరువాయి)

మంగళగిరి, తాడేపల్లి మునిసిపాలిటీలను విలీనం చేసి.. గ్రేటర్ మంగళగిరిగా మార్పు చేసింది. ఈ ప్రక్రియలో జరిగిన జాప్యం కారణంగా ఈ రెండు మునిసిపాల్టీలకు ఎన్నికలు నిర్వహించ లేదు. నూతన పాలక వర్గాలు కొలువుదీరే వరకు అయా పురపాలక సంఘాలు ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యే పరిస్థితి లేదు. నరసరావుపేట పొరుగున ఉన్న చిలకలూరిపేట మునిసిపాలిటీకి తాజాగా రూ.4.73 కోట్లు నిధులు విడుదలయ్యాయి. ఇదే స్థాయిలో నరసరావుపేట మునిసిపాలిటీకి నిధులు సమకూరే వీలుండేది. ఈ నిధులు సమకూరి ఉంటే రహదారులు, కాలువలు ఇతర మౌలిక వసతుల నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉండేది.

నిలువు దోపిడీ

(5వ పేజీ తరువాయి)

తీసుకొస్తారు. పల్నాడు జిల్లాలో కూడా కొన్ని కేంద్రాలు మాత్రమే ఉన్నందున దూరం నుంచి తెచ్చి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంది. ఒక వేళ పత్తి వెనక్కి తీసుకు వెళ్లినా ప్రయివేట్ వ్యక్తులు క్వింటాల్ పత్తి రూ.5 వేల నుంచి రూ.6 వేలు వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. అందువల్ల రైతులు బయ్యర్లు చెప్పినట్లుగా వినాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

సీజన్ ఉండదేమో

ఇప్పటికే సీసీఐ పత్తి కొనుగోలు వ్యవహారంపై తీవ్ర వివాదాలు చుట్టుముట్టాయి. సీసీఐ నిబంధనలు ప్రకారం పత్తిని కొనాలని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మాజీ మేనేజర్ హైకోర్టులో కేసు వేశారు. సీసీఐ కంపెనీస్ లా ను ధిక్కరించి పత్తిని కొని.. జిన్నింగ్ చేస్తూ వేల కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేస్తోందని ఆయన కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. దేశ వ్యాప్తంగా సుమారు రూ.18 వేల కోట్లు ప్రజా సొమ్మును సీసీఐ దుర్వినియోగం చేసిందని పిటీషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి త్వరలో తీర్పు రానుంది. ఒక వేళ తీర్పు వ్యతిరేకంగా వస్తే ఈసారి సీజన్ ఉండక పోవచ్చు అన్న భావన సీసీఐలోని అన్ని స్థాయిల్లో వ్యక్తం అవుతోంది. సీఐడీ కూడా గతేడాది సీసీఐ వేదికగా జరిగిన రూ.140 కోట్ల దూది మాయం వ్యవహారం పై సీరియస్‌గా విచారణ జరుపుతోంది. రేపో, మాపో ఈ వ్యవహారం లో ఎఫ్‌ఐఆర్ నమోదు అయ్యే అవకాశం ఉంది. అందువల్ల ఈ సంవత్సరమే.. ఇల్లు చక్క పెట్టుకుందాం అనే ఆలోచనతో కొందరు బయ్యర్లు మితిమీరిన పద్ధతిలో కోత విధిస్తున్నట్లు స్పష్టం అవుతోంది.

పోలీసుశాఖలో హోంగార్డులు అంతర్భాగం

- ఎస్పీ హర్షవర్ధనరాజు
- హోంగార్డుల వ్యవస్థాపక దినోత్స ర్యాలీ



హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ హర్షవర్ధన రాజు

ఒంగోలు క్రైం,డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో హోంగార్డు అంతర్భాగమని ఎస్పీ హర్షవర్ధనరాజు అన్నారు. శనివారం స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కవాతు నిర్వహించారు. అనంతరం ఎస్పీ ప్రత్యేక వాహనంపై హోంగార్డులు గౌరవ వందనం స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డులు పోలీసు శాఖలో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. జిల్లాలో 696 మంది హోంగార్డులు ఉండగా వీరిలో 83 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. జిల్లాలో హోంగార్డుల సంక్షేమం కోసం కో ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసి లక్ష రూపాయలు రుణం ఇస్తున్నామని అన్నారు. పోలీసు స్టోర్‌లో సరుకులు తెచ్చుకునేందుకు అవకాశం కల్పించామని అన్నారు. ఇటీవల పోలీసు కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో 9 మంది కానిస్టేబుళ్ళుగా ఎంపికయ్యారని అన్నారు.

- విధి నిర్వహణలో మృతిచెందిన మారుతీ కుమార్ రెడ్డి భార్య తేజశ్వినికి హోంగార్డుల ఒక రోజు వేతనం రూ.4,78,540 చెక్కును ఎస్పీ చేతులమీదగా అందజేశారు. ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు జానకిరామయ్యకు రూ.4,80,670 చెక్కును అందజేశారు. హోంగార్డు స్పోర్ట్స్ మీట్‌లో విజేతలైయిన వారికి ఎస్పీ బహుమతులు అందించారు. అనతరం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు హోంగార్డులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్పీ డీఎస్పీ చిరంజీవి, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, మహిళ పోలీసుస్టేషన్ డీఎస్పీ రమణ ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు సుధాకర్‌రావు, నాగరాజు శ్రీకాంత్ బాబు, పాండురంగారావు పాల్గొన్నారు.

ప్రజలకు సురక్షిత నీటిని అందించడం అభినందనీయం

- ఎమ్మెల్యే దామచర్ల
- సర్వేరెడ్డిపాలెంలో కలెక్టర్‌తో కలిసి వాటర్‌ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు(రూరల్), డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): భగీరథ కెమికల్ ఫ్యాక్టరీ వారు ప్రజలకు సురక్షిత నీటిని అందించేందుకు వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఒంగోలు మండలం సర్వేరెడ్డిపాలెం గ్రామంలో భగీరథ కెమికట్ ఫ్యాక్టరీ వారిచే రూ.18లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను శనివారం ఎమ్మెల్యే దామచర్ల, కలెక్టర్ రాజాబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీ4లో భాగంలో సర్వేరెడ్డిపాలెం గ్రామంలోని ప్రజలకు మంచినీటిని సరాఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం భగీరథ కెమికల్ ఫ్యాక్టరీ వారు వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయడం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో తాగు నీటి సరఫరాకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. తాగేనీరు పరిశుభ్రంగా ఉంటే ప్రజల ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. సర్వేరెడ్డిపాలెం గ్రామాన్ని భగీరథ ఫ్యాక్టరీ దత్తత తీసుకోవడం, ఎస్‌ఆర్‌కే చారిటబుల్ ట్రస్టు వారితో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయటం శుభ పరిణామమన్నారు. కాగా డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ఎస్సీకాలనీలో గల ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే దామచర్ల, కలెక్టర్ రాజాబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, మేయర్ గంగాడ సుజాత, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ నాయబ్‌రసూల్, ఎంపీడీవో కె.రాజశేఖరరావు, భగీరథ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ లింగమనేని వెకంటరామయ్య, ఏఎంసీ చైర్మన్ ఆర్.వెంకటరావు, టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ, నాయకులు మక్కెన శ్రీనివాసరావు, ఫ్యాక్టరీ ప్రతినిధి చెన్నారెడ్డి వాసు తదితరులు పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ

సర్వేరెడ్డిపాలెంలోని పశు పశుకులకు 50 శాతం సబ్సిడీపై దాణాను ఎమ్మెల్యే దామచర్ల, కలెక్టర్ పి.రాజాబాబు పంపిణీ చేశారు. 80మంది పశుపోషకులకు నాలుగు మెట్రిక్ టన్నుల దాణాను అందజేశారు. కార్యక్రమంలో త్రోవగుంట ఏడీఏ డాక్టర్ ఎ.బసవశంకరరావు, పశువైద్యాధికారి వై.భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన వీణానాదం



వీణానాదం కార్యక్రమంలో ఒంగోలు కళాకారుణులు

ఒంగోలు కల్చరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన పలువురు సంగీత కళాకారుణులు తమ వీణానాదంతో ప్రేక్షకులను విశేషంగా అలరించారు. శనివారం శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలోని దర్మపథం వేదికపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంగీత గురువు తూములూరు నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఒంగోలుకు చెందిన కె.నాగలక్ష్మి, ఎం.మానసి, ఎన్.గీతాప్రవల్లిక, వి.చాందినిదేవసేన తదితరులు వీణపై పలు శాస్త్రీయ గీతాలను తాళ, లయభరితంగా పలికించి దేవస్థాన అధికారుల ప్రశంసలందుకున్నారు. టీవీ, రేడియో కళాకారిణి జగన్మోహిని మృదంగ సహకారం అందజేశారు. అనంతరం వారిని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి, ఇతర అధికారులు ఘనంగా సత్కరించి, స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

గుండ్లాపల్లిలో ఫాగింగ్

మద్దిపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లిలో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ బాలకోటయ్య దోమల నిర్మూలన కోసం మురుగు కాలువల్లో ఎబెట్ మందు పిచికారి చేయించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సురేష్‌కుమార్, ఏఎన్ఎం సుధారాణి, ఎంఎల్‌హెచ్ పి. కీర్తిలక్ష్మి, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నటి సావిత్రి జయంతి

ఒంగోలు కల్చరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మహానటి సావిత్రి జయంతిని శనివారం ఆల్ ఇండియా కళారంగం, పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి, ప్రకాశం జిల్లా కళాకారులు సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో స్వరాంజలి అధ్యక్షురాలు డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ అధ్యక్షతన నటి సావిత్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ, ఎస్‌కే.బాబు, పాండురంగారావు, టి.శ్రీదేవి, టి.గోవిందమ్మ, మధురశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: మద్దిపాడులో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సినీనటి సావిత్రి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మండవ రంగారావు, జజ్జర శరత్‌బాబు, దేవరశెట్టి ఎలమంద, నేలటూరి సత్యనారాయణ, గంట కోటేశ్వరరావు, గంగిశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం బయలుదేరిన యోగా శిక్షకులు

ఒంగోలు(రూరల్), డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం అంజయ్యరోడ్డులో గల ఆరామక్షేత్రంలో 41రోజుల పాటు యోగా శిక్షణ పూర్తి చేసుకున్న వారు శనివారం శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. ఈ బస్సులను నగర కమిషనర్ వెంకటేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. యోగాతో పాటు ఆహారపు అలవాట్లులో మార్పులు చేసుకోవడం వల్ల ఆరోగ్యవంతంగా ఉండవచ్చని చెప్పారు. కార్యక్రమంలో బెజవాడ వెంకట్రావు, మాస్టర్ బత్తినేని సుబ్బారావు, 80 మంది యోగా శిక్షణ పొందిన వారు పాల్గొన్నారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు.

వ్యక్తిపై మరో వ్యక్తి చాకుతో దాడి

- పిల్లుల విషయమై గొడవ
- గొట్టిపాటి నగర్‌లో ఘటన

మార్టూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మార్టూరు గ్రామ పంచాయతీలోని గొట్టిపాటి నగర్‌లో షేక్ బాజి అనే వ్యక్తిపై అదే పేరుగల షేక్ బాజి అనే మరో వ్యక్తి చాకుతో దాడి చేసిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకొంది . ఈ ఘటనలో గాయపడిన బాజి తోపాటు, ఆయన తల్లి సైదాబికి గాయాలయ్యాయి. పోలీసులు కథనం ప్రకారం గొట్టిపాటి నగర్ లో నివాసం ఉంటున్న ఇద్దరు షేక్ బాజిలు ప్రక్క ప్రక్కనే నివసిస్తున్నారు. అయితే వారిలో నిందితుడు బాజి రెండురోజుల క్రితం తన పిల్లుల ను పెంచుకోవడానికి బాదితుడు బాజికి ఇచ్చారు. ఈ పిల్లులకు డబ్బులు ఇవ్వాలని ఉదయం కొణిదెన సెంటరులో ఇద్దరు బాజిల మధ్య వాదన జరిగింది. ఈ ఘటనపై కక్షను పెంచుకున్న నిందితుడు బాజి రాత్రి సమయం లో బాదితుడు బాజి ఇంటి వద్దకు వచ్చి ఆయన్ను ఇంటి నుంచి బయటకు పిలిపించి, చాకుతో పొట్టలో పొడిచి గాయపరచాడు. అంతేగాకుండా బాధితుడు తల్లి సైదాబి అడ్డురాగా ఆ మె కు కూడా చేతికి గాయాలయ్యాయి. అనంతరం బాదితుడు బాజి స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా, పోలీసులు అతనిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ అతనికి వైద్యులు ప్రాథమిక చికిత్స చేసిన తర్వాత మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా సైదాబీ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ భాషా తెలిపారు.

శాఖాహార జంతువుల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం



గంజివారిపల్లి పారెస్టు పరిధిలో లెక్కింపు చేపడుతున్న అధికారులు, సిబ్బంది

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలోని గంజివారిపల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలో శాఖాహార జంతువుల లెక్కింపు ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభైనట్లు ఫారెస్టు రేంజర్ ఏ ప్రసన్న జ్యోతి తెలిపారు. శని, ఆది, సోమవారాలో ఈ లెక్కింపు ప్రక్రియ ఉంటుందని తెలిపారు. చుక్కల దుప్పులు, కణుతులు, కొండ గొర్రెలు, మనుబోతులు అటవీ ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ మూడు రోజులు సిబ్బంది అదే పనిలో ఉంటారని తెలిపారు. టి.ఆర్ చెరువు ఎఫ్‌ఆర్‌వో షేక్ ఖాజామొహిద్దీన్, బేస్ క్యాంప్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు.

కమనీయం చెన్నకేశవుని శాంతి కల్యాణం

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం స్వామికి శాంతి కల్యాణం కమనీయంగా కన్నులపండువగా నిర్వహించారు. ప్రధానార్చకులు అప్పనాచార్యుల ఆధ్వర్యంలో నంద్యాల రంగాచార్యులు, సాయి కుమారాచార్యులు చెన్నకేశవ స్వామి భాగ్యలక్ష్మీ అమ్మవార్ల మూలవిరాట్‌లకు సుప్రభాత సేవ, అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ మధ్యరంగ మండపంలో నిత్యపూజలందుకునే శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఉత్సవరులను శోభాయమానంగా అలంకరించారు. అనంతరం వైభవంగా కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈవో గొలమాని శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

పలు కుటుంబాలకు మంత్రి పరామర్శ



బాధిత కుంబాలను పరామర్శిస్తున్న మంత్రి రవికుమార్

అద్దంకి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు గ్రామాలలో ఇటీవల పలు కారణాలతో మృతిచెందిన వ్యక్తుల కుటుంబసభ్యులను శనివారం విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. అద్దంకి మండలం ధర్మవరంలో సొసైటీ కార్యదర్శి చాగంటి చినఅంకారావు గుండెపోటుతో మృతిచెందగా కుటుంబసభ్యులను మంత్రి రవికుమార్ పరామర్శించారు. బల్లికురవ మండలం కొప్పెరపాలెంలో టీడీపీ నేత గొర్రెపాటి ఆదాం అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా కుటుంబసభ్యులను పరామర్శించారు. అంబడిపూడిలో జొన్నలగడ్డ సౌజన్య వైరల్ ఫీవర్‌తో మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంతమాగులూరు మండలం కొప్పరం లో గుండెపోటుతో మృతి చెందిన గుంజి హనుమంతరావు కుటుంబ సభ్యుల ను, బల్లికురవ మండలం వేమవరంలో వయోభారంతో మృతి చెందిన ముద్దన సాంబమ్మ కుటుంబ సభ్యులను మంత్రి రవికుమార్ పరామర్శించారు. ఆయా గ్రామాల టీడీపీ నేతలు పాల్గొన్నారు.



స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న ఉభయదాతలు భక్తులు

అంగరంగ వైభవంగా రాములోరి కల్యాణం

పొదిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విశ్వనాథపురం జూనియర్ కాలేజి రోడ్డులో కొలువై ఉన్న శ్రీకోదండ రామస్వామి ద్వితీయ వార్షిక వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. దేవాలయం నిర్మించి రెండు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సహస్రనామార్చన, హోమం, అమ్మవారికి కుంకుమపూజలు చేశారు అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలు కల్యాణ పీఠంపై కూర్చొని శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్చరణల మధ్య కల్యాణ తంతు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఐఏఎస్‌లపై అనుచిత వ్యాఖ్యలు తగదు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కించపరుస్తూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని ద్రావిడదేశం కృష్ణారావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఐఏఎస్, ఐపీఎస్‌లను అవమానకరంగా సంబోధించడం బీసీ సామాజిక వర్గాన్ని బాధించిందన్నారు. బీసీ కుటుంబంలో జన్మించి ఐఏఎస్ అధి కారిగా ఉత్తీర్ణులై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక రంగాల్లో సేవలు అందించిన పి.కృష్ణయ్య బీసీ వర్గాలకు గర్వకారణమన్నారు. వారి సర్వీసులో చిన్న మచ్చ కూ డా లేని అధికారిగా తన సేవలను అందించారని, అటువంటి వ్యక్తిని జగన్మోహ న్‌రెడ్డి కించపరిచే విధంగా మాట్లాడటం తగదన్నారు. మరో ఐసీఎస్ అధికారి గోపీనాథ్ జెట్టిని కూడా అదే రీతిలో అవమానించే మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వారిపై చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకొని దిద్దుబాటు చర్యలు చేపట్టాలని, లే నిపక్షంలో తగిన మూల్యం చెల్లించక తప్పదని ఆయన హెచ్చరించారు.

గోకులం షెడ్లు 15 లోపు పూర్తి చేయాలి

పొన్నలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత అధ్యక్షతన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అమలు జరుగుతున్న పనుల మీద సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం సుజాత మాట్లాడుతూ గోకులం షెడ్లు ఈ నెల 15వ తేదీ లోపు పూర్తి కావాలని వారికి సూచించారు. సోమవారం నుంచి ప్రతి గ్రా మంలో పనులు మొదలుపెట్టాలని తెలిపారు.

ఇరిగేషన్ భూముల ఆక్రమణ పరిశీలన



భూములను పరిశీలిస్తున్న అధికారులు

సంతనూతలపాడు, డి సెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేర్నమిట్టలో ప్రభుత్వానికి సంబంధించిన ఇరిగేషన్ భూముల ఆక్రమ ణలను ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు శనివారం పరిశీ లించి హద్దులు నిర్ణయించారు. పేర్నమిట్టలో సర్వేనెంబ రు 25/2లో ఇరిగేషన్ భూముల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు తహ సీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, సర్వేయరు రాజేష్ ఆధ్వర్యంలో కొలతలు నిర్వహిం చారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వస్థలాల వివరాలను త్వరలో ఉన్నతాధికారు లకు వివరించిన అనంతరం స్వాధీనం చేసుకుంటామని అధికారులు తెలిపారు. కాగా ఇటీవల పేర్నమిట్టలో 4.62 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించి క ట్టిన నిర్మాణాలకు సైతం ఏమేరకు ఆక్రమణలు ఉన్నాయో గుర్తించి స్వాధీనం చేసుకునేందుకు సమాయత్తం అవుతున్నట్లు తెలిసింది.

స్టడీ మెటీరియల్ అందజేత

సంతనూతలపాడు, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని సంతనూతలపాడులోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో శనివారం ఏకేఎన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియ ల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనంతయ్య, ఎంపీడీవో సురే ష్‌బాబు, ఎంఈవో వెంకారెడ్డి, ట్రస్టు అధినేత అట్లూరి రామారావు, ఎంపీపీ బి. విజయ, సర్పంచ్ డి.నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ చాటిన హోంగార్డ్



శ్యాంబాబును అభినందిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

నాగులుప్పలపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ఎ స్పీ కార్యాలయంలో హోంగార్డులకు శనివారం నిర్వహించిన క్రీడా పోటీల్లో భాగంగా లాంగ్‌జంప్, వాలీబాల్ పోటీల్లో ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన హోంగార్డ్ కొల కలూరి శ్యాంబాబు ప్రతిభ చూపా రు. ఆయా పోటీల్లో శ్యాంబాబు ప్ర థమ బహుమతి సాధించడంతో ఎస్పీ హర్షవర్ధనరాజు అభినందించారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

మద్దిపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మా నసిక ఉల్లాసానికి దోహదప డతాయని ప్రిన్సిపాల్ చంద్ర శేఖర్ పేర్కొన్నారు. శనివా రం మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రభు త్వ జూనియర్ కళాశాలలో మేరా యువభారత్ హెల్పిం గ్ పీపుల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల ప ట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు మాల్యాద్రి మాట్లాడుతూ క్రీడలు స్నేహభావాన్ని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో కళా శాల పీడీ ఆదినారాయణ, పీఈటీ కె.వనజ, సౌజన్య, శ్రీనివాసరావు, ఉపాధి ఏ ఈ కిషోర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విశాఖలో సీఐటీయూ మహాసభలు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి 4వతేదీ వరకు జరగనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కోరారు. ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో మహాసభలకు సంబంధించి పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సభలో భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని, జిల్లాలోని కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరా రు. కార్యక్రమంలో నా యకులు టి.మహేష్, కె.శ్రీనివాసరావు, టి.విజయమ్మ, వై.రవి, సంతోషమ్మ, శ్రీల క్ష్మి, అనిత, సింహాద్రి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

రూ. 36.51 లక్షలు పలికిన చేపల వేలం

బల్లికురవ, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వైదన పంచాయతీ పరిధిలోని రెండు చెరువులలో ఏడాదిన్నర కాలంలో చేపల పెంపకానికి శనివారం నిర్వహించిన బహిరంగ వేలం పాట రూ.36,51,500 పలికింది. వైదన గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ వేలం నిర్వహించారు. ఎంపీడీవో కుసుమకుమారి, డిప్యూటీ ఎంపీడీవో సుమతి, పంచాయతీ కార్యదర్శి ప్రసాదరావులు పర్యవేక్షించారు. వెన్న రవీంద్రరెడ్డి చెరువులలో చేపలు వేసి పెంచుకునేందుకు 2027 జూన్ నెల వరకు వేలం దక్కించుకున్నారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చిన్నారులకు నోటు పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న రాంబాబు

ఈపూరుపాలెం(చీరాల), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఈపూరుపాలెంస్ట్రయిట్ కట్ కట్టపై నివసిస్తున్న యానాది కాలనీ చిన్నారులకు వైసీపీ మేధావుల విభాగం నియోజకవర్గ అధ్యక్షులు తేళ్ల రాంబాబు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు రాంబాబు విద్యావేత్త అంబేద్కర్ కృషిని వివరించారు.

విద్యార్థుల ఫిర్యాదుపై విచారణ



మధ్యాహ్నభోజన పథకంపై విచారిస్తున్న ఎంఈవో

పంగులూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంపై వచ్చిన ఫిర్యాదులపై ఎంఈవో జి.వీరాంజనేయులు శనివారం విచారించారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల ప్రత్యేక సమావేశంలో మధ్యాహ్న భోజనం నాసిరకంగా ఉంటోందని పలువురు విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన డిప్యూటీ డీఈవో గంగాధర్ విచారించాలని ఎంఈవో వీరాంజనేయులును ఆదేశించారు. శనివారం ఎంఈవో వీరాంజనేయులు పంగులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులను, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావును విచారించారు. కుకింగ్ ఏజన్సీ వారు కూరలు ఇంటివద్ద తయారుచేసుకుని వస్తున్నారని, నాసిరకంగా ఉంటున్నాయని, తినలేని విద్యార్థులు ప్రశ్నిస్తే దురుసుగా మాట్లాడుతున్నారని పాఠశాల విద్యార్థులు, హెచ్ఎం శ్రీనివాసరావు ఎంఈవోకు వివరించారు. విచారణ అంశాలపై ఉన్నతాధికారులకు నివేదిక అందచేసినట్లు ఎంఈవో వీరాంజనేయులు తెలిపారు.

ప్రతి పేదకుటుంబానికి వైద్యసాయం

- ఎమ్మెల్యే కొండయ్య
- 87 మందికి రూ.73,72,186 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చీరాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి వైద్యసాయం అందించేందుకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే కొండయ్య తెలిపారు. శనివారం నియోజకవర్గం క్యాంపు కార్యాలయంలో 87 మందికి రూ.73,72,186 విలువైన సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు 677 మందికి రూ.6.58 కోట్లు పంపిణీ చేసినట్లు వివరించారు. పేద ప్రజలకు ప్రభుత్వం నుండి అందాల్సిన సాయానికి సంబంధించి ఎప్పుడూ కూడా భేధాభిప్రాయం లేకుండా సేవలు అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పథకాల పంపిణీలో అలుపెరుగని రీతిలో పనిచేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి రూ.20 వేల విరాళం

మార్టూరు, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్రోణాదుల గ్రామంలోని పీఎస్ ప్రాథమిక పాఠశాలలో స్కూలు అభివృద్ధికి గ్రామానికి చెందిన బండి పవన్ రూ.20 వేల విలువైన చెక్కును డొక్కాసీతమ్మ చిత్ర పటాన్ని అందించినట్లు ప్రధానోపాధ్యాయులు పీ.వీరాంజనేయులు శనివారం తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న పార్శిల్ లారీ

- తప్పిన ప్రమాదం



ఆర్టీసీ బస్సును ఢీ కొన్న డీసీఎం

మార్టూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సును పార్శిల్ లారీ ఢీకొట్టిన ఘటన జాతీయ రహదారిపై స్థానిక పోలీసు స్టేషన్ ఎదురుగా శనివారం చోటుచేసుకొంది. ఈ సమయంలో బస్సులో 30 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. అయితే ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బస్సు డ్రైవరు కథనం ప్రకారం గుంటూరు డిపో కు చెందిన ఆర్టీసీ బస్సు ఒంగోలు వెళుతున్నది. ఈ బస్సు మార్టూరు సెంటరును దాటి, పోలీస్ స్టేషన్ ఎదురుగా వచ్చే సరికి బస్సు స్టీరింగ్ స్ట్రక్ అయ్యింది. దీంతో రోడ్డుపై రెండవ లైన్ లో వెళుతున్న బస్సు రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ ను ఢీ కొట్టేవిధంగా దూసుకుపోయింది. కొన్ని క్షణాల్లో బస్సు డివైడర్‌ను ఢీ కొడుతుందని డ్రైవర్ భావించాడు. అయితే అదే సమయంలో వెనుక నుంచి విజయవాడ నుంచి ఒంగోలుకు వెళుతున్న పార్శిల్ లారీ బస్సును ఢీ కొట్టింది. దీంతో డివైడర్ ను బస్సు ఢీ కొనకుండా సడన్ గా బస్సు ఆగింది. ఈ ప్రమాదలో లారీ ముందు అద్దాలు పగిలిపోయాయి. లారీ లోని డ్రైవరుకు ఎలాంటి గాయాలు కాలేదు, బస్సులోని ప్రయాణికులు అందరూ క్షేమంగా బయటపడ్డారు. అనంతరం హైవే మొబైల్ సిబ్బంది వచ్చి రోడ్డుపై ఆగి ఉన్న రెండు వాహనాలను ప్రక్కకు తరలించారు. ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా వాహనాలు వెళ్లిపోయాయి.

విద్యార్థులకు పోత్సాహక నగదు బహూకరణ



నగదును అందజేస్తున్న ప్రసన్న దంపతులు

పర్చూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు బాలికల పాఠశాలలో గత ఏడాది పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన షేక్.సమీరా, పి.ప్రసన్నలకు రోటరీ సభ్యులు కోటా శ్రీనివాసరావు, ప్రసన్న దంపతులు ఒక్కొరికి రూ.5000 చొప్పున పోత్సాహక నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ మాట్లాడుతూ బాలికలు విద్యావంతులు అయితే కుటుంబ వ్యవస్థ మరింత అభివృద్ధి చెందుతునందన్నారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థినులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగభైరు శ్రీనివాసరావు, పాబోలు వెంకన్న, కాసా అశోక్ కుమార్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

- చీరాలలో నివాళి అర్పించిన ఎమ్మెల్యే కొండయ్య
- అద్దంకిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల వేదిక ఆధ్వర్యంలో చీరల పంపిణీ



అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల కొనసాగింపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని శాసన సభ్యులు కొండయ్య అన్నారు. శనివారం నియోజకవర్గంలో వాడవాడలా అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే పట్టణంలోని ముక్కోణం పార్క్ కూడలిలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహనీయుడు రచించిన రాజ్యాంగం ద్వారానే బడుగు, బలహీన వర్గాలు నేడు అన్ని రకాల హక్కులను పొందగలుగుతున్నట్లు వివరించారు. అయితే వాటి ఆచరణలో యువత నిర్లక్ష్యం చేయరాద న్నారు. దేశ భవిష్యత్తు రాజ్యాంగ ఆధారితంగానే సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సాంబ శివరావు, ఏఎంసీ ఛైర్మన్ జనార్ధనరావు, పట్టణ అధ్యక్షులు సురేష్, నాగేంద్రమణి, పలువురు కౌన్సిలర్లు, నేతలు పాల్గొన్నారు.

విజయనగర్ కాలనీలో..

మండల పరిధిలోని విజయనగర్ కాలనీలో సంఘ సంస్కర్త, ప్రపంచ మేధావి బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దుడ్డు భాస్కరరావు, వెంకటస్వామి, భగత్‌సింగ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అమృతపాణి ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఆయనతో పాటు ఎస్.బాబురావు, లింగంపల్లి జయరాజ్, చుండూరు వాసు, దామర్ల శ్రీకృష్ణ, గోసాల ఆశీర్వాదం, మాచర్ల మోహనరావు, చిరంజీవి, వసంతరావు పాల్గొన్నారు.

పర్చూరు/కారంచేడు/ఇంకొల్లు, : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతిని ఆయా మండలాల్లో శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. పర్చూరు బొమ్మల కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. పర్చూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, కారంచేడులో తహసీల్దార్ నాగరాజుల ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. అలాగే దగ్గుబాడు లోని అంబేద్కర్ విగ్రహానికి దళిత సంఘ నాయకుల పూలమాల వేసి నివాళి అర్పించారు. అదేవిధంగా ఇంకొల్లు తోపాటు, ఆయా గ్రామాల్లో అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.

సంతరావూరులో అంబేద్కర్ వర్ధంతి

చినగంజాం : మండలంలోని సంతరావూరు గ్రామంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతిని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో గ్రామంలోని అంబేద్కర్ సెంటర్‌లోని బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అల్పాహర విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంతరావూరు యూనియన్ బ్యాంకుఆఫ్ ఇండియా మేనేజర్ అశ్విన్ విమల్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ వై.అశోక్, అంబేద్కర్ యూత్ సభ్యులు దేవతోటి నాగరాజు, డి.రాజేష్, సమర్, ఉదయ్, వంశీ, నవీన్, వెంకట్ పాల్గొన్నారు.

అద్దంకి: అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ ఉబ్బా దేవపాలన అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం అద్దంకి పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర వ్యవసాయ మిషన్ డైరెక్టర్ నాగినేని రామకృష్ణ, స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు మానం మురళీమోహన్‌దాస్, నాగరాజు, మన్నం త్రిమూర్తులు, కాకాని అశోక్, గోగులమూడి రాజశేఖర్, కోంద్రు వీరాంజనేయులు,వలపర్ల సుబ్బారావు,పూనూరి నరేంద్ర,దేవరాజు,సామ్యూల్, బొజంకు నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో 35 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక అధ్యక్షుడు జ్యోతి రమేష్, డాక్టర్ ఉబ్బాదేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, తాళ్లూరు బాబూరావు, డాక్టర్ బ్రహ్మయ్య, చెన్నుపాటి రామాంజనేయులు, బుజ్జిబాబు, సందిరెడ్డి శ్రీనివాసరావు, పీసీహెచ్ కోటయ్య, చెన్నుపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఎంఆర్‌పీఎస్, మాలమహానాడు ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.







దగ్గుబాడులో అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నేతలు, అద్దంకిలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు, చీరలు పంపిణీ చేస్తున్న నేతలు

భార్యపై భర్త చాకుతో దాడి



చికిత్స పొందుతున్న బాధితురాలు

వేటపాలెం(చీరాల), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భార్యభర్తల మధ్య విభేధాలు చెలరేగడంతో కూరగాయల చాకుతో భార్య శరీరంపై దాడి చేసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం వేటపాలెం మండలం చేనేతపురి కాలనీకి చెందిన చింతగింజల దివ్య, రామకృష్ణ సుమారు 13 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి ఇరువురు సంతానం. ప్రస్తుతం ఇద్దరూ కూడా వేటపాలెంలోని ఓ టైలరింగ్ దుకాణంలో టైలర్స్‌గా పని చేస్తున్నారు. అయితే భర్త కొంత కాలంగా బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. ఈ కారణంగా ఇద్దరి మధ్య విభేధాలు చోటుచేసుకున్నాయి. ఈక్రమంలోనే శనివారం ఇంట్లో వంట పనిచేసుకుంటున్న భార్య వద్దకు వెళ్లిన భర్త అదే చాకుతో ముందు పొట్టలో పొడిచాడు. ఈక్రమంలో సుమారు అంగుళం రక్త గాయమైంది. అలాగే మరోసారి పొడిచే ందుకు ప్రయత్నించగా ఆమె చేతులు అడ్డుగా పెట్టు కుంది. దీంతో ఎడమ చేతిపై కూడా గాయం కావడంతో ఆమె బిగ్గరగా కేకలు వేసింది. దీంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. ఈలోగా భర్త పరారీ అయ్యాడు. బాధితు రాలు ప్రస్తుతం చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతుండగా, అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

విజయవాడకు ఆల్ట్రా డీలక్స్ సేవలు

ఒంగోలు నుంచి ఇంకొల్లు మీదగా 5 సర్వీసులు



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న అధికారులు

ఇంకొల్లు, డిసెంబరు 6,(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నుంచి ఇంకొల్లు మీదగా విజయవాడకు ఆర్టీసీ ఆల్ట్రాడీలక్స్ 5 బస్సు సర్వీసులను శనివారం నుండి ప్రారంభించారు. ఇటీవల మార్స్ ట్రస్టు ఛైర్మన్ మన్నె శ్రీనివాసరావు, ఇంకొల్లు మండల ప్రయాణీకుల సంఘం అధ్యక్షులు మోహనకృష్ణ మంత్రి నారాలోకేష్‌కు లిఖితపూర్వకంగా విన్నవించారు. ఈ మేరకు లోకేష్ ఆదేశాల మేరకు ఆర్టీసీ ఎండీ ద్వారాక తిరుమలరావు సూచనల మేరకు ఒంగోలు డిపో నుండి 5 ఆల్ట్రా బస్సులను కేటాయించి శనివారం ఆ శాఖ ప్రాంతీయ మేనేజరు సత్యనారాయణ ప్రారంభించారు. విజయవాడ పోవడానికి ఇంకొల్లులో ఉదయం గం.7.15, గం.8.15, గం.9.15. గం 10.15, 12 గంటలకు సర్వీసులు బయలుదేరతాయన్నారు.

ఈ ప్రాంతాల వారికి ఉపయోగం నాగులుప్పల పాడు, దుద్దుకూరు, ఇంకొల్లు, పర్చూరు, పెద్దనందిపాడు, పత్తిపాడు, గుంటూరు, మంగళగిరి స్టాపులుండగా, ఈ సర్వీసులతో సంతనూతలపాడు నియోజక వర్గంలోని మద్దిరాలపాడు, చదలవాడ, నాగులుప్పల పాడు, అద్దంకి, నియోజక వర్గంలోని పమిడిపాడు, కండ్లగుంట, రెడ్డిపాలెం, రాచపూడి, పర్చూరు నియోజకవర్గంలోని దుద్దుకూరు, కొణికి, ఇంకొల్లు, దగ్గుబాడు, పూసపాడు, వంకాయలపాడు, నూతలపాడు, పర్చూరుని అడుసుమల్లి, పత్తిపాడు నియోజకవర్గంలోని పెద్దనందిపాడు, వరగాని, అబ్బిన గుంటపాలెంతోపాటు, పరిసర గ్రామాల ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుంది. ఒంగోలు నుంచి 2.30 గంటల్లో విజయవాడకు చేరుకొనే వీలుండడం గమనార్హం.

పాఠశాల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ ఎంతో ఉపయోగకరం



మంత్రికి పుష్పాలు అందజేస్తున్న విద్యార్థినులు

అద్దంకి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): హైస్కూల్, కళాశాలల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ళు పంపిణీ చేయడం ద్వారా ఎంతో ఉపయోగంగా ఉందని పలువురు విద్యార్థినులు శనివారం విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బల్లికురవ మండలం అంబడిపూడిలో శనివారం కార్యక్రమాలకు హాజరైన మంత్రి రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు హైస్కూల్ విద్యార్థినిలు మం త్రి రవికుమార్ కారు వద్దకు వచ్చి తమ పాఠశాల ఆవరణలోని పుష్పాలు అందజేసి 'థాంక్యూ మినిస్టర్ సార్' అంటూ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లి దండ్రులకు, విద్యా బుద్దులు నేర్పిన ఉపాధ్యాయులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలన్నారు.

ప్రతి సభ్యురాలికి, గ్రూపు గ్రామ సంఘాలకు విజన్ ఉండాలి



శిక్షణకు హాజరైన గ్రూపు సభ్యులతో అధికారులు

చినగంజాం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా గ్రూపులో ఉన్న ప్రతి మహిళకు, గ్రూపు గ్రామ సంఘాలకు ఒక విజన్ ఉండాలన్నదే శిక్షణ యొక్క ముఖ్య ఉద్దేశమని శిక్షకులు, ఏపీఎంలు రమేష్, త్యాగరాజులు అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో వెలుగు డీఆర్డీఏ ఆధ్వర్యంలో చినగంజాం, మార్టూరు, పర్చూరు, కొల్లూరు, చెరుకుపల్లి, అద్దంకి, అమృతలూరుల మండలాలకు చెందిన గ్రామ సంఘాల అధ్యక్షురాళ్లకు ఏపీఎంలు, ఇద్దరు సీసీలు, అకౌంటెంట్‌లకు విజన్ బిల్డింగ్‌పై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నాలుగు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ముగించినట్లు ఏపీఎం గద్దె పెద్దసుబ్బారావు తెలిపారు. ప్రతి వ్యక్తికి ఒక విజన్ ఉంటేనే అభివృద్ధి చెందుతారని ఏపీఎంలు అన్నారు. కార్యక్రమంలో డీపీఎంలు రవీంద్ర, రవి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కె.శారద, సీసీలు వెంకటస్వామి, శ్రీలక్ష్మి, మాధవి, ఆయా మండాలకు చెందిన ఏపీఎంలు, సీసీలు, అకౌంటెంట్‌లు, గ్రామ సంఘాల అధ్యక్షురాలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

ప్రధానోపాధ్యాయుడు నాగిరెడ్డి



సుభాష్‌బాబును సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

పర్చూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధికి ప్రభుత్వంతో పాటు, దాతల అందిస్తున్న సహకారం అభినందనీయమని పర్చూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మోదుగుల నాగిరెడ్డి అన్నారు. ప్రైవేటు పాటశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకున్న తరుణంలో విద్యార్థులకు అవసరమైన మెరుగైన వసతుల కల్పనలో దాతలు చూపుతున్న చొరవ హర్షించతగ్గ విషయం అన్నారు. సోమవారం పర్చూరు మండలం నాగులపాలెం గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యులు కొల్లా సుభాష్ బాబు పాఠశాలకు అవసరమైన సామగ్రికి రూ.50వేల విరాళాన్ని అందజేసి దాతృత్వం చాటుకున్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దాతల కృషిని సిబ్బంది కొనియాడారు. అనంతరం దుశ్శాలువా పూలమాలలతో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మోడల్ స్కూల్ హెచ్ఎం నాగమణి, పోలిశెట్టి హనుమంతురావు, బొప్పూడి ప్రసాద్ బాబు, సుబ్బారావు, జయభారత్‌రెడ్డి, శివశాస్త్రీ, సృజన తదితరులు పాల్గొన్నారు.

పోలీసుశాఖలో అన్ని విభాగాల్లో హోంగార్డ్స్



ప్రశంసపత్రాన్ని అందుకుంటున్న హోంగార్డు పున్నయ్య

మేదరమెట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పోలీసుశాఖలోని అన్ని విభాగాల్లో హోంగార్డులు పనిచేస్తున్నారని ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. శనివారం ఒంగోలులో 63వ హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1963 డిసెంబరు 6వ తేదీన హోంగార్డ్స్ వ్యవస్థ ప్రారంభమైందన్నారు. ప్రకాశం జిల్లాలో హోంగార్డ్సుకు కో-ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేశారన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన డ్రిల్, డ్యూటీలలో చీరాల సబ్‌డివిజన్ పరిధిలోని హోంగార్డు పున్నయ్యకు బెస్ట్ క్యాడెట్‌గా ప్రశంసపత్రాన్ని ఎస్పీ ప్రధానం చేశారు. ప్రశంసాపత్రం అందుకున్న పున్నయ్యను అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, మేదరమెట్ల ఎస్సై షేక్ మహమ్మద్ రఫీ, సిబ్బంది అభినందించారు.

బోదవాడలో నేత్రదానం

ఇంకొల్లు, డిసెంబరు 6,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో నేత్రదానం నిర్వహించారు. బూదవాడ గ్రామానికి చెందిన ఈమని వెంకటేశ్వరరెడ్డి(65) మృతి చెందగా కుటుంబసభ్యులు భార్య నాగేశ్వరమ్మ, కుమార్తెలు పావని, శోభారాణి, సుమతి సహకారంతో గుంటూరు శంకరకంటి ఆసుపత్రి వైద్యులు నేత్రాలను సేకరించారు. అవయవదాన కమిటీ సభ్యులు జెట్టి.స్వామి, సోమేపల్లి రామ్మోహనరావు, రోటరీక్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బలగం కోటేశ్వరరావు, అలవల రాఘవరెడ్డి, క్లబ్ సభ్యులు అభినందించారు.

కోడిపందేల నిర్వాహకుల అరెస్టు

చినగంజాం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదగంజాం గ్రామశివారులో శనివారం సాయంత్రం కోడి పందేలు వేస్తున్న వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్ఐ శీలం రమేష్ తెలిపారు. పెదగంజాం గ్రామ శివారు పొలాల్లో కోడిపందేలు వేస్తున్నారన్న సమాచారం మేరకు తన సిబ్బందితో వెళ్లి దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను, ఒక కోడిపుంజును అదుపులోనికి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,320ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

మార్టూరు,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి):మండలంలోని ద్రోణాదుల గ్రామంలోని పీఎస్ ప్రాథమిక పాఠశాలలో స్కూలు అభివృద్ధికి గ్రామానికి చెందిన బండి పవన్ రూ.20 వేల విలువైన చెక్కును, డొక్కాసీతమ్మ చిత్రపటాన్ని అందించినట్లు ప్రధానోపాధ్యాయులు పి వీరాంజనేయులు శనివారం తెలిపారు.

నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం

- ఏవో భాస్కర్‌రావు

పర్చూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తుఫాను ప్రభావంతో పంటలు నీటమునిగి నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటుందని పర్చూరు ఏవో కే.భాస్కర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి క్షేత్రస్థాయిలో వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో వివరాలు సేకరించి నమోదు ప్రక్రియను చేపట్టారు. నష్టపోయిన పంటల జాబితాను తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఏవో వివరించారు. పర్చూరు మండలంలో 2115.23 హెక్టార్లలో వరి పైరును సాగుచేయగా అందులో 870.16 వరద ముంపునకు గురైందన్నారు. పత్తి 32.7 హెక్టార్లలో సాగుచేయగా అందులో 28.09 వరద ముంపునకు గురైందన్నారు. అలాగే 6.7హెక్టార్లలో జూటును సాగుచేయగా అందులో 3.02 హెక్టార్లలో పంట దెబ్బతిందన్నారు. సాగుచేసిన ప్రతి పంట వివరాలు సేకరించి నమోదు చేయటం జరిగిందన్నారు.

ప్రయాణికుడికి సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న డీఎం రామ్మోహనరావు

అద్దంకి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను అధికారులు భద్రపరిచి శనివారం అందజేశారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన కే.గోపి శుక్రవారం అద్దంకి డిపో బస్సులో ఒంగోలు ప్రయాణిస్తూ సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. కండక్టర్ ఉమామహేశ్వరి సెల్‌ఫోన్‌ను గుర్తించి డిపోలో అధికారులకు అప్పగించారు. గోపి శనివారం డిపో వద్దకు రావడంతో డీఎం బెల్లం రామ్మోహనరావు సెల్‌ఫోన్ అందజేశారు.

డిజిటల్ లావాదేవీలపై రైతులకు అవగాహన

అద్దంకి,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): బ్యాంకులలో డిజిటల్ లావాదేవీలపై రైతులు అవగాహన పెంచుకోవాలని నాగులపాడు సొసైటీ అధ్యక్షుడు ఏనుగంటి వెంకటరామయ్య(బాబు) అన్నారు. మండలంలోని బొమ్మనంపాడులో శనివారం రాత్రి ప్రకాశం జిల్లా కేం ద్ర సహకారబ్యాంక్ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో కళాజాత బృందం ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ చెల్లింపుల పై బుర్ర కథ రూపంలో అవగాహన కల్పించారు. రైతులు ఆర్థిక అక్షరాస్యులుగా మారాలని, ప్రణాళిక బద్ధంగా పొదుపు ఖాతాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో బ్రాంచ్‌మేనేజర్ సుబ్బయ్య,సూపర్‌వైజర్ శరత్, సొసైటీ సిఈఓ దామా శివ ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


కాలువలను పునరుద్ధరించుకుంటున్న రైతులు




ముప్పవరం గ్రామంలో వేసిన శనగ పంట

వరికి సై..

- మాగాణి సాగుకు అన్నదాతల సమాయత్తం
- 20 ఏళ్ల తరువాత రైతులు సిద్ధం
- ముమ్మరంగా కలువల పునరుద్ధరణ పనులు

మద్దిపూడి, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : మద్దిపూడి పెద్దచెరువు 20 ఏళ్ల తరువాత పూర్తిస్థాయిలో జలకళను సంతరించుకుంది. రెండు దశాబ్దాలుగా చెరువు కింద 450 ఎకరాల ఆయకట్టులో వరిసాగు చేయకపోవడంతో సిరులు పండాల్సిన మాగాణి భూములు చిల్లచెట్లు పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు చెరువు పూర్తిస్థాయిలో నిండింది. దీంతో ఆయకట్టు రైతులు వరిసాగు చేసేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. సాగుకు నోచుకోపోవడంతో కాలువుల, తూములు శిథిలావస్థకు చేరాయి. దీనికితోడు 20 ఏళ్లుగా చెరువు తూములను మరమ్మతులు చేయకపోవడంతో చెరువులో చేరిన నీరు వృథాగా వాగుపాలు అవుతోంది. దీంతో ఆగమేఘాల మీద తూములను మట్టితో పూడ్చి తాత్కాలికంగా నీరు నిలుపుదల చేశారు. అయితే చెరువులో నీరు ఉండటంతో వరిసాగు చేపట్టాలని రైతులు నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో శిథిలమైన కాలువలను పునరుద్ధరించేందుకు రైతులు స్వచ్ఛందంగా వచ్చి పనులు చేపట్టారు. ఇప్పటికే వరినార్లు పోసుకొని నాట్లకు సమాయత్తం అవుతున్నారు. మండలంలోకెల్లా అతిపెద్ద చెరువైన మద్దిపూడి చెరువు కింద వరిసాగు జరిగితే రెండు, మూడు సంవత్సరాలపాటు గ్రామస్తులకు ఆహారధాన్యాల కొరత తీరుతుంది. వేలాది పశువులకు పశుగ్రాసం లభిస్తుంది. మట్టితో పూడ్చిన తూములను వెంటను పుణరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు. ఆ మేరకు ఇరిగేషన్ అధికారులు నాలుగు రోజుల్లో తూములను పునరుద్ధరించి ఆయకట్టుకు నీరు అందిస్తామని ఏఈ నవీన్ తెలిపారు. రెండు దశాబ్దాల తరువాత వరిసాగు జరుగుతుండటంతో గ్రామస్తుల్లో ఆనందోత్సహాలు వెల్లువెత్తున్నారు.

శనగకు నై..

- తగ్గిన శనగ విస్తీర్ణం
- నామమాత్రంగానే సాగు
- వేలాది ఎకరాల నుంచి వందలకు పరిమితం
- ధరలేక రైతులు విముఖత

కొండపి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): కొండపి నియోజకవర్గంలో శనగ సాగు తగ్గిపోయింది. గతంలో వేలాది ఎకరాల్లో సాగయ్యే పంట ప్రస్తుతం వందల ఎకరాలకు పరిమితమైంది. ధర లేకపోవడమే ఇందుకు కారణమని రైతులు చెబుతున్నారు.

కొండపి, జరుగుమల్లి, టంగుటూరు రింగ్‌రోడ్డులోని దాదాపు 50కిపైగా గ్రామాల్లో శనగ సాగు పదేళ్లక్రితం భారీగా ఉండేది. ఒక్కొక్క మండలంలో దాదాపు 7500 ఎకరాల నుంచి 10 వేల ఎకరాల వరకు శనగసాగును రైతులు చేసేవారు. ఇపుడు ఒక్కొక్క మండలంలో వెయ్యి ఎకరాలు కూడా పట్టుమని రైతులు ఈఏడాది సాగు చేయలేదు. గడచిన ఏడాది మినహా వరుసగా నాలుగేళ్ల పొగాకు పంట సాగుతో రైతులకు ఎంతోకొంత ఆదాయం వచ్చింది. దీంతో క్రమంగా శనగ విస్తీర్ణం తగ్గించి పొగాకు సాగుకు రైతులు మొగ్గారు. క్రమంగా పొగాకు సాగు పెంచుకుంటూ వెళ్లారు. అయితే 2014-25 సీజన్‌లో పొగాకు ధరలు పతనమయ్యాయి. దీంతో రైతులు పొగాకు సాగును తగ్గించుకోవాలనుకున్నారు. అయితే నిరుడు, కిత్రం ఏడాది పండించిన శనగలు కోల్డ్‌స్టోరేజీల్లో వేల క్వింటాళ్లు మగ్గుతున్నాయి. శనగలు క్వింటాల్ ఐదు వేల రూపాయలు కూడా లేకపోవడంతో రైతులు ఈ ఏడాది శనగ పంట సాగుకు ఉత్సాహం చూపలేదు. పొగాకు పంటకు ధరలు లేకపోయినా సరే శనగ సాగుకు ఉపక్రమించలేదు. దీనికి కారణం శనగల ధరలు లేకపోవడమేనని రైతులు అంటున్నారు. ఐదేళ్ల క్రితం జరగుమల్లి మండలంలో శనగ 7000 ఎకరాలు ఉండగా, క్రమంగా సాగు విస్తీర్ణం తగ్గుతూ వచ్చింది. ఈ ఏడాది ఇప్పటి వరకు వెయ్యి ఎకరాల్లో మాత్రమే శనగ సాగు చేశారు. కొండపి మండలంలో కూడా ప్రస్తుతం దాదాపు 1200 ఎకరాలు మాత్రమే శనగ సాగు చేశారు. టంగుటూరు మండలంలో కూడా శనగ సాగు తగ్గిపోయింది. ఈ ఏడాది అధిక వర్షాలు కూడా శనగ సాగు తగ్గిపోవడానికి కారణమని రైతులు అంటున్నారు. అధిక వర్షాలను తట్టుకుని శనగ దిగుబడి రాదని భావించి రైతులు తిరిగి పొగాకు సాగువైపు మొగ్గు చూపారని రైతులు అంటున్నారు. కాగా ఈ ఏడాది జామాయిల్ సాగు ఈ మూడు మండలాల్లో కొద్దికొద్దిగా పెరిగిందని, వచ్చే ఏడాదికి సామాజిక వనాలైన సుబాబుల్, జామాయిల్, చౌక చెట్ల సాగు పెరుగుతుందని రైతులు అంటున్నారు.

రైతులకు హాని కలిగించే బిల్లులను ఉపసంహరించుకోవాలి

- 8నుంచి మూడు రోజుల పాటు నిరసనలు
- సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు హాని కలిగించే ముసాయిదా విత్తన, విద్యుత్ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆ బిల్లులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి మూడు రోజుల పాటు గ్రామాల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విత్తన, విద్యుత్ బిల్లుల ముసాయిదాను ప్రకటించి ఈనెల 11లోపు తమ అభిప్రాయాలు తెలపాలని కోరిందన్నారు. అమెరికాతో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌కు సిద్ధమవుతున్న సమయంలో కేంద్రం ఈ బిల్లును ప్రకటించడం రైతులను మోసం చేసే కుట్ర దాగి ఉందని ఆరోపించారు. అమెరికా, ఐరోపా విత్తన కార్పొరేట్ సంస్థల జన్యుమార్పిడి విత్తనాలను ఎలాంటి అంక్షలు లేకుండా ఉచితంగా దిగుమతి చేసుకునే వెసులుబాటు కలిగిస్తూ మన దేశ రైతులను తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేస్తుందన్నారు. అందువల్ల ఈ కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డే హనుమారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాల పరిధిలో ఉన్న వ్యవసాయ రంగాన్ని కేంద్రప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకుని ఫెడరల్ విధానానికి విఘాతం కలిగిస్తుందన్నారు. అందుకు సీఎం చంద్రబాబునాయుడు వంతపలకడం సిగ్గుచేటన్నారు. ఆచార్యరంగ కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ బ్రాండెడ్ కంపెనీ విత్తనాలను వాడాలని నిబంధన ప్రమాదకరమైందన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ విత్తనాలు భద్రపరిచి వాడుకునే సంప్రదాయ ప్రక్రియ ఉందన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలు 80శాతం అనుమతి లేని విత్తనాలను గతంలో పెనాల్టీ వేసే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత బిల్లు ప్రకారం మొదటి రెండు తప్పులకు పెనాల్టీ లేదని, తప్పులు నిర్ణయించడానికి ఒక ఆఫీసర్‌ను నియమించిందని పేర్కొన్నారు. ఆఫీసర్లను మేనేజ్ చేయడం కార్పొరేట్ కంపెనీలకు వెన్నతో పెట్టిన విద్య అని అందువల్లఈ విధానాలను ఉపసంహరించుకోవాలన్నారు.

రేపు క్విస్‌లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

- పర్చువల్‌గా పాల్గొననున్న ప్రధానమంత్రి మోదీ


మాట్లాడుతున్న నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్, అఖిల భారత సాంకేతిక విద్యామండలి జాతీయ స్థాయిలో ఈనెల 8, 9 తేదీల్లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-25 నిర్వహించనుంది. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ సాఫ్ట్‌వేర్ ఎడిషన్ ఫైనల్ పోటీలకు ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఆతిథ్యం ఇవ్వనుందని విద్యా సంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శనివారం కళాశాలలో అవిష్కరించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌కు క్విస్ కళాశాల మూడోసారి ఆతిథ్యం ఇస్తోందని తెలిపారు. గతంలో హార్డ్‌వేర్ ఎడిషన్, సాఫ్ట్‌వేర్ ఎడిషన్ నిర్వహించామని, ఈ ఏడాది సాఫ్ట్‌వేర్ ఎడిషన్‌కు అతిథ్యం ఇస్తున్నట్లు తెలిపారు. క్విస్ కళాశాలకు మూడోసారి అవకాశం ఇచ్చినందుకు ఏఐసీటీఈ, విద్యామంత్రిత్వశాఖ ఇన్నోవేషన్ సెల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీలో కేవలం మూడు కాలేజీలను మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందని, అందులో తమ కళాశాల ఒకటి అని చెప్పారు. వివిధ రాష్ట్రాల నుంచి 20 టీములు ఈ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో పాల్గొని నాలుగు ప్రాబ్లమ్ స్టేట్‌మెంట్లకు పరిష్కారాలను గుర్తిస్తారన్నారు. క్విస్‌తోపాటు దేశంలోని పలు రాష్ట్రాల్లోని 60 విద్యాలయాలు, ఐఐటీల్లో జరిగే ఈ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో ప్రధానమంత్రి మోదీ ఈనెల 8వ తేదీన పర్చువల్‌గా విద్యార్థులతో మాట్లాడతారన్నారు. వికసిత భారత్, ఆత్మ నిర్భర భారత్, మేక్ ఇన్ ఇండియా లక్ష్యంగా ఇన్నోవేషన్ తదితర అంశాలపై ప్రధాని మాట్లాడతారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు, ఎస్ఐహెచ్-25 క్విస్ నోడల్ సెంటర్ కన్వీనర్ డాక్టర్ డి. బుజ్జిబాబు, కో కన్వీనర్ డాక్టర్‌భార్గవ్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు ఉన్నారు.

8160 మంది పోటీదారులు

స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కోసం దేశ వ్యాప్తంగా 1,42,715 టీమ్‌లు తమ ఐడియాలతో ముందుకు రాగా వారిలో 1360 టీమ్‌లను ఫైనల్స్‌కు ఎంపిక చేశారు. మొత్తం 60 నోడల్ సెంటర్లలో సుమారు 8160 మంది పోటీ పడనున్నట్లు ఏఐసీటీఈ ప్రకటించింది. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ లక్ష్యంగా వివిధ రాష్ట్రాల విద్యార్థులను వేర్వేరు రాష్ట్రాల్లో నోడల్ సెంటర్లకు పంపేలా చర్యలు తీసుకుంటున్నారు. ఒక జట్టుగా ప్రాబ్లమ్ స్టేమ్‌మెంట్లపై పరిష్కారం చూపనున్నారు.

ఐసీడీఎస్‌లో వన్ ఉమెన్ ఆర్మీ

- కొండపి ప్రాజెక్ట్‌లో ఒక్కరే సూపర్‌వైజర్
- అంగన్‌వాడీ కార్యకర్తలతోనే లెక్కలు

కొండపి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): కొండపి ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ, నిఘా కొరవడింది. ప్రాజెక్ట్ పరిధిలో మూడు మండలాలు ఉన్నాయి. అన్నిటికీ కలిపి ఒక్కరే సూపర్‌వైజర్ పనిచేస్తున్నారు. దీంతో రికార్డులు నమోదు, పరిశీలన, కేంద్రాల పరిశీలనలు అంతంతమాత్రంగా సాగుతున్నాయి. కొండపిలోని సెక్టార్-1లో ఉన్న ఒక్క సూపర్‌వైజరే కొండపి-2, మద్దిపూడి, పొన్నలూరు మండలం అన్నిటి బాధ్యతలు చూస్తున్నారు. కొండపి మండలానికి మరొకరు, మద్దిపూడి మండలానికి ఇద్దరు, పొన్నలూరు మండలానికి ఇద్దరు సూపర్‌వైజర్‌లు ఉండాలి. ఒక్కరితోనే గడచిన ఏడాదిగా కార్యక్రమాలను నడిపిస్తున్నారు. ప్రాజెక్ట్ సీడీపీవో, సూపర్‌వైజర్ మాత్రమే ప్రాజెక్ట్ కార్యక్రమాలను నడిపిస్తున్నారు. దీంతో కేంద్రాల పర్యవేక్షణ నామమాత్రంగా మారింది. గడచిన ప్రభుత్వంలో సూపర్‌వైజర్ పోస్టులకు పరీక్షలు నిర్వహించారు. అయితే ప్రమోషన్ల విషయంలో కోర్టుకు అర్హులు వెళ్లడంతో సూపర్‌వైజర్‌ల నియామయ ప్రక్రియ నిలిచిపోయిందని అంగన్‌వాడీ కార్యకర్తలు అంటున్నారు. ఈప్రభుత్వం వచ్చాక ప్రత్నామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో కొండపితోపాటు పలు ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ల్లో సూపర్‌వైజర్లు కొరతగా ఉందని తెలిసింది. ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించి ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ల్లో సూపర్ వైజర్‌లను నియమించాలని కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	143, 152, 163
చికెన్ విత్ స్కిన్(కిలో)	274.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	284.00


అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న బీఎన్

చీమకుర్తి మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే విజయ్‌కుమార్
- పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

చీమకుర్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలను శనివారం సాయంత్రం నిర్వహించారు. దాదాపు కోటి రూపాయలకు పైగా నిధులతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ప్రారంభించారు. తదుపరి మరో కోటి రూపాయలకు పైగా నిధులతో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చీమకుర్తి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ మన్నం రాజేశ్వరి, మన్నం ప్రసాద్, కమిషనర్ రామకృష్ణయ్య, కౌన్సిలర్లు గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజలి, సొసైటీ చైర్మన్ పూనాటి వెంకట్రావు, పట్టణ అధ్యక్షుడు ముప్పూరి చలమయ్య, నాయకులు కాట్రగడ్డ రమణయ్య, యడ్లపల్లి రామబ్రహ్మం, కందిమళ్ల గంగాధరరావు, రావిపాటి రాంబాబు, సూరంపల్లి హనుమంతరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, గంగుల శివపార్వతి, తోపూరి సుజాత, కట్టా రమణయ్య, పాపిరెడ్డి, రఫీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కన్నులపండువగా కనకదుర్గమ్మ నగరోత్సవం

చీమకుర్తి పట్టణంలో సాక్షిరామలింగేశ్వరస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ భవానీ అమ్మవారి నగరోత్సవం కార్యక్రమాన్ని శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 516 కలశాలు చేబూని పట్టణంలో ఊరేగింపుగా మహిళలు తరలివచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సోమరాజుపల్లి వెంకటేశ్వరశర్మ, రాఘవేంద్రశర్మ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- చీమకుర్తి, ఆంధ్రజ్యోతి



సొమ్ము ఒకరిది సోకు మరొకరిది అన్నట్లుగా గృహ నిర్మాణ శాఖలో పేదల సొమ్ముతో అక్రమార్కులు విలాసాలు చేస్తున్నారు. అసలు ఇళ్లే నిర్మించకుండా కొంత.. నాసిరకంగా నిర్మించి మరికొంత ప్రభుత్వ సొమ్మును దోచుకొని ఇళ్లు, ప్లాట్లు, కార్లు కొనుక్కొని జల్సాలు చేస్తున్నారు. తిలాపాపం తలా పిడికెడు అన్నట్లుగా గత ప్రభుత్వంలో హౌసింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు ప్రజాధనాన్ని ఇష్టమొచ్చినట్లు దారిమళ్లించారు. ఈ భారీ కుంభకోణాలు ఇప్పుడు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఒక్క వెంకటేశ్వరపురం, కొండ్లపూడి లేఅవుట్లలో



రూ.కోట్ల ప్రజల సొత్తును కాంట్రాక్టర్లకు దోచిపెట్టడమే కాకుండా స్టీలు, సిమెంటు, ఇసుకను కూడా మాయం చేసిన హౌసింగ్ అధికారులపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించడం, ఒకేసారి 13 మంది అధికారులపై ఛార్జస్ ఫ్రేమ్ చేయడం సంచలనంగా మారింది.

- గృహ నిర్మాణ శాఖలో వెలుగులోకి వస్తున్న అక్రమాలు
- పేదల డబ్బును దోచుకున్న అధికారులు, కాంట్రాక్టర్లు
- ఆ సొమ్ముతో విలాసంగా ఇళ్లు, కార్లు, ప్లాట్ల కొనుగోలు
- వారి ఆస్తులపై దృష్టి పెడితే ఇంకెంతో!



ప్రజల సొమ్ము.. వారి సోకు!

నెల్లూరు రూరల్ మండలం కొండ్లపూడిలో పునాదుల దశ దాటని ఇంటి నిర్మాణం

నెల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పేదల ఇళ్ల పేరుతో జరిగిన దోపిడీ.. తద్వారా సంపాదించిన సొమ్ముతో కొందరు అధికారులు, కాంట్రాక్టర్లు జల్సాలతోపాటు వ్యాపారాలు కూడా మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ పీడీ స్థాయి అధికారి కోవూరు మండలం ఇనుమడుగు వద్ద మూడంతుస్తుల భారీ భవంతిని నిర్మించారని, అలానే పలు చోట్ల ప్లాట్లు కొనుగోలు చేశారని హౌసింగ్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. అలానే ఏ డీఈ స్థాయి అధికారి హరనాథపురంలో భారీ ఇంటిని నిర్మించడమే కాకుండా వివిధ ప్రాంతాల్లో ప్లాట్లపై పెట్టుబడులు పెట్టినట్లు గుసగుసలాడుకుంటున్నారు. ఇటువంటి వారు అనేక మంది ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అలానే ఓ బడా


ఈ ఇల్లు ఇంతేనా!?

కాంట్రాక్టర్, అతడికి అన్నీ తానై నడిపిస్తున్న మరో వ్యక్తి కలిసి వందల ఎకరాల పొలాలను కొనుగోలు చేసిన ట్లు తెలుస్తోంది. అవసరాల కు మించి కార్లను కొనుగోలు చేయడమే కాక నెల్లూరులో భారీ సంఖ్యలో కేఫ్‌లు పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. హౌసింగ్ శాఖలో పనిచేసిన ఓ రాష్ట్రస్థాయి అధికారికి సదరు కాంట్రాక్టర్ సుమారు రూ.3 కోట్లతో విల్లా నిర్మించి ఇచ్చినట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటువంటి అధికారులు, కాంట్రాక్టర్లపై అవినీతి నిరోధక శాఖ దృష్టి పెడితే ఇంకా అనేక బాగోతాలు వెలుగులోకి వస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

● ఇష్టానుసారం దోపిడీ

గత ప్రభుత్వంలో లబ్ధిదారుడి అనుమతి లేకుండానే హౌసింగ్ అధికారులు ఇష్టానుసారం ఇళ్లను ఆప్షన్-3 పేరుతో వందల మంది కాంట్రాక్టర్లకు అప్పగించారు. సాధారణంగా ఆరు అంకణాల స్థలంలో బేస్ స్థాయి నిర్మాణానికి రూ.30 వేలకు మించి ఖర్చు కాదు. అయితే ఈ బీఎల్ స్థాయి నిర్మాణం జరిగితే తొలుత రూ.50 వేలు ఇచ్చే విధానం తీసుకొచ్చారు. ఆ తర్వాత దానిని రూ.70 వేలకు పెంచారు. ఈ క్రమంలో కాంట్రాక్టర్లు వేల ఇళ్లను బీఎల్ స్థాయి వరకూ నిర్మించి రూ.70 వేల లెక్కన బిల్లులు కొట్టేశారు. అయితే ఆ బేస్‌లను కూడా అత్యంత నాసిరకంగా నిర్మించినట్లు క్వాలిటీ కంట్రోల్ పరీక్షల్లో తేలుతోంది. బేస్ స్థాయికే ఇంత పెద్ద మొత్తం చెల్లించేలా నాడు హౌసింగ్ శాఖ నిర్ణయం తీసుకోవడం వెనుక కాంట్రాక్టర్లు ఉన్నారన్న ఆరోపణలున్నాయి. జిల్లాలో 97,445 ఇళ్లను మంజూరు చేయగా ఇంకా రిజిస్టర్ చేసుకోవాల్సినవి 18,755 వరకూ ఉన్నాయి. మరో 7546 ఇళ్ల నిర్మాణం అసలు ప్రారంభం కాలేదు. ఇక 25 వేల వరకూ ఇళ్లు బేస్ లెవల్ లోపే ఉన్నాయి. ఇందులో 15 వేలకుపైగా ఇళ్లకు రూ.50 వేల నుంచి 70 వేల చొప్పున చెల్లించగా, మరో ఆరు వేల ఇళ్లకు రూ.30 వేల వరకూ పేమెంట్ చేసినట్లు తెలుస్తోంది. కొన్ని ఇళ్లు బేస్, లింటెల్ స్థాయిలోనే ఉన్నప్పటికీ అవి రూఫ్ స్థాయిలో ఉన్నట్లో లేక పూర్తయినట్లో చూపించి ఎక్సెస్ పేమెంట్లు చేసి ఉన్నట్లు బయటపడుతోంది. ఒక్క నెల్లూరు జిల్లాలో పేదల ఇళ్ల పేరుతో ఇప్పటి వరకూ సుమారు రూ.886 కోట్ల వరకు మెటీరియల్, బిల్లులు చెల్లించారు. అందులో ఒక కాంట్రాక్టర్‌కే రూ.200 కోట్లు వరకూ అందినట్లు సమాచారం. అయితే ఈ కాంట్రాక్టర్లు ఇప్పుడు ఇళ్లు పూర్తి చేసేందుకు ముందుకు రావడం లేదు. పేదల సొమ్ములతో ఇతర వ్యాపారాలు చేసుకుంటూ దర్జాగా తిరుగుతున్నారు. మిగిలిన నిర్మాణాలను పూర్తి చేయాలంటూ వీరికి నోటీసులు ఇస్తున్నా అసలు లెక్కపెట్టడం లేదు. పేదలు మాత్రం ఆ మొండి గోడలు చూస్తూ మథనపడుతున్నారు.

సాదాబైనామా సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సాదాబైనామా భూముల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సాదా బైనామా భూముల విషయమై తహసీల్దార్లతో చర్చించారు. ఈ భూముల విషయంలో వీలైనంత వరకు హక్కుదారులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. జిల్లాలో రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, సంక్రాంతి పండుగ తరువాత ఆ సమస్యలను కూడా శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

'సోమశిల'లో 73.999 టీఎంసీల నీరు

అనంతసాగరం డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి శనివారం 22,676 క్యూసెక్కుల వరద కొనసాగింది. డ్యాంలో 73.999 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 50, దక్షిణ కాలువకు 200, డెల్టాకు 19,950, కండలేరుకు 2,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● సంగం : దిత్వా తుఫాన్ ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వాగులు, వంకల్లో నుంచి వరద ప్రవాహం సంగం బ్యారేజీకి వచ్చి చేరుతోంది.


సంగం బ్యారేజీకి వస్తున్న వరద నీటి ప్రవాహం

బీరాపేరు, బొగ్గేరుతోపాటు ఇతర ఉప నదుల నుంచి సుమారు 17 వేలు, సోమశిల నుంచి 20 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో బ్యారేజ్ వద్ద నీటిమట్టం 9.7 అడుగులు నమోదయింది. ఈ నీటిలో బీపీఆర్ (కావలి) కాలువకు 400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మిగతా నీటిని బ్యారేజి వద్ద 40 గేట్లు ఎత్తి దిగువ నెల్లూరు బ్యారేజికి విడుదల చేస్తున్నట్లు ఏఈ వినయ్ తెలిపారు.

● రాపూరు : కండలేరు డ్యాంలో 60.28 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 1750 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 1490 క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.





ట్రంకు రోడ్డు సొగసు చూడ తరమా!

ట్రంకు రోడ్డు. నెల్లూరు నగరంలో ప్రధాన రహదారి ఇది. ఇటీవలే ఈ రోడ్డును బాగు చేశారు. అయితేనేం... పనుల్లో నాణ్యత కొరవడిందో ఏమోగానీ 'దిత్వా' తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు రోడ్డుపై తారు లేచిపోయింది. అంతేగాక ఎక్కడపడితే కేవీఆర్ పెట్రోలు బంకు నుంచి అయ్యప్పగుడి వరకు ఎక్కడపడితే అక్కడ భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై పడిన గుంతలను పూడ్చాలని నగరవాసులు కోరుతున్నారు.

\- స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి నెల్లూరు

తిరుపతిలో కలపొద్దు.. ప్లీజ్!



8

● కలువాయిలో కొనసాగుతున్న ఆందోళనలు

నెల్లూరు జిల్లాలో ఉన్న కలువాయి మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపొద్దని కోరుతూ శనివారం కూడా ఆ ప్రాంత వాసులు ఆందోళన చేపట్టారు. ఉదయం ఏడీపీఎస్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి, నిరసన వ్యక్తం చేశారు. అలాగే, సాయంత్రం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు, యువత కలసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పరమటివీధి నుంచి కొవొత్తులను పట్టుకుని ర్యాలీగా బస్టాండుకు చేరుకున్నారు. తిరుపతి వద్దు... నెల్లూరు ముద్దు, సేవ్ కలువాయి అంటూ నినాదాలు చేశారు.

కలువాయిలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు, రాజకీయ నాయకులు తదితరులు

నేడు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

● జిల్లాలో 3,685 మంది విద్యార్థులు

నెల్లూరు(విద్య), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) నిర్వహణకు విద్యా శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగే ఈ పరీక్షకు జిల్లాలో 18 కేంద్రాలను ఏర్పాటు చేయగా, 3,685 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించిన హాల్‌టికెట్లను www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో, స్కూల్ లాగిన్‌లో, మనమిత్ర వాట్సాప్‌లో అందుబాటులో ఉంచారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాల యూడైస్ కోడ్‌ను ఉపయోగించి విద్యార్థుల హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసి అందచేసినట్లు డీఈఓ బాలాజీరావు తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్‌ను తప్పనిసరిగా తీసుకుని కేంద్రానికి ఉదయం 9 గంటలలోపు చేరుకోవాలని పేర్కొన్నారు. ఓఎంఆర్ పత్రం బబ్లింగ్‌ను నీలం లేదా నలుపు పెన్‌తో మాత్రమే చేయాలని, సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదని తెలిపారు.

గాడితప్పుతున్న పోలీస్

- ప్రశాంత జిల్లాలో వరుస ఘటనలు
- రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌తో చర్యలకు ఆదేశం
- వరుసగా సస్పెన్షన్లు, వీఆర్‌కు పోలీసులు
- రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా డీఎస్పీపై వేటు
- పలువురు అధికారులకూ చార్జ్‌మెమోలు
- ఇంకా జాబితా సిద్ధం చేస్తున్న ఎస్పీ



పోలీస్ వ్యవస్థ గాడి తప్పుతోంది. బాధితులకు న్యాయం సంగతి అటుంచితే అక్రమ సంపాదనే ధ్యేయంగా కొంతమంది అధికారులు వ్యవహరిస్తున్నారు. దీనికితోడు జిల్లాలో నేరాలు పెరిగిపోవడంతో ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ఈమేరకు ఉన్నతాధికారులు జల్లెడపట్టి మరీ అమ్యామ్యాలకు అలవాటుపడిన పోలీస్ అదికారులపై చర్యలకు ఉపక్రమించారు.

- 6లో..

మాలకొండ ఆదాయం రూ. 7,45,661

వలేటివారిపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామికి శనివారం భక్తుల నుంచి 7,45,661 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ. 6,750, కుంకుమార్చన ద్వారా రూ. 18,160, వివాహముల ద్వారా రూ. 1000, తలనీలాలు ద్వారా రూ. 25,250, వాహనపూజలు ద్వారా రూ. 3,120, ప్రత్యేక దర్శనం ద్వారా రూ.1,85,900, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ.520, రూములఅద్దెలు ద్వారా రూ. 19,360, కవర్లు ద్వారా రూ. 7,900, లడ్డుప్రసాదం ద్వారా రూ. 1,67,225, అన్నదానం ద్వారా రూ, 3,10,476, విరాళముల ద్వారా రూ. 5,116 ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ చంద్రశేఖర్ తెలియజేశారు

అవసరాల మేరకే యూరియా

పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు : కలెక్టర్

- వివరాలు 8లో..

విద్యార్థులకు పదోతరగతి తొలిమెట్టు. ఇందులో 'మార్క్' చూపాలని ప్రతి విద్యార్థి ఆశిస్తుంటాడు. ఆ మేరకు విద్యార్థిని తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టి సారించింది. కార్యాచరణ సిద్ధం చేసి, మారిన సిలబస్‌ను దృష్టిలో ఉంచుకుని అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సబ్జెక్ట్ టీచర్ల కొరత ఉన్న పాఠశాలల్లో సర్దుబాటుతో తాత్కాలిక ఏర్పాట్లు చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడు తున్నారు. పరీక్షల షెడ్యూల్ కూడా విడుదల కావడం తో శనివారం నుంచి మార్చి 15వ తేదీ వరకు వందరోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు.



పదిలో వందకు ప్రణాళిక!

- ఉత్తమ ఫలితాల సాధనకు విద్యా శాఖ కసరత్తు
- విద్యార్థులు ఏ, బి, సీ, డీ గ్రేడులుగా విభజన
- వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు(విద్య), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :తమ భవిష్యత్తుకు కీలకమైన పదోతరగతి పరీక్షలను ఓ సమరంలా భావించి విద్యార్థులు సన్నద్ధమవుతుండగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా ప్రాధాన్యమిస్తూ వారిని సంసిద్ధులను చేస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం మార్చి 16వ తేదీ నుంచి ప్రధాన పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మూడు నెలల వ్యవధిలో విద్యార్థులు పక్కా ప్రణాళికతో పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు వందరోజుల ప్రణాళికలను అనుసరిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది 30వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతుండగా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యా శాఖ కృషి చేస్తోంది. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ రోజుకో సబ్జెక్ట్‌లో పునఃశ్చరణ పరీక్షలు రాయిస్తున్నారు. వాటిని ఎప్పటికప్పుడు సరిదిద్ది విద్యార్థుల లోపాలను మెరుగుపరుస్తున్నారు. వెనుకబడిన పిల్లలకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు. శనివారం నుంచి ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 9గంటల వరకు పునఃశ్చరణ తరగతులు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు అసైన్‌మెంట్లతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఎస్‌ఏ 1, 2 పరీక్షల్లో వచ్చిన మార్కులను పరిశీలించి ఏ సబ్జెక్ట్‌లో వెనుకబడి ఉన్నారో గుర్తిస్తున్నారు. ఈ పాఠ్యాంశాల్లో వారికి స్టడీ అవర్‌లో ప్రత్యేక శిక్షణకు ఏర్పాట్లు చేశారు. దీనికి సంబంధించిన సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు ఇప్పటికే టైంటేబల్ కేటాయించారు. విద్యార్థులను ఏ, బీ, సీ, డీ గ్రేడ్‌లుగా విభజించి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఇందులో ఏ, బీ గ్రూపులోని విద్యార్థులకు రోజువారీ తరగతులు కొనసాగిస్తున్నారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థులకు స్టడీ అవర్స్‌తోపాటు వెనుకబడి ఉన్న సబ్జెక్టులలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. విద్యా శాఖ అధికారులు ఈ స్టడీ అవర్స్‌ను పర్యవేక్షించనున్నారు. విద్యార్థుల పఠనాశక్తి, ప్రోగ్రెస్‌లపై నివేదికలు సిద్ధం చేయనున్నారు. ఇక స్టడీ అవర్స్‌లో విద్యార్థులకు ప్రత్యేకంగా అల్పాహారం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు.

రెండు రకాలుగా ప్రణాళికలు



జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోని టెన్త్ విద్యార్థులకు శనివారం నుంచి వందరోజుల ప్రణా ళికను అమలు చేస్తున్నాము. ముందుగా నిర్ణయించి టైంటేబుల్ ప్రకారం సబ్జెక్ట్‌పై అవగాహన కల్పించేలా ఆదేశాలిచ్చాము. సబ్జెక్ట్ నిపుణులు తయారు చేసిన ప్రశ్నపత్రాన్ని ఆన్‌లైన్‌లో తీసుకుని నిత్యం విద్యార్థులతో రాయిస్తున్నాము. ఈ ఏడాది రెండు రకాలుగా వందరోజుల ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నాము. ఏ, బీ గ్రూప్ విద్యార్థుల కోసం షైనింగ్‌స్టార్స్ ప్రోగ్రాం, సీ, డీ గ్రేడ్‌ల విద్యార్థులకు రైజింగ్‌స్టార్స్ ప్రోగ్రామ్ అమలు చేస్తున్నాము. అంతర్గత మార్కుల వివరాలను తల్లిదండ్రులతో చర్చించి ప్రోగ్రెస్ కార్డులను అందించి ఇంటివద్ద విద్యార్థులు ఎలా సన్నద్ధం కావాలన్న విషయాలపై దిశానిర్దేశం చేస్తున్నాము.

\- డాక్టర్ ఆర్.బాలాజీరావు, జిల్లా విద్యాశాఖాధికారి




రోడ్డు ధ్వంసం... ప్రయాణం నరకం!

అనంతసాగరం డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు - సోమశిల ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పీడీపల్లి, మంచాలపల్లి, కమ్మవారిపల్లి, పడమటికంభంపాడు, సోమశిల గ్రామాల వద్ద రహదారి నరకప్రాయంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షానికి ద్విచక్రవాహనాలు వెళ్లలేని పరిస్థితి. సోమశిల రోడ్డు బాగా లేక ఉప్పలపాడు వరకు మాత్రమే ఆర్టీసీ సర్వీసులు నడిపారు. ఇక సోమశిల - కలువాయి రోడ్డు కూడా ఇదే పరిస్థితి. జలాశయం వద్ద గుంతలు పడి అధ్వానంగా మారింది. మొత్తంగా సోమశిల ప్రయాణమంటే ప్రజలు భయంతో వణికిపోతున్నారు.

నెల్లూరు నుంచి కలువాయిని వేరుచేయవద్దు..!

కలువాయి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కలువాయిని నెల్లూరు జిల్లా నుంచి విడదీవద్దని శనివారం అంబేడ్కర్ విగ్రహానికి ఏడీపీఎస్ నాయకులు వినతిపత్రం అందచేశారు. అంబేడ్కర్ 69వ వర్ధంతి సందర్భంగా ఏడీపీఎస్ ఆధ్వర్యంలో బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కలువాయిని, గూడూరు డివిజన్‌ను తిరుపతి జిల్లాలోకి మార్పు చేస్తూ



తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా వారు నిరసన తెలిపారు. సేవ్ కలువాయి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏడీపీఎస్ రాష్ట్ర నాయకులు నిజమాల ప్రసాద్ మాట్లాడుతూ కలువాయిని తిరుపతి జిల్లాలో కలిపితే పేద ప్రజలు ఇబ్బంది పడుతారని అన్నారు. స్థానిక ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం గుర్తించి నెల్లూరులోనే ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమానికి స్థానిక యువకులు మద్దతు తెలిపారు. కాగా మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపొద్దంటూ శనివారం రాత్రి కలువాయిలో కొవొత్తులు ర్యాలీ నిర్వహించి, నిరసన తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు, యువత కలసి పడమర వీధి కొవొత్తులు పట్టుకుని ర్యాలీగా బస్టాండుకు చేరుకున్నారు. బస్టాండులో నిరసన వ్యక్తం చేశారు.



నిఘా నేత్రం వేలాడుతోంది!

సంగం (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో మెయిన్ బజార్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా వేలాడుతూ నేల చూపు చూస్తోంది. గత మూడు రోజులుగా ఇలా వేలాడుతోందని, పోలీసులు స్పందించి వెంటనే సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

త్యాగమూర్తులు..మన సైనికులు

- వెలకట్టలేనివి వారి సేవలు
- ఎందరో అమరులు..వారి స్మృతికి చిహ్నమేదీ..?
- నేడు సాయుధ దళాల పతాక దినోత్సవం

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : దేశం యావత్తు నిద్రలో ఉండగా...సరిహద్దుల్లో గడ్డకట్టే చలిలోనూ.... ఎడారి మధ్యలో మండే వేడిని తట్టుకుని... కుటుంబానికి దూరంగా ఉంటూ గస్తీ కాచే యోధులు మన సైనికులు. వారిని స్మరించుకుంటూ, వారి సంక్షేమాన్ని కోరుతూ డిసెంబరు 7న (నేడు) సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.

● కార్గిల్ పోరాట స్ఫూర్తి

నాదేశ భూభాగంలో ఒక్క ఇంచ్ కూడా తాకనివ్వను అనేంత తెగువ. శత్రుదేశ సైనికులను సరిహద్దులు దాటించేవరకు పోరాడిన ధైర్యం. భరతమాత కోసం ప్రాణాలైనా అర్పించేటంతటి త్యాగం... నాడు సైనికుల వీరోచిత పోరాట ఫలితంగా కార్గిల్ యుద్ధంలో చారిత్రక విజయం. అత్యంత క్లిష్ట సమయంలో పాకిస్తాన్ సైనికులను ఆక్రమిత భారత భూభాగం నుంచి తరిమికొట్టిన రోజది. ఎప్పటికీ గుర్తిండి పోతుంది. ఇలాంటి ఎన్నో విజయాలను మనం స్ఫూర్తిగా తీసుకుంటున్నాం. కుటుంబాన్ని రక్షించేది పోలీసు అయితే.. దేశాన్ని రక్షించేది మాత్రం సైనికులే. సైనికులు సరిహద్దుల్లో నిలబడటం వల్లే మనం స్వేచ్ఛగా జీవిస్తున్నాం.ఈ క్రమంలో సైనికుల సంక్షేమం కోసమే సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

● సైనికుల సంక్షేమం కోసం...

దేశాన్ని కాపాడుతూ ప్రాణాలు అర్పించిన వీర సైనికుల కుటుంబాలు, యుద్ధాల్లో గాయపడిన, అర్హతలు కోల్పోయిన సైనికులు, పింఛన్‌పై జీవనం సాగిస్తున్న మాజీ సైనికుల కోసం నిధు



లు సేకరించటం లాంటి సంక్షేమ కార్యక్రమాలను సాయుధ దళాల పతాక దినోత్సవం నాడు చేస్తుంటాం. ఈనెల 7న (నేడు) కలెక్టర్ హిమాన్షు శుక్లా మాజీ సైనికులకు విరాళాన్ని అందచేయనున్నారు. ఈనెల 8 నుంచి జిల్లా సైనిక సంక్షేమాధికారి హరికృష్ణ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ విస్తృతంగా సాగనుంది. కాగా పతాక దినోత్సవ కారు ఫ్లాగ్‌లను, స్టిక్కర్లను కలెక్టర్ ఇప్పటికే ఆవిష్కరించారు.

● 3వేల మంది మాజీ సైనికులు

జిల్లాలో 3వేల మంది వరకు మాజీ సైనికులు ఉన్నారు. వారిలో 67 మందికి 280 ఎకరాల భూములను కేటాయించారు. మాజీ సైనికులు ఎక్కువగా నెల్లూరు రూరల్, ఉదయగిరి నియోజకవర్గాల్లో ఉన్నారు. 2023-24లో మెప్మా పొదుపు మహిళలు సైనిక సంక్షేమానికి రూ.18 లక్షల విరాళాన్ని అందచేశారు. 2024-25లో జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయానికి రూ. 8 లక్షల విరాళాలు అందాయి.

● అమరజవానుల స్థూపం ఏదీ...?

జిల్లాలోని ఎందరో సైనికులుగా పనిచేసి అమరులయ్యారు. వారికి స్మృతికి చిహ్నంగా అమర్ జవానుల స్థూపం నెల్లూరులో ఏర్పాటు చేయలేదు. నగరంలోని ప్రధాన కూడలిలో ఆ స్థూపాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● స్పర్శ కేంద్రం ఏర్పాటు

జిల్లాలో మాజీ సైనికులకు పెన్షన్లు, వారి కుటుంబ సభ్యులకు పెన్షన్లు అందేలా చూడటానికి జిల్లా సైనిక సంక్షేమాధికారి కార్యాలయంలో స్పర్శ కేంద్రాన్నిఏర్పాటు చేశారు. ఇందులో వారి సమస్యలు పరిష్కరించుకోవచ్చు. మాజీ సైనికులకు గుర్తింపు కార్డులు కూడా ఇచ్చే ఏర్పాట్లు చేశారు.

సంక్షేమానికి అన్నీ చర్యలు తీసుకున్నాం



జిల్లాలో మాజీ సైనికుల సంక్షేమానికి అన్నీ చర్యలు తీసుకున్నాం. వారికి భూములు వచ్చేలా చూశాం. ఆక్రమణకు గురైన వారి స్థలాలను, తిరిగి వారికి వచ్చేలా అధికారులతో మాట్లాడుతున్నాం. పదవీ విరమణ పొందిన తరువాత నేరుగా తమ కార్యాలయంలో సంప్రదిస్తే పింఛన్ వచ్చేలా తక్షణ చర్యలు తీసుకుంటాం.

- హరికృష్ణ, జిల్లా సైనిక సంక్షేమాధికారి

అవసరాల మేరకే యూరియా

● పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు ● కలెక్టర్

నెల్లూరు(వ్యవసాయం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):రైతుల అవసరాల మేరకు యూరియా పంపిణీ చేయాలని కలెక్టర్ హిమాన్షుశుక్ల వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శనివారం ఆయన డీఏవో సత్యవాణితో కలిసి వ్యవసాయశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు అవసరమైన యూ రియాను అందిస్తున్నామన్నారు. పంపిణీలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బహిరంగ మార్కెట్లలో యూరియా నిల్వచేయడం, అధిక ధరలకు విక్రయించినట్లు గుర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. విజిలెన్స్, ఇంటలిజెన్స్ అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ హిమవంశీ, మార్క్‌ఫెడ్ డీఎం పవన్‌కుమార్, ఇంటలిజెన్స్ సీఐ నరసింహారావు, సివిల్ సప్లైస్ అధికారులు లీలారాణి, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, పక్కనే డీఏవో సత్యవాణి

హోంగార్డుల సంక్షేమానికి చర్యలు

● ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ● అట్టహాసంగా హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం

నెల్లూరు(క్రైం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): హోంగార్డుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల తెలిపారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో శనివారం 63వ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో హోంగార్డులు అంతర్భాగమన్నారు. పోలీసులతో సమానంగా విధులు నిర్వహిస్తూ నీతి, నిజాయితీ, అంకితభావంతో పనిచేస్తూ హోంగార్డు యూనిట్‌కు, పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా అనారోగ్యంతో మరణించిన సురేష్ సతీమణికి హోంగార్డు ఉద్యోగానికి సంబధించిన నియామక పత్రం అందజేశారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన 26 మందికి ప్రశంసపత్రాలు అందజేశారు. అనంతరం హోంగార్డులు కాన్ఫరెన్స్ హాలు నుంచి కేవీఆర్ పెట్రోలు బంకు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న హోమ్ గార్డులు

గాడితప్పుతున్న పోలీస్

> ప్రశాంత జిల్లాలో వరుస ఘటనలు
>
> రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌తో చర్యలకు ఆదేశం
>
> వరుసగా సస్పెన్షన్లు, వీఆర్‌కు పోలీసులు

నెల్లూరు(క్రైం) డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ప్రాణ, ఆస్తికి రక్షణగా నిలవాల్సిన పోలీసులే గాడితప్పుతున్నారు. అక్రమార్జనకు అలవాటుపడి విధులను గాలికి వదిలేస్తున్నారు. జిల్లాలో పోలీసు శాఖలో వరుసగా సస్పెన్షన్లు వీఆర్‌లు, బదిలీలు, చార్జ్‌మెమోలు అందుకోవడం ఇందుకు నిదర్శనం. ప్రశాంతంగా ఉన్న నెల్లూరు జిల్లా గత కొన్ని సంవత్సరాలుగా నేరాలకు, ఘోరాలకు అడ్డాగా మారిపోయింది. పట్టపగలే హత్యలు జరుగుతుండటం పరిస్థితికి అద్దం పడుతోంది. వరుసగా జరుగుతున్న ఘటనలతో రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ కావడంతో పోలీస్ ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు.

● ఎన్ని కేసులో...

రౌడీషీటర్ శ్రీకాంత్, లేడీ డాన్ అరుణలకు సహకరించిన ఏఆర్ ఏఎస్పీ మునిరాజ వీఆర్‌కు వెళ్లగా, నలుగురు ఏఆర్ సిబ్బంది సస్పెన్షన్‌కు గురయ్యారు. గతంలో ఏఆర్ హోంగార్డు ఆర్‌ఐగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణ ఓ ఏఆర్ మహిళా కానిస్టేబుల్‌తో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో ఆ ఆర్‌ఐ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దిశా పోలీసులు కేసు నమోదు చేసి శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. అయితే విచారణలో నిజమని తేలడంతో ఆ ఇద్దరిని పోలీసు శాఖ నుంచి డిస్మిస్ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన జంటహత్యల పరిణామంలో ఇన్‌స్పెక్టర్ దశరథ రామారావుతోపాటు ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ మల్లిఖార్జునను సస్పెండ్ చేశారు. ఇక ఇటీవల విడవలూరుకు చెందిన హెడ్‌కానిస్టేబుల్ పుల్లారెడ్డి నెల్లూరులోని ఓ హోటల్‌లో పేకాట ఆడుతుండగా పోలీసులు దాడులు చేసి అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆయన్ను ఎస్పీ అజిత సస్పెండ్ చేశారు. ఈ అంశాలు పక్కన పెడితే గతంలో ఎప్పుడూ లేనివిధంగా మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ చెంచురామారావుపై వచ్చిన అవినీతి ఆరోపణలపై డీజీపీ సస్పెండ్ చేశారు. ఈ విషయం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఇక ఇటీవలే నెల్లూరు సీసీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ క్రమశిక్షణ రాహిత్యంగా వ్యవహరించిన నిరంజన్‌ను సస్పెండ్ చేశారు. అలాగే, నగరంలోని వేదాయపాలెం పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌ను సైతం 20 రోజులకుపైగా స్టేషన్‌కు రావద్దని ఎస్పీ ఆదేశించడం విశేషం. అదే స్టేషన్లో ఓ హెడ్‌కానిస్టేబుల్‌ను అవినీతి ఆరోపణల నేపథ్యంలో డీసీఆర్‌బీకి అటాచ్ చేశారు. ఆ వెంటనే జిల్లా వ్యాప్తంగా పోలీసు స్టేషన్లలో ఉన్న ఐడీ పార్టీలు, క్రైమ్ పార్టీల వివరాల జాబితాను ఎస్పీ తీసుకోవడంతో మరింత మందిపై వేటు పడుతుందన్న ఆందోళన ఇటు అధికారులు, సిబ్బందిలోనూ నెలకొంది.

● అధికారులకు చార్జ్ మెమోలు

జిల్లా ఎస్పీగా డాక్టర్ అజిత వేజెండ్ల బాధ్యతలు చేపట్టిన తర్వాత నేర నియంత్రణలో విఫలమవుతున్న పోలీసు అధికారులకు వరుసగా చార్జ్ మెమోలు జారీ చేస్తున్నారు. నేరం జరిగిన వెంటనే నిందితులను అరెస్ట్ చేయలేక పోవడం, నేరం జరుగుతుందని ముందుగా ఎందుకు గుర్తించలేక పోయారు, అవినీతి ఆరోపణలు, ఇలా అనేక అంశాలపై పోలీసు అధికారులకు చార్జ్ మెమోలు వరుసగా అందిస్తున్నారు. ఈ క్రమంలో అధికారులు అప్రమత్తమవుతున్నారు.

డీకేడబ్ల్యూ కళాశాలలో పీజీ అడ్మిషన్లు

నెల్లూరు(విద్య), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : డీకేడబ్ల్యూ మహిళా డిగ్రీ కళాశాలలో పీజీసెట్ అర్హత లేకపోయినా సోమవారం నుంచి అడ్మిషన్ల జరుగుతాయని ప్రిన్సిపాల్ డీ.గిరి ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ సెట్ అర్హత సాధించకపోయినా, సెట్ రాయకపోయినా ఎమ్మెస్సీ జువాలజీ, ఎంఏ తెలుగు పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కోటాలో చేరే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తించదని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

వైద్యం అందక వివాహిత మృతి



గిరిజమ్మ (ఫైల్)

మనుబోలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరదల కారణంగా ఓ వివాహితకు వైద్యం అందక మృతిచెందిన సంఘటన మండలంలోని కొలనుకుదురులో గురువారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబసభ్యుల కథనం మేరకు.. మండలంలోని తీర ప్రాంత గ్రామమైన కొలనుకుదురు అరుంధతివాడకు చెందిన పిగిలాపు గిరిజమ్మ వ్యవసాయ కూలీ. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. గురువారం రాత్రి పది గంటల సమయంలో ఛాతీలో నొప్పి వచ్చింది. దీంతో 108కు ఫోన్ చేశారు. రోడ్డు మార్గంలో నీళ్ళు ఉన్నందున గ్రామం వరకు రాలేమని, పేషెంట్‌ను మనుబోలు పొలాలు ఉన్న రోడ్డు వరకు తీసుకురావాలని 108 సిబ్బంది చెప్పారు. దీంతో ఆటోలో గిరిజమ్మను తీసుకుని వెంకన్నపాళెం వరకు వచ్చారు. అక్కడ నుంచి ఆటో అవతలికి వెళ్ళలేకపోవడంతో గ్రామస్తుల సహకారంతో ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి అందులో గిరిజమ్మను తీసుకెళ్ళారు. అందుకు రెండు, మూడు గంటల సమయం పట్టింది. 108 దగ్గరకు పేషెంట్ వెళ్ళగా సిబ్బంది ప్రాథమిక పరీక్షలు చేశారు. తీసుకు రావడం ఆలస్యం కావడంతో గిరిజమ్మ అప్పటికే చనిపోయినట్లు సిబ్బంది నిర్ధారించారు. దీంతో కుటుంబసభ్యులు విలపించారు.

పురిటి గడ్డ రుణం తీర్చుకుంటా!

పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నెల్లూరు సిటీ నియోజకవర్గంలో కార్యకర్తలకు అండగా ఉండి పురిటి గడ్డ రుణం తీర్చుకుంటానని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి కుమార్తె షరిణీతో కలిసి వీధి వ్యాపారులకు తోపుడు బండ్లు, కార్యకర్తల సంక్షేమనిధి కింద 303 మంది టీడీపీ కార్యకర్తలకు రూ.76 లక్షల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. వారి సంక్షేమానికి ప్రతి ఏడాది రూ.10 కోట్లు కేటయిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ.3.60 కోట్ల చెక్కులను కార్యకర్తలకు అందించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఒక్కొక్కరికి రూ.25వేల వంతున అందించినట్లు చెప్పారు. ప్రజలను, తనను భుజాలపై మోసే కార్యకర్తలకు ఎంతో రుణపడి ఉంటానన్నారు. మంత్రి కుమార్తె షరిణీ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మంత్రి నారాయణ అన్ని హామీలు నెరవేర్చుతున్నారన్నారు. నగరాన్ని మెట్రోపాలిటిన్ సిటీగా మార్చేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల ఫలితాలు రాకముందే కార్యకర్తల సంక్షేమానికి రూ.10 కోట్ల కేటాయించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కప్పిర శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ రూపకుమార్ యాదవ్, తాళ్లపాక అనూరాధ, విజేతరెడ్డి, టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, డివిజన్ కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు



కార్యకర్తలకు చెక్కు అందజేస్తున్న మంత్రి నారాయణ కుమార్తె షరిణీ

వీఎస్‌యూ అథ్లెటిక్స్ క్రీడా పోటీలు ప్రారంభం

కావలి (టౌన్), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వీఎస్‌యూ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ క్రీడా పోటీలు జేబీ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ డీఆర్ క్రీడాప్రాంగణంలో శనివారం ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం నాయుడు అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభకు ముఖ్య అతిథిగా వీఎస్‌యూ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి డాక్టర్ వెంకట్రాయులు పాల్గొన్నారు. ముందుగా ఆయన క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గెలుపోటములతో సంబంధం లేకుండా పట్టుదల, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి అలవర్చుకోవాలన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అథ్లెటిక్స్ పోటీలు మహిళలు, పురుషుల విభాగాల్లో జరుగుతున్నాయని, వర్సిటీ పరిధిలోని 20 కళాశాలల నుంచి దాదాపు 150మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఆదివారం పోటీలు ముగుస్తాయన్నారు.

● మహిళా చాంపియన్‌గా జేబీ క్రీడాకారిణి అపర్ణ

మహిళల వ్యక్తిగత విభాగంలో జేబీకి చెందిన అపర్ణ 5 ఈవెంట్లలో ప్రతిభ కనబరిచి వీఎస్‌యూ మహిళా చాంపియన్‌గా నిలిచారు. మహిళల విభాగంలో అబ్జర్వర్‌గా అమ్మాజీ, పురుషుల విభాగంలో అబ్జర్వర్‌గా ప్రవీణ్ వ్యవహరించారు. కార్యక్రమంలో వివిధ డిగ్రీ కళాశాలల పీడీలు, జేబీ అధ్యాపకులు పాల్గొన్నారు.



విజేతలను మెడల్స్‌తో అభినందిస్తున్న డాక్టర్ వెంకట్రాయులు, సుబ్రహ్మణ్యం నాయుడు

పూరి జగన్నాథుడు సాక్షాత్తు విష్ణు స్వరూపం

చాగంటి కోటేశ్వరరావు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీపూరి జగన్నాథస్వామి సాక్షాత్తు విష్ణుస్వరూపమని, శ్రీ శంకరాచార్యస్వామి మనకు అందించిన గొప్ప అష్టకం శ్రీజగన్నాథఅష్టకమని ప్రవచన చక్రవర్తి చాగంటి కోటేశ్వరరావు అన్నారు. శనివారం నగరంలోని టౌన్ హాల్లో శ్రీ భరద్వాజ రుద్రాభిషేక సంఘం ఆధ్వర్యంలో ప్రవచన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చాగంటి మాట్లాడుతూ ప్రస్తుతం మనం పూరి క్షేత్రంగా వ్యవహరిస్తున్న క్షేత్రం పేరు పురుషోత్తముని పురి అని పేర్కొన్నారు. తూర్పున పూరిక్షేత్రంలో జగన్నాథుడిగా, పశ్చిమాన ద్వారక క్షేత్రంలో శ్రీకృష్ణుడిగా, ఉత్తరాన బదరికా క్షేత్రంలో బదరీనారాయణుడిగా, దక్షిణాన శ్రీరంగంలో శ్రీరంగనాథుడిగా దేశం నాలుగు దిక్కులా విస్తరించి ఉన్నాడన్నారు.

స్పా సెంటర్లపై పోలీసుల దాడులు

పలువురు అదుపులోకి.. కేసుల నమోదు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలో స్పా సెంటర్ల ముసుగులో జరుగుతున్న అసాంఘీక కార్యకలాపాలపై సమాచారం అందుకున్న ఎస్పీ ప్రత్యేక బృందంతో పాటు ఆ పరిధిలోని పోలీసు స్టేషన్‌ల అధికారులు శనివారం రాత్రి దాడులు చేశారు. నగరంలోని నిప్పో సెంటర్ పుట్టవీధి పరిధిలోని ఎవ్‌రీడే స్పా సెంటర్‌లో తనిఖీలు చేపట్టి పలువురు యువతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాలాజీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని జగదీష్ నగర్‌లో యూనిక్స్ సెలూన్ స్పాపై దాడి చేసి ముగ్గురు యువతులు, ఒక విటుడిని అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకుడు సుధీర్‌పై కేసు నమోదు చేస్తున్నామని బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు తెలిపారు. రామలింగాపురంలోని వీఐపీ స్పాపై దాడి చేసి ఇద్దరు యువతులను అదుపులోకి తీసుకొని నిర్వాహకురాలైన కృష్ణవేణిపై కేసు నమోదు చేశారు. పోలీసుల దాడులతో పలువురు స్పాల నిర్వాహకులు స్పా సెంటర్‌లకు తాళాలు వేసుకొని పరారయ్యారు. ఈ దాడుల్లో నగర ఇన్‌చార్జి డీఎస్పీ ఎం గిరిధర్ పాల్గొన్నారు.

స్థానిక సమరానికి సన్నద్ధం కావాలి

● పశు సంవర్ధక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ లీలావతి

ముత్తుకూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల సమరానికి సన్నద్ధం కావాలని పశుసంవర్ధక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గుండాల లీలావతి పిలుపునిచ్చారు. ముత్తుకూరు టీడీపీ కార్యాలయంలో శనివారం మండల అధ్యక్షులు నీలం మల్లికార్జునయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బూత్ ఇన్‌చార్జ్‌ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికి చేర్చే బాధ్యతను కార్యకర్తలు తీసుకోవాలన్నారు. స్థానిక ఎన్నికల సమరానికి ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలన్నారు. ఏకగ్రీవంగా స్థానిక ఎన్నికల్లో విజయభేరీ సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నికల బూత్ ఇన్‌చార్జ్‌లు ఇప్పటి నుంచి తమ పరిధిలో మెజారిటీ తెచ్చేందుకు కష్టపడాలన్నారు. సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో అన్నీ వర్గాల ప్రజల సంక్షేమం కోసం పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల దృష్టికి తేవడంతో పాటు ప్రతిపక్ష వైసీపీ అరాచక అకృత్యాలను ఎండగట్టాలన్నారు. అనంతరం క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షులు రాగాల శివకృష్ణ, నాయకులు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, పల్లికొండ శీనయ్య, శ్రీధర్‌రెడ్డి, నర్సారెడ్డి, ముత్యంగౌడ్, శ్రీనివాసులు, జనార్ధన్, నాగార్జున, సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర డైరెక్టర్ లీలావతి

సంగం బ్యారేజీ రహదారిపై భారీ గుంత



సంగం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సంగం ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం వద్ద బ్యారేజికి వెళ్లే రహదారిలో భారీ గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. బ్యారేజి నిర్మించిన ఏజెన్సీ పాత కనిగిరి ప్రధాన కాలువ వంతెన నుంచి బ్యారేజి వరకు సిమెంట్ రహదారి నిర్మించాలి. కానీ బ్యారేజి నుండి ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం వరకు నిర్మించి వదిలేశారు. కాగా, సిమెంట్ రోడ్డు నిలిపేసిన చోట వాహనాలు దిగేందుకు అనువుగా గ్రావెల్ వేశారు. వర్షాలకు గ్రావెల్ దెబ్బతిని ఒకవైపు గుంత ఏర్పడింది. దీంతో బ్యారేజి వైపు నుంచి వేగంగా వచ్చే వాహనాలు గుంతలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతేకాకుండా ఎదురెదురుగా వచ్చే వాహనాలు గుంతను తప్పించబోయి ఒకదానికొకటి ఢీకొంటున్నాయి. ఏజెన్సీ నిర్వాహకులు వెంటనే స్పందించి భారీ గుంతను పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	150
స్కిన్ చికెన్	270
స్కిన్‌లెస్	294

కోడిగుడ్ల ధర (100): 670

ప్రాథమిక స్థాయిలోనే అభ్యసన సామర్థ్యాల పెంపునకు చర్యలు

కొండాపురం, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు విద్యాశాఖ జీఎఫ్ఎల్ఎన్ రూపొందించిందని మండల విద్యాశాఖాధికారి-2 ఆనందరావు శనివారం తెలిపారు. వారం నుంచి డైట్ కళాశాల విద్యార్థులు మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. వెను కంజలో ఉన్న పిల్లలను గుర్తించి ఈనెల 8 నుంచి 75 రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. పా ఠశాలల్లో ఉపాధ్యాయులు జీఎఫ్ఎల్ఎన్ కార్యక్ర మాన్ని విధిగా అమలుచేయాలని విద్యాశాఖ ఆదేశా లు జారీచేసిందని ఆయన తెలిపారు.



పల్లెసీమల అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే ఇంటూరి



పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

లింగసముద్రం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పల్లెసీమల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని మేదరమెట్ల పాలెం గ్రామంలో రూ.32 లక్షలతో ఉపాధిహామి పథకం నిధులతో నిర్మించనున్న పంచాయతీ కార్యాలయం భవనానికి ఆయన స్థానిక సర్పంచు కూరపాటి మాధవితో కలిసి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ నిధులన్నీ పక్కదారి పట్టించడంతో గ్రామాల పరిస్థితి దారుణంగా తయారైందని విమర్శించారు. ప్రభుత్వంలో 15వ ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీలకు జమ చేయడంతో గ్రామాల్లో సీసీ రోడ్లు, సైడు కాలువల నిర్మాణం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం మండలానికి తాగునీటి సరఫరా కోసం మరో రూ.2 కోట్ల చొప్పన నిధులు విడుదలయ్యాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావును సర్పంచు మాధవి, టీడీపీ నాయకులు కే శ్రీనివాసులు, గ్రామస్థులు, అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ డీఈ చంద్రమౌళి, ఏఈ శ్రీరామ్, ఇన్‌చార్జి ఏపీడీ జే బాబురావు, ఎంపీడీవో కే శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు పీ గురునాథం, టీడీపీ నాయకులు కే భాస్కరరావు, ఎస్ మనోహర్, గొర్రిపాటి సాంబయ్య, మాజీ సర్పంచు నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

● ఫిర్యాదులు వస్తే సహించేది లేదు

వలేటివారిపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అన్నప్రసాదంలో భక్తుల నుండి ఫిర్యాదులు వస్తే సహించేదిలేదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆలయ అధికారులను హెచ్చరించారు. మండలంలోని మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామిని శనివారం ఆయన దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అన్నదాన సత్రంలో అన్నం, లడ్డుకౌంటర్‌లో లడ్డుప్రసాదంను స్వయంగా రుచి చూసి భక్తులకు నాణ్యమైన ప్రసాదం అందించాలని సూచించారు. ఆయన వెంట ఆలయ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్, మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు ప్రగడ శ్రీనివాసులు, కాకుమాను హర్ష, కామినేని అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం : సీనియర్ సివిల్ న్యాయాధికారి



సమావేశంలో మాట్లాడుతున్న కందుకూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభ

కందుకూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజ మార్గమని, కేసులను ఎంత త్వరగా పరిష్కరించుకుంటే కక్షిదారులకు అంత త్వరగా ఉపశమనం లభిస్తుందని సీనియర్ సివిల్ న్యాయాధికారి, మండల లీగల్‌సెల్ అథారిటీ ఛైర్మన్ ఎం. శోభ అన్నారు. శనివారం ఆమె డివిజన్‌లోని పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమావేశమై ఈనెల 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషిచేయాలని కోరారు. అడిషనల్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ నిఖిల్‌రెడ్డి మాట్లాడుతూ సివిల్ దావాలతో పాటు ఇరుపార్టీలు రాజీపడితే క్రిమినల్ కేసులను కూడా ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునన్నారు. ఈ సమావేశంలో కందుకూరు, గుడ్లూరు సీఐలు అన్వర్‌బాషా, మంగారావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి శ్రీధర్‌నాయుడు, ఏజీపీ బెజవాడ కృష్ణయ్యచౌదరి, న్యాయవాదులు టి తిరుమలరావు, బీవీ మురళీకృష్ణ, బి సాయిశంకర్, ఎస్. పవన్‌కుమార్, ఎస్కే షంషుద్దీన్, ఏవీ సుబ్బరామయ్య, వై. యలమందరావు, పి. సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేయాలి : జడ్పీటీసీ



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ భారతి

వలేటివారిపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి కృషి చేయాలని జడ్పీటీసీ సభ్యురాలు ఇంటూరి భారతి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో జడ్పీటీసీ భారతి మాట్లాడుతూ సభ్యులు తెలిపిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి చెన్న కేశవులు, ఎంపీడీఓ శంకరరావు, పోలినేని పాలెం ఎంపీటీసీ చింతలపూడి రవీంద్ర, చుండి ఎంపీటీసీ చౌడబోయిన యానాది, సర్పంచ్‌లు ఇరపని సతీష్, చెన్నిబోయిన ఓబులుకొండయ్య, సాధు శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలకు ప్రాధాన్యం



పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

కావలి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో ఫిజియోథెరపీ సేవలకు ఎంతో ప్రాధాన్యత పెరుగుతోందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. కావలిలోని శ్రీలక్ష్మీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపీ తొలి స్నాతకోత్సవ కార్యక్రమం శనివారం కావలిలో జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణతో కలిసి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. తొలిబ్యాచ్ ఫిజియోథెరపీ విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా డిగ్రీ పట్టాలు అందజేశారు. తొలిబ్యాచ్ విద్యార్థులు క్లినికల్ శిక్షణలో మంచి నైపుణ్యం సంపాదించారని కరస్పాండెంట్ డాక్టర్ మాధవరెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు బెజవాడ రవికుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేను త్వరగా పూర్తి చేయాలి

లింగసముద్రం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటిపన్నులు త్వరగా వసూలు చేయాలని సూచించారు. అలాగే సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు

ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలి

లింగసముద్రం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా పని చేయాలని కందకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశించారు. శనివారం సాయంత్రం మండలంలోని మొగిలిచెర్ల సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది హాజరు పట్టీలను తనిఖీ చేశారు. సచివాలయానికి వచ్చిన అర్జీలను పరిశీలించారు. ప్రజలను తిప్పుకోకుండా వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. పెండింగ్ అర్జీలపై సిబ్బందితో చర్చించారు.

హోంగార్డులకు సన్మానం



హోంగార్డుకు షీల్డు అందచేస్తున్న ఎస్పీ

కందుకూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): హోంగార్డ్స్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కందుకూరు సర్కిల్‌లో ఉత్తమ సేవలందించిన ఇద్దరు హోంగార్డులను జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల శనివారం సత్కరించారు. షేక్ నజీర్‌హుస్సేన్, ఎదురూరి చెన్నకేశవాచారిలను ఎస్పీ సత్కరించి మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా వారిని పలువురు అధికారులు, పోలీసు సిబ్బంది, సహచర హోంగార్డులు అభినందించారు.

రాత్రివేళ ఎరువుల తరలింపు : అడ్డుకున్న రైతులు



శుక్రవారం రాత్రి ఎరువులు తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్



రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కలిగిరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాత్రివేళలో సొసైటీ నుంచి అక్రమంగా ట్రాక్టర్లో తరలిస్తున్న ఎరువులను రైతులు అడ్డుకున్న ఘటన మండలంలోని కృష్ణారెడ్డిపాలెం వద్ద శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కుడుములదిన్నెపాడు సొసైటీ నుంచి శుక్రవారం అర్ధరాత్రి ట్రాక్టరులో దాదాపు 60 బస్తాల యూరియా, డీఏపీలను తరలించడాన్ని స్థానిక రైతులు గుర్తించి కలిగిరి- కొండాపురం మార్గంలో అడ్డుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో సీజన్ మొదలై ఎరువుల కోసం ఎదురుచూస్తున్నామని, తమ పొలాలకు యూరియా కావాలని అడిగితే స్టాకు రాలేదని చెబుతూ ఇతర మండలాలకు ఎలా పంపుతారని సీఈవో ఖాజా మస్తాన్ తీరును తప్పుబట్టారు. అక్రమంగా ఎరువుల తరలింపు వ్యవహారం తేల్చేదాకా ట్రాక్టరును కదలనివ్వమంటూ పలువురు రైతులు అడ్డుకున్నారు. దాంతో సొసైటీ ఛైర్మన్ బాసిం నరసింహులునాయుడు ట్రాక్టరు అడ్డుకున్న రైతులకు సర్ది చెప్పడంతో వివాదం ముగిసింది.

ఈ విషయమై మండల వ్యవసాయాధికారి ఎస్కే జహీర్‌ను వివరణ కోరగా అక్రమ తరలింపు విషయం తన దృష్టికి రావడంతో కుడుమలదిన్నెపాడు పీఏసీఎస్‌ను కావలి, ఉదయగిరి సబ్ డివిజన్ కో-ఆపరేటివ్ అధికారులతో తనిఖీ నిర్వహించామని తెలిపారు. గతంలో మిగిలిన 48 యూరియా, 9 డీఏపీ బస్తాలు తన సొంత పొలాలకు తీసుకెళ్లినట్లు ఛైర్మన్ తెలిపారన్నారు. సొసైటీల పరిధిలో రసీదులు, రైతుల వివరాలను నమోదు చేయకుండా ఎరువులు తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాడవాడలా అంబేడ్కర్‌కి నివాళి



లింగసముద్రం పంచాయతీ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు



ఉలవపాడు : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకులు



అల్లూరు : అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న బీద గిరిధర్, టీడీపీ నేతలు

కందుకూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సమ సమాజం కోసం కలలుకని అందుకోసం మార్గనిర్మించిన మహనీయుడు డాక్టరు బీఆర్ అంబేడ్కర్ అని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం డాక్టరు బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, చిలకపాటి మధుబాబు, చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాద్, రాయపాటి శ్రీనివాసరావు, షేక్ రఫీ, గోచిపాతల మోషే, పులి నాగరాజు, రెబ్బవరపు మాల్యాద్రి, కోటపూరి శ్రీనివాసరావు, సుదర్శి శ్యాంప్రసాద్, చనమాల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు. బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం పట్టణంలోని పాతబస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఏఎడీ అసోసియేషన్, మాలమహానాడు, మాల ఉద్యోగుల సంఘం డివిజన్ కమిటీల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పాలేటి కోటేశ్వరరావు, శీలం సుధీర్‌కుమార్, లింగాబత్తిన బ్రహ్మయ్య, బొట్లగుంట శ్రీనివాసులు, గేరా చిరంజీవి, చలమాల కోటేశ్వరరావు, కళ్యాణ్, ముప్పవరపు కిషోర్, రేణమాల అయ్యన్న, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచిలో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు. యూనియన్ నాయకులు దామా కొండయ్య, సూరపోగు ఏసుదాస్, శ్రీరామ మాలకొండయ్య, పాలేటి కోటేశ్వరరావు, బి. రాజేష్, దామోదర్, రామచంద్రరావు, కట్టా చరణ్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలోను అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● కావలి (టౌన్) : డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం పట్టణంలో టీడీపీ, బీజేపీ నాయకులు ఘన నివాళులర్పించారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు ట్రంకు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు అధ్యక్షతన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్‌పర్సన్ పి అలేఖ్య, నాయకులు మొగిలి కల్లయ్య, ముడికొండ సుకుమార్, పొట్లూరు శ్రీనివాసులు, తటవర్తి వాసు, ఏగూరు చంద్రశేఖర్, దేవకుమార్, వల్లేరు కిరణ్, అక్కిలగుంట సూరి, చవల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ముసునూరులో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నేతలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కనమర్లపూడి నారాయణ, గంధం ప్రసన్న, గుడ్లూరు మాల్యాద్రి, పరసు మాల్యాద్రి, గయాజ్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నేతలు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు జి భరత్‌కుమార్, కె బ్రహ్మానందం, బెల్లంకొండ మాల్యాద్రి, సీవీసీ సత్యం, కమల, పరుసు వెంకటేశ్వర్లు, సన్నిగంటి శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం : స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి స్వరంచు పులి రాఘవులు అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పీ బాలకోటయ్య, ముస్లీం మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ షఫి, మాజీ సర్పంచు యూ నాగేశ్వరరావు, మద్దు బాలు, అత్తింటి ప్రసాదు, టీ వెంకటేశ్వరరెడ్డి, కే తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు : మండలంలోని పలు గ్రామాల్లోను, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కార్యాలయాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఉలవపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గారపాటి గోపీచంద్ ప్రకాష్, అధ్యాపకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా ఉలవపాడు, ఆత్మకూరు, వీరేపల్లి, చాగొల్లు, చాకిచర్ల, రామాయపట్నం, కరేడు, రాజుపాలెం, భీమవరం, బద్ధిపూడి గ్రామాల్లో అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలకు పాలభిషేకం చేసి నివాళులు అర్పించారు.

అల్లూరు : అంబేడ్కర్ చూపిన స్ఫూర్తిబాటలోనే దేశమంతా నడుస్తోందని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పట్టణ పరిధిలోని పాత బస్టాండు కూడలిలో ఆయన విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసులురెడ్డి, తోట శ్రీహరి, కావలి జగన్, ఇస్మాయిల్, రాజశేఖర్‌బాబు, కత్తుల శ్రీకాంత్, అరగల రమణయ్య, కావలి కృష్ణ, శీనయ్య, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు. అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం 40 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు పప్పు సుధాకర్, గంగపట్నం సతీష్, కప్పల వంశీకృష్ణ, కమల్ తేజ, యశ్వంత్, రాము, జీవన్ పాల్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బిట్రగుంట : మండలంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు శనివారం పలువురు నివాళులర్పించారు. బోగోలు తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సిబ్బందితో కలిసి తమ కార్యాలయాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోగోలు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి న్యాయవాదులు ఇర్ల వెంకట రమణ, జొన్నాడ విజయ్ కుమార్, జి.ఏదిత్యకుమార్ తదితరులు నివాళులర్పించారు. టీడీపీ మండల కన్వీనర్ మాలెపాటి నాగేశ్వరరావు, కావలి ఏఎంసీ డైరెక్టర్ ఎల్.సుధీర్‌బాబు, గిరిజన నాయకుడు బోగిరి ప్రభాకర్, బి.ఫిలిప్ తదితరులు పూలమాలలు వేసి నివాలులర్పించారు. వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు, మాజీ సర్పంచి అంకులయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మేకల శ్రీనివాసులు, ఎంపీటీసీ ఏకే సుందర రాజ్, రసూల్ తదితరులు నివాళులర్పించారు.

నేడు కరేడులో జిల్లాస్థాయి జూడో ఎంపికలు

ఉలవపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో కరేడు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఆదివారం మధ్యాహ్నం జూడో పోటీల ఎంపికలు జరగనున్నట్లు ఆర్గనైజేషన్ కార్యదర్శి జీ మురళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు కర్నూల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. వివరాల కోసం 8919036160 నెంబరుకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉచిత పరీక్షలు

వెంకటాచలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలోని నారాయణ మెడికల్ కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ వారి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వర్ణభారత్ విద్యా మందిర్ విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కేఈసీ విద్యసాగర్, ల్యాబ్ టెక్నీషియన్ ఎం భాస్కర్ పాల్గొన్నారు.

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

ఇందుకూరుపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అడిషనల్ ప్రాజెక్టు అధికారి దగ్గినబోయిన వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరుజిల్లాలో 38 మంది మండలాల్లో 2 ఐఈఆర్‌టీలు, సీజీవీలు, సైకోథెరపిస్టులు ఉన్నారని ఇప్పటి వరకు సైకోథెరపిస్టు వారానికి ఒకరోజు వచ్చేవారని, ఇక వచ్చే నెల నుంచి వారానికి ఏడు రోజులు వస్తారని, ఆదివారం తప్ప మిగతా రోజులన్నీ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఐఈ కో ఆర్డినేట్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ సంవత్సరం అన్నీ అలవెన్సులు వారి వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయబడ్డాయని తెలిపారు.

మెప్మా ఆధ్వర్యంలో వైద్య శిబిరం



కూచిపూడి నృత్యకళాకారులను అభినందిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్


కావలి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్‌నగర్, వెంగళరావునగర్‌లోని ఆరోగ్య కేంద్రాల్లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాల్లో మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వీటిని మున్సిపల్ కమిషనర్ జి.శ్రావన్‌కుమార్ ప్రారంభించారు. ఈ శిబిరాలను మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.లీలారాణి సందర్శించి మహిళలతో మాట్లాడారు. అందరూ మంచి ఆరోగ్యం కలిగి ఉండాలనే ల క్ష్యంతో ఈ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఆరోగ్య సమస్య లున్న వారు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్యం పొందేలా ఆయుష్మాన్ భారత్ కార్డులను ఇచ్చామన్నారు. కార్యక్రమంలో మెప్మా హెల్త్ అండ్ న్యూట్రీషియన్ బి.కాంతయ్య, సీఎంఎం భారతి, సీవోల కొండయ్య, అరుణ, ప్రసన్న, ప్రతాప్, సునీత తదితరులు పాల్గొన్నారు.

● చిన్నారులకు కమిషనర్ అభినందన

కావలి (టౌన్) డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): చిన్నారులు నృత్య ప్రతిభా పాటవాలతో ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేర్లు నమోదు చేసుకొని నృత్య శిఖామణి అవార్డులు సాధించడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్ అన్నారు.

పట్టణ క్రిష్టియన్ పేటలోని సంయుక్త నృత్య కళానిలయంలో శనివారం నాట్య గురువు గంగపట్నం లిఖిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అవార్డులు సాధించిన చిన్నారులు జి ఖ్యాతి, ఎం సాయిశ్రీ, సుగాత్రిక, హాన్విక, రుత్విక, తనన్య, రిషిక, నిహాన్వి, ఉజ్వల, వైష్ణవి, మహితలను అభినందించారు. నాట్య గురువు లిఖితకు నాట్యాలంకార శిరోభూషణ్ అవార్డు లభించింది. కార్యక్రమంలో డాక్టర్లు వీవీ సుబ్బారావు, రవి కాంత్, సంస్థ సభ్యులు అజిత్‌బాబు, ప్రసాదరావు, ఖాదర్‌బాష పాల్గొన్నారు.

కారు అదుపు తప్పి పలువురికి గాయాలు



గాయపడినవారిని ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

వలేటివారిపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పి హైవే మార్జిన్ దిగడంతో పలువురికి గాయాలైన సంఘటన మండలంలోని కూనిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. అరుణాచలం నుండి మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని కారులో తిరిగి అరుణాచలం వెళ్తుండగా కూనిపాలెం వద్ద ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిలో రమేష్, వెంకటేశ్వర్లు, రాజ్యలక్ష్మీ, రాజేశ్వరితో పాటు తొమ్మిది నెలల పాప కూడా ఉంది. క్షతగాత్రులను వలేటివారిపాలెం 108లో సిబ్బంది పొట్టేళ్ల శ్రీకాంత్, రాజశేఖర్ కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

నేత్రదానం

కావలి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జెండా వీధికి చెందిన కేతు సూర్యనారాయణ(53) శనివారం తెల్లవారుజామున మృతిచెందారు. రెడ్‌క్రాస్ జిల్లా పాలకమండలి సభ్యుడు కలికి శ్రీహరిరెడ్డి, సామాజిక కార్యకర్త శివంకరరెడ్డి చొరవతో కుమారుడు కేతు సతీష్‌కుమార్ అంగీకారంతో ఆయన నేత్రాలను నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి దానం చేశారు. ఆయన కార్నియాలను ఎల్‌వీ ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన వైద్య నిపుణుడు సునీల్ సేకరించారు. నేత్రదాత కుటుంబ సభ్యులకు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ నేత్రదాన విభాగం కన్వీనర్ ఇలింద్ర శ్రీవాణి మాట్లాడుతూ పట్టణంలో ఇది 154వ నేత్రదానమని తెలిపారు.

బాధితులకు అండగా రెడ్‌క్రాస్



బాధిత మహిళకు దుస్తులు, వంటసామగ్రిని అందజేస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): విపత్తులు, ప్రకృతి వైపరీత్యాల బాధితులకు రెడ్‌క్రాస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కావలి రెడ్‌క్రాస్ విపత్తుల విభాగం కన్వీనర్ జనిగర్ల మనోహర్ తెలిపారు. పట్టణంలోని బుడంగుంట దళితకాలనీ మాతమ్మగుడి వీధికి చెందిన కేశవరపు సుగుణమ్మ పూరిల్లు శుక్రవారం రాత్రి కాలిపోయింది. దాంతో శనివారం ఉదయం రెడ్‌క్రాస్ సభ్యులు ఆమెను పరామర్శించి తక్షణ సహాయంగా నూతన దుస్తులు, వంట పాత్రలు, టార్పాలిన్ పట్ట అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా పాలకమండలి సభ్యుడు కలికి శ్రీహరిరెడ్డి, పట్టణ వైస్ ఛైర్మన్ కె.హరినారపరెడ్డి, పాలక మండలి సభ్యులు బెజవాడ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.